www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

5, 8 తరగతులకు నో డిటెన్షన్ రద్దు

విద్యార్థులు ఫెయిలైతే మళ్లీ పరీక్షలు

అయినా విఫలమైతే అవే తరగతుల్లో

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

2

హోండా, నిస్సాన్ విలీనం

మేమూ మీతోనే..: మిత్సుబిషి

చేయి కలిపిన జపాన్ ఆటో దిగ్గజాలు

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటోమొబైల్ కంపెనీగా అవతరణ

టయోటా, ఫోక్స్‌వేగన్ పోటీకి చెక్

10

మంగళవారం | 24-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 249 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: నవమి రా. 7.53 తదుపరి దశమి; నక్షత్రం: హస్త మ. 12.17 తదుపరి చిత్త; వర్జ్యం: రా. 9.18-11.07; దుర్ముహూర్తం: ఉ. 8.57-9.41, రా. 10.00-10.51; అమృతఘడియలు: శే. ఉ. 7.18; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.45; సూర్యాస్తమయం: 5.43 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అష్టదిగ్బంధనంలో అరబిందో

కాకినాడ పోర్టు లాభాలను పంచుకోడానికి వీల్లేదు

ఒక్కపైసా తీసుకోవడానికి కూడా అనుమతించబోం

డివిడెండ్లు తీసుకున్నా చర్యలు తప్పవని సీఐడీ హెచ్చరిక

లాక్కోవడమే అక్రమం.. ఇక లాభాలు అంటే నేరమే

నాలుగేళ్లలో రూ.102 కోట్లు తీసుకున్నారు

ఇక ఆపేయండంటూ అధికారుల స్పష్టీకరణ

అరబిందో డైరెక్టర్లను త్వరలో విచారించనున్న సీఐడీ

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ ప్రభుత్వ అండదండలతో ఆనాడు అక్రమాలకు పాల్పడిన అరబిందో సంస్థ చిక్కుల్లో పడింది. కాకినాడ పోర్టును వ్యాపారవేత్త కేవీ రావు నుంచి అరబిందో లాగేసుకున్న కేసు దర్యాప్తులో సీఐడీ దూకుడు పెంచింది. అరబిందో డైరెక్టర్లు, ఆరో ఇన్‌ఫ్రా సంస్థకు తాజాగా లేఖలు రాసింది. వ్యాపార లావాదేవీల్లో బెదిరింపులకు పాల్పడి 2021లో కేవీ రావు నుంచి 41.12 శాతం వాటాలు లాక్కున్నారని, దానిపై వచ్చిన లాభాలు, డివిడెండ్లు పంచుకోవడానికి వీల్లేదని ఆ లేఖలో హెచ్చరించింది. అలా పంచుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐడీ ఏడీజీ రవిశంకర్ అయ్యన్నార్ ఆ లేఖలో స్పష్టం చేశారు. 'డివిడెంట్ కింద రూ.102కోట్లు నాలుగేళ్లలో తీసుకున్నారు. ఇక ఆపేయండి' అని తేల్చిచెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు లేఖలో ఏముందంటే.. 'కేవీ రావు నుంచి యాజమాన్య హక్కులు లాక్కున్న దానిపై

మిగతా 2వ పేజీలో...

ఆర్థిక ఇబ్బందులు చూస్తే బాధేస్తోంది: చంద్రబాబు

6 నెలలుగా రాత్రింబవళ్లూ ఆలోచిస్తున్నా.. ఐదేళ్ల విధ్వంసానికి పరిష్కారం దొరకట్లేదు

గతంలో మూడుసార్లు సీఎంగా పనిచేసినా ఇప్పుడే చాలా కష్టంగా అనిపిస్తోంది

ప్రజలు నాకు ఓ బాధ్యత అప్పగించారు.. రాష్ట్రానికి పునర్వైభవం తీసుకువస్తా

మైనారిటీలు, పేదలకు అండగా ఉంటా.. వారి సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం

ఐదేళ్ల చెడు మళ్లీ జరక్కూడదు.. సెమీ క్రిస్మస్ వేడుకలలో ముఖ్యమంత్రి



బెజవాడలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న సీఎం చంద్రబాబు

నామినేటెడ్‌లో బీసీలకు కోటా

34% ఇచ్చి తీరతాం.. చట్టబద్ధతా కల్పిస్తాం: సీఎం

ప్రత్యేక రక్షణ చట్టంపై మరికొంత కసరత్తు

ఇబ్బందుల్లేకుండా రూపొందించాలి

బాలికల హాస్టళ్లకు తక్షణమే మరమ్మతులు

తక్షణమే డైట్, కాస్మొటిక్ చార్జీల చెల్లింపు

ఆ మూడు బీసీ భవనాలు పూర్తిచేయాలి

ప్రతి సామాజికవర్గానికీ కోఆపరేటివ్ ఫైనాన్స్

త్వరలోనే 104 శంకరన్ నాలెడ్జ్ సెంటర్లు

పింఛన్ల తనిఖీయే తొలగింపు కాదు

అర్హులకు ఆందోళన అక్కర్లేదు

తప్పుడు ధ్రువపత్రాలిచ్చే వైద్యులు, అధికారులపై చర్యలు: చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న హామీకి కట్టుబడి ఉన్నామని.. దీనికి కూడా చట్టబద్ధత తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోమవారమిక్కడ రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా

మిగతా 13వ పేజీలో...

మరో రూ.2,723 కోట్ల పనులు

రాజధానిలో జోన్ 7, 10 లేఅవుట్లలో రోడ్ల నిర్మాణం.. సీఆర్డీఏ అథారిటీ ఆమోదం

15లోపు పనులన్నిటికీ టెండర్లు

వెంటనే నిర్మాణ పనులు మొదలు

అమరావతి వ్యయం ప్రజలపై వేయం

భూముల అమ్మకం, సంపద సృష్టితో వచ్చే సొమ్ముతోనే అప్పులు తీరుస్తాం

రాజధానిపై వైసీపీకి ఇంకా కక్ష తీరలేదు

రుణమివ్వొద్దని ప్రపంచబ్యాంకుకు లేఖలు

మంత్రి పి.నారాయణ ఆగ్రహం

మున్సిపాలిటీలకు ఏప్రిల్ నుంచి నేరుగా నిధులు



5 అంతస్తుల వరకు అనుమతులు అక్కర్లేదు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి నిర్మాణాలు

మున్సిపాలిటీకి డబ్బు చెల్లిస్తే అన్ని అనుమతులూ మంజూరు

అన్ని శాఖలూ దానితో అనుసంధానం: మంత్రి

12

శ్యామ్ బెనగల్ ఇక లేరు

అనారోగ్యంతో ప్రముఖ దర్శకుడు మృతి


1934లో సికింద్రాబాద్‌లో జననం

ఓయూ నుంచి ఆర్థికశాస్త్రంలో పీజీ

1973లో అంకుర్ చిత్రంతో అరంగేట్రం

8 జాతీయ అవార్డులు సొంతం

పద్మశ్రీ, పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే, ఏయన్నార్ జాతీయ పురస్కారాలు గ్రహీత



భారతీయ సినిమాకు సామాజిక వన్నెలద్దిన దిగ్గజ సినీ దర్శకుడు.. భూదాన్ పోచంపల్లి చేనేత కార్మికుల జీవితాలను చిత్రికపట్టిన సృజనశీలి.. తెలంగాణ పల్లె జీవన చిత్రాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన కళాకారుడు.. శ్యామ్‌బెనగల్ ఇక లేరు. బాల్యం నుంచే సినిమాలను విపరీతంగా ఆరాధించిన ఆయన భారతీయ సినీ పరిశ్రమకు కేంద్రమైన ముంబైలో కన్నుమూశారు. సికింద్రాబాద్ సమీపంలోని అల్వాల్‌లో పుట్టి, ప్రపంచ ఖ్యాతి గడించిన శ్యామ్‌బెనగల్ మరలిరాని లోకాలకు వెళ్లిపోయారు. కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆయన సోమవారం కన్నుమూశారు. శ్యామ్‌బెనగల్ అసలు పేరు బెనగళ్ల శ్యామ్‌సుందరరావు. హైదరాబాద్‌లోని నిజాం కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించారు.

9

విచారణకు రండి

ఉదయం 11కు రావాలని అల్లు అర్జున్‌కు పోలీసుల నోటీసు



నేటి నుంచి రోజువారీ విచారణ?

బడ్జెట్ పెరిగితే టికెట్ రేట్లు పెంచాలి

సీఎంను కలిసే అంశంపై దిల్ రాజు వచ్చాక నిర్ణయం: నిర్మాత నాగవంశీ

ధరల పెంపు మధ్యతరగతికి భారం

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

ఏపీ ప్రభుత్వమూ ఇలాగే చెయ్యాలి

ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రకటన

శ్రీతేజకు పుష్ప నిర్మాతల పరామర్శ

మంత్రి కోమటిరెడ్డితో కలిసి ఆస్పత్రికెళ్లి తండ్రికి రూ.50 లక్షల చెక్ అందజేత

అల్లు అర్జున్ ఇంటిపై దాడికి పాల్పడ్డ ఓయూ జేఏసీ నేతలకు బెయిల్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మధ్యంతర బెయిల్‌పై ఉన్న నటుడు అల్లు అర్జున్‌కు చిక్కడపల్లి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై మరింత లోతైన దర్యాప్తు చేసేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు హాజరు కావాల్సిందిగా ఆ నోటీసులో పేర్కొన్నారు. తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు 18 మంది మీద కేసులు నమోదు చేశారు. అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా చేర్చారు. ఆయనను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా

మిగతా 14వ పేజీలో...



అల్లు అర్జున్ ఇంటికి అదనపు భద్రత కల్పించిన దృశ్యం

శ్రీతేజ కళ్లు తెరిచి.. మూస్తున్నాడు

కానీ నన్ను గుర్తుపట్టే స్థితిలో లేడు

అల్లు అర్జున్‌పై కేసు వాపసు తీసుకునేందుకు సిద్ధం: తండ్రి

గాంధీభవన్‌కు అల్లు అర్జున్ మామ

దీపాదాస్ మున్షీని కలిసిన కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

జర్నలిస్టుపై దాడి కేసు..

మోహన్‌బాబు ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత



ఆయన హృద్రోగి, వైద్యుల పర్యవేక్షణ అవసరం

హైకోర్టుకు మోహన్‌బాబు లాయర్ల విన్నపం

విలేకరిని కొట్టారు, గొంతు పట్టి పిసికారు

హత్యాయత్నమే: జర్నలిస్టు తరఫు వాదనలు

పోలీసుల ముందు హాజరుకు నేడే గడువు

సుప్రీంలో అదృష్టం పరీక్షించుకొనే అవకాశం

విష్ణుతో నాకు ప్రాణహాని

నేను లేనప్పుడు మా అమ్మను మాయ చేశారు

సంతకం తీసుకొని పోలీసులకు తప్పుడు లేఖ

రాచకొండ పోలీసులకు మంచు మనోజ్ ఫిర్యాదు

14



2

కృష్ణా జిల్లా గొడవర్రులో నిర్మిస్తున్న రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తదితరులు

అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడొద్దు

చేసిన పని పది కాలాలపాటు ఉపయోగపడాలి: పవన్ కల్యాణ్

సంక్రాంతిలోగా 'పల్లె పండుగ' రోడ్లు పూర్తికావాలి

సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు.. కృష్ణాలో పర్యటన

రోడ్లు, వాటర్ ట్యాంక్‌ను పరిశీలించిన డిప్యూటీ సీఎం

పేదల గూడుకు జగన్ గ్రహణం



రూ. కోట్లతో కట్టి.. కంపల పాల్జేసి.. కర్నూలు శివారులోని జగన్నాథగట్టుపై కట్టిన టిడ్కో గృహాల వద్ద పెరిగిపోయిన కంపచెట్లు

టీడీపీ హయాంలో కట్టిన టిడ్కో ఇళ్లూ పాడుపెట్టారు

గత టీడీపీ ప్రభుత్వంలో పట్టణ పేదలకు 3.19 లక్షల ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం

2019 నాటికి దాదాపుగా పూర్తి

జగన్ సర్కారు రాగానే పనుల ఆపివేత

చంద్రబాబుకు క్రెడిట్ దక్కరాదన్న అక్కసుతో టిడ్కో ఇళ్లను శిథిలావస్థకు చేర్చిన వైనం

ఎన్నికల ముందు హడావుడిగా కొన్ని పూర్తి

వాటికి కూడా వసతులు కల్పించకుండా వైసీపీ రంగులేసి వదిలేశారు

ఇప్పుడైనా పూర్తిచేయాలని లబ్ధిదారుల ఆశ

ఆంధ్రజ్యోతి పరిశీలన

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సొంతిల్లు... ప్రతి పేదవాడి కల. రానురాను నిర్మాణ వ్యయం పెరిగిపోతుండటంతో పేదలు సొంతంగా ఇల్లు కట్టుకోలేని పరిస్థితి. పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అప్పట్లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పట్టణం) (పీఎంఏవై) పథకం- అందరికీ ఇళ్లు (అఫోర్డబుల్ హౌస్ ఫర్ ఆల్) కింద రాష్ట్రానికి దాదాపు 7 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 3.19 లక్షల ఇళ్లు పట్టణ పేదలకు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. 2014-19 మధ్య కాలంలో ఇళ్ల నిర్మాణాలు ఓ కొలిక్కి వచ్చాయి. స్వల్ప పనులు తప్ప దాదాపు పూర్తయ్యాయి. అయితే 2019లో జగన్ ప్రభుత్వం ఏర్పడటం

మిగతా 13వ పేజీలో...



ఒంగోలు సమీపంలోని చింతల వద్ద టిడ్కో ఇళ్ల గోడల్లో నుంచి బయటకు వచ్చిన చెట్లు

పరస్పరం ఢీకొని పిట్టల్లా రాలిన డ్రోన్లు

» అమెరికాలోని ఫ్లోరిడాలో పలువురికి గాయాలు

ఫ్లోరిడా, డిసెంబరు 23: క్రిస్మస్ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో అమెరికాలోని ఫ్లోరిడాలో ఊహించని ప్రమాదం జరిగింది. వేడుకల్లో భాగంగా నిర్వహించిన ప్రదర్శనలో డ్రోన్లు పరస్పరం ఒకదానికొకటి ఢీకొని ప్రదర్శన తిలకిస్తున్న వారిపై పడ్డాయి. ఈ ప్రమాదంలో ఓ ఏడేళ్ల బాలుడు సహా పలువురు గాయపడ్డారు. గాయపడిన బాలుడి ఫోటోలను అతని తల్లి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. డాక్టర్లు తన చిన్నారి గుండెకు శస్త్రచికిత్స నిర్వహించబోతునట్లు తెలిపి తీవ్ర విచారం వ్యక్తం చేసింది. డ్రోన్లు కూలిపోతున్న వీడియోను ఓ నెటిజన్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో అది వైరలయింది. ఓర్లాండ్ సిటీ భాగస్వామ్యంతో స్కై ఎలిమెంట్స్ సంస్థ డ్రోన్ల ప్రదర్శనను నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటున్నామని వారు తెలిపారు.



ఫ్లోరిడా డ్రోన్ షోలో ఒకదానికొకటి ఢీకొని రాలుతున్న డ్రోన్లు

సన్నీ లియోనికి నెలకు రూ.1000 ప్రభుత్వ సాయం!

» ఛత్తీస్‌గఢ్‌లో నకిలీ బ్యాంకు ఖాతాతో డబ్బులు కాజేసిన ప్రబుద్ధుడు

రాయ్‌పూర్, డిసెంబరు 23: ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఓ సంక్షేమ పథకంలో సినీ నటి సన్నీ లియోని పేరు ఉండటం చర్చనీయాంశమైంది. ఆర్థికంగా వెనుకబడిన వివాహిత మహిళల కోసం మహతారీ వందన్ యోజన పేరుతో ఓ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోంది. అర్హులైన లబ్ధిదారులకు ప్రతినెలా రూ.1000లను వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది. ఇటీవల సాధారణ తనిఖీల్లో భాగంగా లబ్ధిదారుల జాబితాను పరిశీలిస్తుండగా సన్నీ లియోని పేరు ఉండడం, ఆ బ్యాంకు ఖాతాకు ప్రతినెలా వెయ్యి జమవుతున్నట్లు అధికారులు గమనించారు. బస్తర్ జిల్లా తాలూర్ గ్రామానికి చెందిన వీరేంద్ర జోషి అనే ప్రబుద్ధుడు సన్నీ లియోని పేరుతో నకిలీ ఖాతా తెరిచి.. ప్రతి నెలా రూ.1000 కాజేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంపై బస్తర్ జిల్లా కలెక్టర్ హరీశ్ దర్యాప్తుకు ఆదేశించారు. వీరేంద్ర జోషిపై కేసు నమోదు చేసినట్లు, లబ్ధిదారుల వెరిఫికేషన్‌కు బాధ్యులైన అధికారినీ విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఛత్తీస్‌గఢ్ బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ బైజ్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ పథకంలో అనేక అవకతవకలు జరిగాయని, సగం మంది అనర్హులే ఉన్నారని ఆరోపించారు.

లోకం తీరు



మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ రామసుబ్రమణియన్



న్యూఢిల్లీ, డిసెంబరు 23: జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. మానవ హక్కులను ఉల్లంఘించినట్టు ప్రభుత్వం, అధికారులపై ఫిర్యాదులు వస్తే వాటిపై విచారణ జరపడం ఈ కమిషన్ ప్రధాన బాధ్యత. ఇంతవరకు ఆ పదవిని నిర్వహించిన జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్ర జూన్ నెలలో పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి విజయ భారతి సాయాని తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ నియామకంపై ఈ నెల మొదట్లో ప్రధాని మోదీ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ బేటీకి ఉభయ సభల్లో ప్రతిపక్ష నాయకులైన రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు హాజరయ్యారు.

యూపీలో ముగ్గురు ఖలిస్థానీ ఉగ్రవాదులు హతం

పిలిభిత్/చండీగఢ్, డిసెంబరు 23: ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్‌లో సోమవారం జరిగిన పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఖలిస్థానీ ఉగ్రవాదులు హతమయ్యారు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న గ్రెనేడ్‌లో దాడిలో వీరి ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. పిలిభిత్‌లోని పురానాపూర్ ఏరియాలో ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్ (కేజెడ్‌ఎఫ్) ఉగ్రవాదులకు, పంజాబ్-ఉత్తరప్రదేశ్ ఉమ్మడి భద్రతా బలగాల మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయని పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. మృతిచెందిన ఖలిస్థానీ ఉగ్రవాదులను వీరేందర్ సింగ్ అలియాస్ రవి (23), గుర్విందర్ సింగ్ (25), జషన్‌ప్రీత్ సింగ్ అలియాస్ ప్రతాప్ సింగ్ (18)గా గుర్తించినట్లు వెల్లడించారు. ఈ టెర్రర్ మాడ్యూల్‌ను కేజెడ్‌ఎఫ్ చీఫ్ రంజిత్ సింగ్ నీతా నియంత్రిస్తున్నారని, గ్రీస్ నుంచి జస్విందర్ సింగ్, యూకే నుంచి జగ్జీత్ సింగ్ పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఉగ్ర సంబంధాలను మరింత వెలికి తీసేందుకు దర్యాప్తు జరుగుతోందని, రికవరీలు, అరెస్టులు ఉంటాయని తెలిపారు. కాగా, ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారు పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లా కలనౌర్ తాలూకా పరిధిలోకి వారని తెలిపారు.

'ఎక్స్' ప్రీమియం ప్లస్ ధరలు 35% మేర పెంపు!

న్యూఢిల్లీ, డిసెంబరు 23: ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్' తన ప్రీమియం ప్లస్ ధరలను భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా పెంచినట్లు ప్రకటించింది. దేశంలో 35 శాతం మేర ఈ ధరలు పెరగ్గా.. అమెరికాలో 40 శాతం పెరిగాయి. ఈనెల 21 నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినట్లు ఎక్స్ పేర్కొంది. దేశంలో ప్రీమియం ప్లస్ ధరను నెలకు రూ.1,300 నుంచి రూ.1,750, ఏడాదికి రూ.13,600 నుంచి రూ.18,300కు పెంచినట్లు వెల్లడించింది. ఎక్స్ అందించే వివిధ ప్రీమియం సేవల్లో అత్యుత్తమ సేవలను ప్రీమియం ప్లస్ ద్వారా పొందవచ్చు. ప్రకటనలు లేకుండా కంటెంట్‌ను వీక్షించవచ్చు. అలాగే కంటెంట్ క్రియేటర్లు ఎక్కువ ఆదాయం సంపాదించేందుకు వీలుంటుంది. గ్రోక్ ఏఐ మోడల్ యాక్సెస్, కీవర్డ్‌పై సూచనలకు రాడార్ వంటి ప్రత్యేక సదుపాయం అందుబాటులోకి రానుంది.

సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు భార్య విడాకులు

» రష్యాలో ఆశ్రయం ఇష్టం లేక పుట్టి పెరిగిన లండన్‌కు



మాస్కో, డిసెంబరు 23: అధికారాన్ని కోల్పోయిన సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు వ్యక్తిగతంగానూ ఎదురుదెబ్బ తగలనుంది. రష్యాలో ఆశ్రయం పొందుతున్న అసద్ నుంచి విడిపోవాలని ఆయన భార్య అస్మా అల్ అసద్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. అస్మా.. లండన్‌లో స్థిరపడిన సిరియన్ దంపతులకు పుట్టారు. అక్కడే పెరిగారు. అసద్ కూడా అక్కడే చదువుకున్నారు. ఆ సమయంలోనే ఇద్దరికీ పరిచయం ఏర్పడింది. 2000 సంవత్సరంలో అసద్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అస్మా కూడా సిరియా వచ్చేసి అసద్‌ను వివాహం చేసుకున్నారు. సిరియాలో తిరుగుబాటుతో అనంతరం వారు రష్యాలో ఆశ్రయం పొందుతున్నారు. అయితే, రష్యాలో ఉండడం ఇష్టం లేని అస్మా లండన్ వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రష్యా కోర్టును ఆశ్రయించారని జాతీయ మీడియా పేర్కొంటోంది. అస్మా ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. 2019లో ఆమెకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ అయింది.

అష్టదిగ్బంధనంలో 'అరబిందో'

(మొదటి పేజీ తరువాయి)

మేం విచారణ జరుపుతున్నాం. దీనికి సంబంధించి ఆ రోజు మీరు అన్ని రకాల నిబంధనలు ఉల్లంఘించారు. అధికారం ఉందని ప్రభుత్వ రంగ సంస్థలను ఉపయోగించి బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం ఉంది. దానిపై విచారణ జరుపుతున్నాం. పూర్తి హక్కులున్న కేవీ రావును బెదిరించినట్లు ఆయన చెబుతున్న అంశాలపై సమాచారం సేకరిస్తున్నాం. ఇప్పుడున్న పరిస్థితుల్లో మీరు ఒక్క అడుగు ముందుకేసినా చట్టపరమైన చర్యలు తప్పవు. ఇప్పటివరకు కూడా పూర్తి హక్కులు తనకే ఉన్నట్లు కేవీ రావు ఆధారాలు సమర్పించారు. మీకు ఏమైనా ఆధారాలు ఉంటే సమర్పించండి.. దానిపైనా న్యాయబద్ధంగా విచారణ చేపడతాం.. బాధితుడిగా ఉన్న కేవీరావు హక్కులను కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది. అసలైన బాధితుడికి రక్షణ కల్పించడమే మా విధి. కేవీ రావును బెదిరించి ఆయనకు సంబంధించిన వాటాలు రాయించుకున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. ఇదే నిజమని తేలితే మీరు చట్టపరంగా బాధ్యులు అవుతారు. అప్పట్లో అధికారంలో ఉన్న వ్యక్తులు మీకు బెదిరింపులకు సంబంధించి సహకరించారన్నదానిపై పోలీసు శాఖ దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో కాకినాడ పోర్టు నుంచి ఒక్క రూపాయి కూడా ఏ రూపంలోనూ తీసుకోవడానికి మీరు అర్హులు కారు. లావాదేవీలన్నీ ఆపేయండి' అని సీఐడీ రాసిన లేఖలో వివరించినట్లు తెలిసింది.

'డైరెక్టర్లను పిలిచి విచారిస్తాం'

అరబిందో డైరెక్టర్లను త్వరలో విచారిస్తామని సీఐడీ తెలిపింది. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు సీఐడీ ఏడీజీ రవిశంకర్ అయ్యన్నార్ లేఖ రాశారు. అరబిందో డైరెక్టర్లను పిలిచి విచారించబోతున్న సీఐడీ అధికారులు....తమకు లభించే ఆధారాలను బట్టి చట్టపరమైన చర్యలకు ఉపక్రమించ బోతున్నారు. జగన్ ప్రభుత్వంలో భయపెట్టి.. బెదిరించి.. కాకినాడ పోర్టు, సెజ్‌లు లాగేసుకోవడం జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. మాజీ ముఖ్యమంత్రి జగన్ చిన్నాన్న కుమారుడు ఈ వ్యవహారంలో ఏ1గా ఉండగా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఆయన అల్లుడి సోదరుడు శరత్ చంద్రారెడ్డి(అరబిందో), శ్రీధర్ సంతానం ఎల్ఎల్‌పీ ఆడిటర్ ఇందులో మిగతా నిందితులుగా ఉన్నారు. ప్రభుత్వమే మాఫియాగా చెలరేగి ఒక వ్యాపారవేత్త నుంచి లాక్కున్న వందల కోట్ల ఆస్తుల వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వం తిరగదోడి బాధితుడికి న్యాయం చేసే ప్రక్రియను ప్రారంభించింది. అందులోభాగంగా నిందితులకు నోటీసులు జారీ చేసింది. చట్టపరమైన చర్యలకు ఉపక్రమించబోతోంది.

గత ఏడాదిన్నరలో..
10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం

» వీరిలో అత్యధికంగా మహిళలే
» ఇదో రికార్డు: ప్రధాని మోదీ
» ఢిల్లీ రోజ్‌గార్ మేళాలో 71 వేల మందికి నియామక పత్రాలు



కేథలిక్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, డిసెంబరు 23: కేంద్రంలోని ఎన్‌డీయే ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని ప్రధాని మోదీ తెలిపారు. ఇదో రికార్డు అని.. ఇంతవరకు ఏ సర్కారూ ఇన్ని ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాల్లేవని చెప్పారు. సోమవారమిక్కడ 'రోజ్‌గార్ మేళా'కు ఆయన వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 71 వేల మందికి పైగా నియామక పత్రాలు అందజేశారు. తన ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలన్నీ యువత కేంద్రకంగానే ఉన్నాయని ప్రధాని చెప్పారు. రోజ్‌గార్ మేళాలతో వారికి సాధికారత లభిస్తోందని.. వారి సామర్థ్యం వెలికివస్తోందని అన్నారు. 'పది లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారిలో అత్యధికులు మహిళలే. అతివలు తమ కాళ్లపై తాము నిలబడేలా చేసేందుకు మా ప్రభుత్వం కృషిచేస్తోంది. 26 వారాలు మాతృత్వ సెలవులివ్వాలన్న నిర్ణయం వారి కెరీర్లకు ఎంతో ఉపకరిస్తోంది. ప్రధాని ఆవాస్ యోజన కింద నిర్మించే ఇళ్లకు వారే యజమానులు. దేశంలో వారి నేతృత్వంలోనే అభివృద్ధి సాగుతోంది. మన యువత శక్తి సామర్థ్యాలను గరిష్ఠంగా వినియోగించుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. వారి కోసమే పలు పథకాలు తెచ్చాం. స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, అంతరిక్ష, రక్షణ రంగాల్లో సంస్కరణలు ఈ కోవలోవే. యువత అభివృద్ధికి జాతీయ విద్యావిధానం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా మాతృభాషల ఉపయోగానికి పెద్దపీట వేస్తోంది' అని వివరించారు. సోమవారం మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతి అని.. దేశ పురోగతికి గ్రామీణ భారతం అభివృద్ధి అని ఆయన గట్టిగా చెప్పేవారని.. దానినే తన ప్రభుత్వం పాటిస్తోందని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నామని.. స్వయం ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఆరంభంలో చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించడం తమ అదృష్టమన్నారు. కఠోర శ్రమ, సామర్థ్యం, యువత నాయకత్వంపై దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తామని తెలిపారు. భారత్ ఇప్పుడు ఐదో పెద్ద ఎకానమీగా ఉందని.. వివిధ రంగాల్లో పరివర్తన దిశగా కదులుతోందని చెప్పారు.

కేథలిక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలకు హాజరు

భారతీయ కేథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ (సీబీసీఐ) సోమవారం ఢిల్లీలోని తమ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మోదీ పాల్గొన్నారు. భారతీయ కేథలిక్ చర్చి హెడ్‌క్వార్టర్స్ ఇది. ఇక్కడి వేడకల్లో దేశ ప్రధాని పాల్గొనడం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా మోదీ ప్రసంగించారు. ప్రేమ, సామరస్యం, సౌభ్రాతృత్వంతో మెలగాలని ఏసుక్రీస్తు ప్రబోధించారని.. కానీ సమాజంలో హింస, అనైతికతల వ్యాప్తికి జరుగుతున్న ప్రయత్నాలు తనను బాధిస్తున్నాయని తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ పవిత్ర రోమన్ కేథలిక్ చర్చి కార్డినల్‌గా కేరళకు చెందిన జార్జ్ కూవకడ్‌కు పదోన్నతి కల్పించడం గర్వంగా ఉందన్నారు. (వాటికన్‌లో మాన్‌సైనర్ హోదాలో ఉన్న కూవకడ్ సహా 21 మందికి పోప్ అక్టోబరు 6న కార్డినల్స్‌గా నియమించారు. టర్కీలోని టైట్యులార్ ఆర్చ్‌బిషప్ ఆఫ్ నిసిబి స్‌గా ఆయన్ను ప్రకటించారు). వేడుకల సందర్భంగా చర్చి ముఖ్య అధికారులు, కార్డినల్స్, బిషప్స్‌తో మోదీ ముచ్చటించారు.

ఉద్యోగాలివ్వరు కానీ.. దరఖాస్తులపై జీఎస్టీ వేస్తారా?



న్యూఢిల్లీ, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగాలివ్వడం చేతకాని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఉద్యోగ నియామక దరఖాస్తు ఫారాలపైనా జీఎస్టీ వసూలు చేస్తోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ మండిపడ్డారు. అగ్నివీర్‌తో సహా మిగిలిన ఉద్యోగ నియామకాల దరఖాస్తు ఫారాలపై 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తోందని 'ఎక్స్' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కల్యాణ్ సింగ్ సూపర్ స్పెషాలిటీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లోని పలు ఖాళీల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌ను షేర్ చేసి పోస్టు చేశారు. అందులో దరఖాస్తు ఫీజుతో పాటు దానిపై జీఎస్టీ వేసిన విషయాన్ని ప్రస్తావించారు. నోటిఫికేషన్‌లో అన్‌రిజర్వ్‌డ్, ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ క్యాటగిరీల వారికి 1,000, ఎస్సీ/ఎస్టీలకు రూ.600 దరఖాస్తు ఫీజు ఉండగా.. దానిపై జీఎస్టీ 18% ఉంది. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చెమటోడ్చి తమ పిల్లలను చదివిస్తున్నారని, కానీ బీజేపీ ప్రభుత్వం వారి కలలను కల్లలు చేస్తోందని ప్రియాంక విమర్శించారు. కేంద్రం పేదల ఆశలను పెట్టుబడిగా మార్చుకుంటోందని దుయ్యబట్టారు. ఫీజు కట్టి పరీక్షలు రాస్తే, చివరికి పేపర్ లీకేజీలతో అవినీతి జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

5, 8 తరగతులకు నో డిటెన్షన్ విధానం రద్దు!

» విద్యార్థులు ఫెయిల్ అయితే తిరిగి పునఃపరీక్షల నిర్వహణ
» వాటిలోనూ విఫలమైతే మళ్లీ అవే తరగతుల్లో కొనసాగింపు
» కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబరు 23:విద్యాహక్కు చట్టం-2019కి చేసిన సవరణ ప్రకారం కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సవరణలో పేర్కొన్న విధంగా 5, 8 తరగతులకు 'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేసింది. దీనిప్రకారం.. 5, 8 క్లాసుల విద్యార్థులు పరీక్షలు ఫెయిల్ అయితే.. వారిని ఆటోమేటిక్‌గా పైతరగతులకు ప్రమోట్ చేయరు. అదేవిధంగా బడి మాన్పించడం, టీసీ ఇచ్చి ఇంటికి పంపించడం వంటివి ఉండవు. సదరు తరగతుల తుది పరీక్షా ఫలితాలు విడుదలైన తర్వాత రెండు మాసాల మధ్య ఫెయిలైన విద్యార్థులకు పునఃపరీక్షలు నిర్వహిస్తారు. వాటిలోనూ విద్యార్థులు మళ్లీ ఫెయిలైతే.. అవే క్లాసుల్లో వారిని కొనసాగిస్తారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు 2 మాసాల వ్యవధిలో టీచర్లు, తల్లిదండ్రులు వారిని మరింత గైడ్ చేయాలని సూచించింది. ఏ ఒక్క విద్యార్థీ ప్రాథమిక విద్య పూర్తయ్యే వరకు పాఠశాలకు దూరం కాకూడదన్నదే సవరణ చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. కాగా, 5, 8 తరగతులకు ఇప్పటికే ఈ సవరణ చట్టాన్ని దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేస్తున్నాయి. తాజా ఉత్తర్వులు దేశంలోని 3 వేలకు పైగా ఉన్న కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక్ స్కూళ్లు సహా కేంద్రం ఆధ్వర్యంలోని పాఠశాలలకు వర్తించనున్నట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. విద్య రాష్ట్రాల జాబితాలో ఉన్నందున ఆయా రాష్ట్రాలు ఈ విషయంపై నిర్ణయం తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఇదిలావుంటే, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నో డిటెన్షన్ విధానం కొనసాగుతోంది.

హసీనాను మాకు అప్పగించండి

భారత్‌ను కోరిన బంగ్లాదేశ్

» లేఖ అందిందన్న భారత అధికార వర్గాలు

ఢాకా, డిసెంబరు 23: మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత్‌ను కోరింది. ఈ మేరకు భారత్‌కు దౌత్య లేఖను పంపామని బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. విద్యార్థుల ఆందోళన తీవ్ర రూపం దాల్చడంతో ఈ ఏడాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడిన హసీనా అప్పటి నుంచి భారతదేశంలో నివసిస్తున్నారు. విద్యార్థుల ఆందోళన సందర్భంగా నరమేధానికి పాల్పడ్డారంటూ హసీనాతో పాటు నాటి కేబినెట్ మంత్రులు, సలహాదారులు, మిలిటరీ, పౌర అధికారులు అనేకమందిపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. వారందరిపై బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్(ఐసీటీ) అరెస్టు వారెంట్లు కూడా జారీ చేసింది. హసీనాపై 42 హత్య కేసులు సహా మొత్తం 51 కేసులను నమోదు చేశారు. కేసుల విచారణ నిమిత్తం హసీనాను తిరిగి బంగ్లాదేశ్‌కు పంపాలని భారత ప్రభుత్వానికి సందేశం పంపామని బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల సలహాదారు తౌహిద్ హొస్సేన్ సోమవారం విలేకరులకు తెలిపారు. 'బంగ్లాదేశ్ రాయబారి కార్యాలయం నుంచి ఈరోజే లేఖ అందింది' అని భారత అధికార వర్గాలు తెలిపాయి.

డిజిటల్ అరెస్ట్‌తో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రూ.11.8 కోట్లు టోకరా

» బెంగళూరు టెకీని బెదరగొట్టిన సైబర్ నేరగాళ్లు

బెంగళూరు, డిసెంబరు23: ఆధార్ కార్డును మనీలాండరింగ్ కోసం దుర్వినియోగం చేశాడని బెదిరిస్తూ బెంగళూరుకు చెందిన ఓ టెకీ నుంచి రూ.11.8 కోట్లు కొల్లగొట్టారు సైబర్ నేరగాళ్లు. నవంబరు 11న బాధితుడికి మొదటిసారి వచ్చిన ఫోన్‌కాల్‌లో ట్రాయ్ అధికారినంటూ ఓ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. బాధితుడి ఆధార్‌కార్డుకు లింక్ అయిన సిమ్ కార్డును అసాంఘిక అడ్వర్‌టైజ్‌మెంట్లకు, సందేశాలకు వాడారని, దీనిపై ముంబైలోని కొలాబా సైబర్ పోలీస్ స్టేషన్‌లో కేసు రిజిస్టర్ అయిందని బెదిరించాడు. ఆ తర్వాత తనను తాను ఓ పోలీస్ ఆఫీసర్‌గా పరిచయం చేసుకున్న మరో వ్యక్తి బాధితుడికి ఫోన్ చేశాడు. బాధితుడి ఆధార్ కార్డుతో బ్యాంక్ అకౌంట్లు తెరిచి మనీలాండరింగ్ కోసం దుర్వినియోగం చేశారని, దీనిపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు హడలుగొట్టాడు. వర్చువల్ ఇన్వెస్టిగేషన్‌కు సహకరించకపోతే నేరుగా వచ్చి అరెస్ట్ చేస్తామని బెదిరించాడు. ఆ తర్వాత ఫోన్ చేసి స్కైప్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పగా బాధితుడు అలాగే చేశాడు. ఆ తర్వాత వచ్చిన వీడియోకాల్‌లో ముంబై పోలీస్ యూనిఫామ్ ధరించిన వ్యక్తి బాధితుడి ఆధార్ కార్డు ద్వారా తెరిచిన బ్యాంక్ అకౌంట్ ద్వారా రూ.6 కోట్ల లావాదేవీలు జరిగినట్లు ఎఫ్ఐఆర్ నమోదైందని అబద్ధాలు చెప్పాడు. నవంబర్ 25న స్కైప్ ద్వారా వీడియో కాల్‌లో పోలీసు యూనిఫామ్ ధరించిన వ్యక్తి మాట్లాడాడు. బాధితుడిని డిజిటల్ అరెస్ట్ చేశామని, ఉన్నత న్యాయస్థానంలో కేసు విచారణ జరగనుందని, సహకరించకపోతే కుటుంబ సభ్యులను కూడా అరెస్ట్ చేస్తామని హెచ్చరించాడు. ఆర్బీఐ నిబంధనల పేరుతో అబద్ధాలు చెప్పి బెదిరిస్తూ బాధితుడి అకౌంట్ నుంచి తమ అకౌంట్లలోకి రూ.11.8కోట్లు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఇంకా డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో అనుమానం వచ్చిన టెకీ చివరకు పోలీసులను ఆశ్రయించి జరిగింది చెప్పి భోరుమన్నాడు.

పనామా కాలువను స్వాధీనం చేసుకుంటాం!

నౌకలపై రుసుముల పేరుతో పనామా అమెరికాను దోచుకుంటోంది

» గతంలో అమెరికా మూర్ఖంగా ప్రవర్తించి నియంత్రణను వదులుకొంది
» డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
» కాలువలోని ప్రతీ చదరపు మీటరు మాదే: పనామా అధ్యక్షుడు రౌల్



ఫీనిక్స్, డిసెంబరు 23: తాను అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పనామా కాలువ నియంత్రణను అమెరికా ఆధీనంలోని తీసుకువస్తానని డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. పనామా దేశం అమెరికా కార్గో నౌకల నుంచి అడ్డగోలుగా రుసుములు వసూలు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ రుసుములను తగ్గించాలని లేకపోతే మరో మాట లేకుండా కాలువ నియంత్రణను తమకు అప్పగించాలని పనామా దేశాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం అరిజోనాలోని టర్నింగ్ పాయింట్ వద్ద రిపబ్లికన్ పార్టీ మద్దతుదారులతో ఆయన మాట్లాడారు. గతంలో అమెరికా మూర్ఖంగా ప్రవర్తించిందని, కాలువ నియంత్రణను పనామా దేశానికి అప్పగించిందని అన్నారు. అప్పటి నుంచి పనామా దేశం రుసుముల పేరుతో అమెరికాను దోచుకుంటోందన్నారు. దీంతో పాటు తన కలల క్యాబినెట్ అమెరికా ఆర్థిక వ్యవస్థను ఉత్తేజితం చేస్తుందన్నారు. సరిహద్దుల్లో నిఘాను పెంచి అక్రమవలసదారులను అడ్డుకుంటామన్నారు. ఇజ్రాయెల్, ఉక్రెయిన్ యుద్ధాలు ఆగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ మునిలో స్పందించారు. "పనామా కాలువలోని ప్రతి చదరపు మీటరు మాదే. పనామా సార్వభౌమాధికారం విషయంలో రాజీ పడబోం" అన్నారు. పనామా కాలువ నుంచి ప్రయాణించే నౌకల రుసుములను నిపుణుల కమిటీ నిర్ణయిస్తుందని, సప్లై-డిమాండ్ ఆధారంగా ఇది పని చేస్తుందని చెప్పారు. 82 కిలోమీటర్ల పొడవైన పనామా కాలువ అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాలను కలుపుతుంది. 1914లో దీనిని ప్రారంభించారు. 1977 వరకు ఈ కాలువపై అమెరికా నియంత్రణ ఉండేది. 1977 జిమ్మీ కార్టర్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చేసుకున్న ఒప్పందం ప్రకారం.. 1999లో అమెరికా తన నియంత్రణను పూర్తిగా పనామాకు వదులుకొంది. పనామా దేశానికి ఐదింట ఒక వంతు ఆదాయం ఈ కాలువ నుంచే వస్తోంది. పనామా కాలువ మీదుగా ఏటా రూ.23లక్షల కోట్ల వాణిజ్యం జరుగుతోంది. మరోవైపు, 2017లో తైవాన్‌తో పనామా దౌత్య సంబంధాలను తెంచుకొంది. చైనాతో సంబంధాలను ఏర్పర్చుకుంది. భారీ పెట్టుబడులతో చైనా పనామాకు ముఖ్యమైన మిత్రదేశంగా మారింది. ఈ నేపథ్యంలో పనామా కాలువ ఉన్నది చైనా కోసం కాదని ట్రంప్ ఆదివారం వ్యాఖ్యానించారు. ఈ కాలువ అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిందన్నారు. అయితే, ఈ కాలువపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చైనా నియంత్రణ లేదని పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ మునిలో బదులిచ్చారు. ట్రంప్ పేరు ప్రస్తావించకుండా ఆయన ఎక్స్‌లో ఈ మేరకు వీడియో పోస్టు చేశారు.

డెన్మార్క్, కెనడా, మెక్సికోలతోనూ కయ్యం!

డెన్మార్క్ ఆధీనంలోని గ్రీన్‌ల్యాండ్‌ను కూడా కొనుగోలు చేస్తామని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఆయన 2016లో అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా ఇదే ప్రతిపాదన చేశారు. మరోవైపు, వాణిజ్య లోటు భర్తీ కోసం పొరుగుదేశాలపై భారీగా సుంకాలు విధిస్తామన్న ట్రంప్ ఒక దశలో కెనడా, మెక్సికోలను తమ దేశంలో రాష్ట్రాలుగా చేరుస్తామని ఎద్దేవా చేశారు. ట్రూడో విషయంలో మరో అడుగు ముందుకేసి అమెరికా 51వ రాష్ట్రం కెనడా, గవర్నర్ ట్రూడో అని వ్యాఖ్యానించారు. అమెరికా ఏటా కెనడాకు 100బిలియన్ డాలర్లు, మెక్సికోకు 300బిలియన్ డాలర్లు రాయితీలు ఇస్తోందన్నారు. ఆయా దేశాల నుంచి అమెరికాకు అక్రమ వలసదారులు, డ్రగ్స్ వస్తున్నాయని ఆరోపించారు.

అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడొద్దు

» చేసిన పని పది కాలాలపాటు ఉపయోగపడాలి
» సంక్రాంతిలోగా 'పల్లెపండుగ' రోడ్లు పూర్తికావాలి
» సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు: పవన్ కల్యాణ్



కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని గోశాల వద్ద రోడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్

మచిలీపట్నం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించేందుకు, రహదారులను పూర్తి నాణ్యతతో అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కంకిపాడు-రొయ్యూరు-గొడవర్రు వరకు రూ.3.75 కోట్లతో అభివృద్ధి చేస్తున్న రహదారి పనులు.. గోశాలలో రూ.33 లక్షలతో రోడ్ల మరమ్మతులు, డ్రెయిన్ పనులు.. గుడివాడ మండలం కొత్తచౌటుపల్లిలోని మల్లాయపాలెం హెడ్‌వాటర్‌వర్క్స్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. కంకిపాడు-గొడవర్రు రహదారిని ఎన్ని లేయర్లలో, ఎంత మందంతో నిర్మిస్తున్నారో.. రోడ్డును తవ్వించి మరీ చూశారు. పనుల్లో నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంక్రాంతిలోగా రహదారి పనులు పూర్తి చేయాలన్నారు. గత 15 ఏళ్లుగా ఈ రహదారిని అభివృద్ధి చేయలేదని.. ఇంతకాలానికి పనులు చేస్తున్నారంటూ గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. చేసిన పని పది కాలాలపాటు ప్రజలకు ఉపయోగపడాలనేది తమ అభిమతమని పవన్ అన్నారు. అనంతరం మల్లాయపాలెంలోని హెడ్‌వాటర్‌వర్క్స్ వద్ద ఫిల్టర్‌బెడ్‌ల పని తీరు, నీటిని శుద్ధిచేసే విధానాలను పరిశీలించారు రక్షిత మంచినీటి నమూనాలను పరిశీలించారు. ఆయన వెంట మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, బోడే ప్రసాద్, ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, అధికారులు ఉన్నారు.

చిన్నారిని ఆదుకుంటా..

కంకిపాడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తలసేమియాతో బాధ పడుతున్న చిన్నారిని ఆదుకుంటానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. గొడవర్రులో రోడ్డు పనులు పరిశీలించేందుకు ఆయన కాన్వాయ్‌లో వెళ్తుండగా.. రోడ్డు పక్కన చిన్నారి తొండమల్లి హేశ్విత (5)తో తల్లి ఆయన కోసం వేచి చూస్తోంది. అది గమనించిన ఆయన.. కాన్వాయ్‌ను ఆపి హేశ్విత తల్లిని సమస్య అడిగి తెలుసుకున్నారు. తమ పాప ఆపరేషన్‌కు రూ.23 లక్షలు అవుతాయని వైద్యులు చెప్పారని.. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారని.. ఇంకా రూ.13 లక్షలు కావాలని తెలిపింది. స్పందించిన పవన్.. ఆఫీసుకు వచ్చి కలవాలని ఆమెకు సూచించారు.

శ్రీవారి దర్శనానికి 'ఫేస్ రికగ్నిషన్ ఎంట్రీ'

- దర్శన సమయాన్ని తగ్గించేందుకు ప్రయత్నాలు
- డెమోను వీక్షించిన బోర్డు సభ్యులు, అధికారులు

తిరుమల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి 'ఫేస్ రికగ్నిషన్ ఎంట్రీ' విధానంపై సోమవారం ఓ సంస్థ డెమో ఇచ్చింది. గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించే అవసరం లేకుండా గంట.. రెండు గంటల్లో శ్రీవారి దర్శనం కల్పించేలా అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సహకారంతో ఫేస్ రికగ్నేషన్ ఎంట్రీ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని గత బోర్డులో తీర్మానం చేశారు. ఈ విధానం అమలుకు ఇప్పటికే పలు సంస్థలు ముందుకు వచ్చాయి. ఈ క్రమంలో బెంగళూరుకు చెందిన సీట్రూ అండ్ ఏషియా అనే సంస్థ ప్రతినిధులు సోమవారం రాత్రి చైర్మన్ కార్యాలయంలో డెమో ఇచ్చారు. బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, సభ్యులు, ఉన్నతాధికారులు ఈ డెమోను వీక్షించారు. తొలిగా కియోస్కులో ఫేస్‌తో టోకెన్ జనరేట్ చేయడం, ఆతర్వాత ఫేషియల్ రికగ్నేషన్ బ్యారియర్ గేట్ ముందు నిలబడితే గేట్లు తెరుచుకోవడం వంటి వాటిపై సంస్థ ప్రతినిధులు వివరించారు. మరికొన్ని సంస్థలు కూడా డెమో ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. వాటిని కూడా పరిశీలించిన తర్వాత సంస్థను ఎంపిక చేయనున్నారు.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం



టీటీడీ ఈవో, అదనపు ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

తిరుమల, డిసెం బరు 23 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.కోటి విరాళంగా అందింది. తిరుపతికి చెందిన లక్కీ ఫర్ యు ఎగ్జిమ్స్ కంపెనీకి చెందిన సూర్య పవన్‌కుమార్ అనే భక్తుడు ఈ విరాళాన్ని అందజేశారు. ఈమేరకు రూ.1,00,10,116 విరాళం డీడీని తిరుపతి టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.



శ్రీవారి ఆలయం ముందు కుటుంబ సభ్యులతో జస్టిస్ జేకే మహేశ్వరి

శ్రీవారిసేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం ముందు కుటుంబ సభ్యులతో జస్టిస్ గుణరంజన్

తిరుమల, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గుణరంజన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఆస్పత్రి నుంచి నా బిడ్డ డిశ్చార్జి అయ్యేందుకు సహకరించండి

- ఎన్టీఆర్ గారూ.. ఆదుకోవాలి మీరు: కౌశిక్ తల్లి సరస్వతి



కౌశిక్ తల్లి సరస్వతి

తిరుపతి(వైద్యం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ దాతల సాయంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన బిడ్డ ఇప్పుడు డిశ్చార్జి అయ్యేందుకు దాతలు సహకరించాలని కౌశిక్ తల్లి సరస్వతి కోరారు. అలాగే, తన బిడ్డను అన్ని విధాలా ఆదుకుంటానని భరోసా ఇచ్చిన సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ ఆదుకోవాలన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న నా కొడుకు కౌశిక్.. జూనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని. రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ, దాతలు ముందుకు వచ్చి అందించిన ఆర్థిక సాయంతో నా బిడ్డకు వైద్యం చేయించాం. దాదాపు రూ.70 లక్షల వరకు ఖర్చయింది. వైద్యం పూర్తయింది. ఇప్పుడు డిశ్చార్జి చేసేందుకు మరో రూ.20 లక్షలకు పైగా అవసరం ఉంది. ఇందుకు గతంలో మాకు భరోసా ఇచ్చిన సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ ముందుకు వచ్చి సాయం అందిస్తే పూర్తి ఆరోగ్యంగా నా బిడ్డను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసుకుంటాం' అని సరస్వతి కోరారు. అలాగే దాతలు సైతం ముందుకు వచ్చి తన బిడ్డకు అండగా నిలిచి ఆదుకోవాలని ఆమె అభ్యర్థించారు.

వరుస అల్పపీడనాలు!

- ఒకదాని వెనుక మరొకటి రాక
- చురుగ్గా ఈశాన్య రుతుపవనాలు
- దక్షిణ కోస్తా దిశగా తీవ్ర అల్పపీడనం
- నేటి నుంచి 26 వరకు దక్షిణ కోస్తా, సీమకు వర్షాలు
- ఓడరేవుల్లో మూడో నంబరు హెచ్చరిక
- 26 తర్వాత మరో అల్పపీడనం

విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఒకదాని వెనుక మరొకటి వెంటవెంటనే వస్తున్నాయి. ఈ నెలలో ఇప్పటికే రెండు అల్పపీడనాలు/వాయుగుండాలు రాగా మూడోది ఐదు రోజుల నుంచి బంగాళాఖాతంలో అటు తిరిగి ఇటు తిరిగి చెన్నై, శ్రీహరికోటలకు సమాంతరంగా సముద్రంలో కొనసాగుతోంది. దీని వెనుక మూడు, నాలుగు రోజుల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆదివారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం పశ్చిమ నైరుతి దిశగా పయనించి సోమవారం మధ్యాహ్నానికి నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించి దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడుకు సమీపంలో కొనసాగుతుంది. ఇది పశ్చిమ నైరుతి దిశగా పయనించి మంగళవారానికి ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు దగ్గరగా రానుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో సోమవారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల, ఉత్తరకోస్తాలో అక్కడక్కడ వర్షాలు, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈనెల 25, 26, 27 తేదీల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల, ఉత్తరకోస్తాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వివరించింది. 25న ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలు, 26న నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. కోస్తా తీరంలో గంటకు 35 నుంచి 45, అప్పుడప్పుడు 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్నందున బుధవారం వరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కోస్తాలోని అన్ని పోర్టుల్లో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. కాగా, కొన్ని వాతావరణ మోడళ్ల మేరకు మంగళవారం నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. మరోవైపు ఈనెల 26వ తేదీ తర్వాత ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని భూమధ్యరేఖ పరిసరాల్లోని హిందూ మహాసముద్రంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేశారు. ఇది వాయవ్యంగా పయనించి శ్రీలంక దిశగా వస్తుందని భావిస్తున్నారు. అయితే ప్రస్తుతం బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం రానున్న రెండు, మూడు రోజులు కొనసాగి తరువాత బలహీనపడి ఉపరితల ఆవర్తనంగా మారే అవకాశం ఉందని, ఈనెల 26వ తేదీ తర్వాత ఏర్పడనున్న అల్పపీడనం శ్రీలంక తీరం దిశగా పయనించినప్పుడు...దాంతో కలిసి బలపడి దక్షిణ తమిళనాడు వైపు వస్తుందని అంచనా వేశారు. ఆ ప్రభావంతో రానున్న ఐదారు రోజుల వరకు కోస్తా, రాయలసీమల్లో వర్షాలు కొనసాగుతాయని వివరించారు. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాలు చురుగ్గా ఉన్నందున బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలు ఏర్పడుతున్నాయన్నారు. కాగా, మంగళవారం కోస్తాంధ్రలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, విశాఖ, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది.

ఎస్‌ఐపీబీకి టీసీఎస్, రిలయన్స్ ప్రతిపాదనలు

- సీఎస్ అధ్యక్షతన ఎస్‌ఐపీసీ సమావేశంలో నిర్ణయం

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్‌ఐపీసీ) సమావేశం సోమవారం అమరావతి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన వివిధ కంపెనీలు, సంస్థల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై కమిటీ చర్చించి తదుపరి ఆమోదం నిమిత్తం స్టేట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ బోర్డు (ఎస్‌ఐపీబీ)కి సిఫార్సు చేసింది. ఈ సందర్భంగా సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ అంశాన్ని అధికారులతో సమీక్షించారు. అదే విధంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు, ఉపాధి కల్పనా యూనిట్లను పర్యవేక్షించాల్సిందిగా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో సంబంధిత శాఖాధిపతుల సహాయంతో జీఎం డీఐసీ, రాష్ట్ర స్థాయిలో శాఖాధిపతులు యూనిట్ల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. 2 వేల మందికి ఉపాధి కల్పించే యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి టీసీఎస్ చేసిన ప్రతిపాదనను, రూ.65 వేల కోట్లతో వివిధ జిల్లాల్లో 500 యూనిట్లు ఏర్పాటుకు రిలయన్స్ చేసిన ప్రతిపాదనను ఎస్‌ఐపీబీకు సిఫార్సు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై 27 నుంచి ఏక సభ్య కమిషన్ పర్యటన

- ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి 30 వరకు ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ పర్యటించనుంది. కమిషన్ ఛైర్మన్ విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఆయా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో వివిధ వర్గాల ప్రజలు, సంస్థల అభిప్రాయాలను సేకరించనున్నారు. కమిషన్‌కు నేరుగా వినతులు సమర్పించలేని వారు విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలోని ఏక సభ్య కమిషన్ కార్యాలయంలో ఇవ్వవచ్చని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

భోగాపురం విమానాశ్రయం పనులను వేగంగా పూర్తి చేయండి: సీఎస్

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులను నిర్దిష్ట కాలపరిమితికి లోబడి సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖలు, ఏజెన్సీలకు సూచించారు. సోమవారం అమరావతి సచివాలయం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం సమన్వయ కమిటీ మొదటి సమావేశాన్ని సీఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా విమానాశ్రయ నిర్మాణంతోపాటు అక్కడ వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ఏజెన్సీలు చేయాల్సిన ఏర్పాట్లను కూడా సమీక్షించారు.

ప్రకాశం జిల్లాలో మూడోరోజూ భూప్రకంపనలు

ముండ్లమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలో మూడో రోజూ స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. సోమవారం ఉదయం 10.24 గంటలకు రెండు సెకన్లపాటు భూమి కంపించింది. మరలా సాయంత్రం 8.15 గంటలకు సెకన్‌పాటు, 8.19 గంటలకు రెండు సెకన్లపాటు ప్రకంపనలు వచ్చాయి. ఈప్రభావం ముండ్లమూరు, వేంపాడు, శంకరాపురం, సింగనపాలెంలో కనిపించింది.

రక్షిత్ ఫార్మాలో విష వాయువు లీక్

- ఇద్దరు కార్మికులకు తీవ్ర అస్వస్థత

పరవాడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలోని 'రక్షిత్ డ్రగ్స్ ప్రైవేటు లిమిటెడ్' పరిశ్రమలో సోమవారం విష వాయువు లీక్ కావడంతో ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు... పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-1లో ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులు ఉగ్రెసర్ గౌడ (26), దేవ్‌బాగ్ (38) సోమవారం తెల్లవారుజామున ఐదున్నర గంటలకు పడిపోయి ఉండడాన్ని కెమిస్టు నాగేశ్వరరావు గమనించారు. అప్పటికే దేవ్‌బాగ్ అపస్మారక స్థితిలోకి వెళ్లగా, ఉగ్రెసర్ గౌడ ఫిట్స్ వచ్చినట్టు కాళ్లు, చేతులు కొట్టుకుంటున్నారు. వెంటనే ఇద్దరికీ పరిశ్రమలోనే ఆక్సిజన్ ఏర్పాటుచేసి అనంతరం గాజువాక సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో దేవ్‌బాగ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రొడక్షన్ బ్లాక్-1లో తొమ్మిది మంది కార్మికులు పనిచేస్తున్నారు. తెల్లవారుజామున ఐదున్నర గంటల సమయంలో ఏడుగురు షిఫ్ట్ మారేందుకు సెక్యూరిటీ వద్దకు వెళ్లారు. అదే సమయంలో బ్లాక్-1లో రియాక్టర్‌కు చెందిన స్క్రబ్బర్ నుంచి హైడ్రోజన్ సల్ఫేడ్ వాయువు లీకై ఉండవచ్చునని, దానిని పీల్చడం వల్ల అక్కడ ఉన్న ఇద్దరూ అస్వస్థతకు గురై ఉంటారని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఘటనాస్థలాన్ని పరిశ్రమల తనిఖీ అధికారులు జె.శివశంకర్‌రెడ్డి, జేవీఎస్ నారాయణరావు, తహసీల్దార్ ఎస్వీ అంబేద్కర్, సీఐ మల్లికార్జునరావుతో పాటు పీసీబీ, అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలించారు.

అన్నదాత బాగుంటేనే రాష్ట్రం బాగు

- జాతీయ రైతు దినోత్సవాన సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'అన్నదాత బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని బలంగా నమ్మే ప్రభుత్వం మాది. అందుకే రైతు కుటుంబాల్లో వెలుగులు నింపే విధంగా నిరంతరం కృషి చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రైతు బాంధవుడు, మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతి సందర్భంగా దేశం 'కిసాన్ దివస్'ను జరుపుకుంటున్న వేళ.. సోమవారం ఎక్స్‌లో రైతు సోదరులందరికీ ఆయన జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు కాగా, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఎక్స్‌లో స్పందిస్తూ... రైతాంగానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జీఎస్టీ తకరారు...!

నాలుగు నెలల క్రితం, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిగిన ఓ సమావేశంలో, తమిళనాడులోని ఓ హోటల్ యజమాని చేసిన వ్యాఖ్యలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. స్వీట్లమీద 5శాతం జీఎస్టీ ఉంటే, కారం చిరుతిండిమీద 12శాతం ఉంటోంది... క్రీమ్ బన్ మీద 18శాతం జీఎస్టీ ఉంటే, విడిగా బన్‌మీద అస్సలు లేదు..., మా హోటల్‌కు వచ్చిన కస్టమర్లు, బన్ విడిగా, క్రీమ్ విడిగా ఇస్తే మేమే దాని మీద పూసుకొని తింటామని అంటున్నారు మేడమ్ అంటూ ఆయన వివిధరకాల ఆహారపదార్థాలమీద జీఎస్టీ రేట్లు విభిన్నరకాలుగా ఉండటాన్ని ఎత్తిచూపాడు. ఒకేబిల్లులో అన్ని రకాల రేట్లను వేర్వేరుగా నమోదుచేయడం కష్టమన్నది కూడా ఆయన బాధ. జీఎస్టీ విషయంలో కస్టమర్ల కష్టాలూ తనబోటి యజమానుల బాధలూ ఆయన సులభంగా అర్థమయ్యేట్టు వివరించాడు. నిజమూ నిష్ఠూరమూ సమానపాళ్ళలో మేళవించి ఉన్న ఆ వ్యాఖ్యలు క్రీమ్‌బన్ వీడియోగా విస్తృతప్రచారంలోకి రావడంతో, ఏమైందో ఏమో, సదరు వ్యాపారి వెంటనే ఆర్థికమంత్రిని విడిగా కలిసి క్షమాపణలు చెప్పుకున్న మరో వీడియో వెలుగుచూసింది. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే సమక్షంలో ఆర్థికమంత్రితో ఆయన ఎంతో వినయంగా మాట్లాడుతున్న ఆ వీడియోను తమిళనాడు బీజేపీ శాఖ విడుదల చేయడంతో కాంగ్రెస్ సహా విపక్షపార్టీలన్నీ మండిపడ్డాయి. వేర్వేరు జీఎస్టీ రేట్లను లెక్కగట్టలేక కంప్యూటర్లు క్రాష్ అవుతున్నాయంటూ ఆ హోటల్ యజమాని చేసిన వ్యాఖ్యల్లో అతిశయోక్తి ఉండవచ్చునేమో కానీ, మన జీఎస్టీ స్లాబుల మీద ఈ తరహా విమర్శలు కొత్తేమీ కాదు.

ఇకపై, పాప్‌కార్న్ ఫ్లేవర్ ఆధారంగానో, అందులో ఉన్న చక్కెర, మసాలా స్థాయిని బట్టో మూడురకాల పన్నులు వేయడం మీద సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగిన 55వ జీఎస్టీ సమావేశంలో ఈ పాప్‌కార్న్ కనుక లేకుంటే మరో విశేషమే ఉండేది కాదు. అత్యంత కీలకమైన నిర్ణయాలు చేయాల్సిన ఈ సమావేశం ప్రజలకు మళ్ళీ అన్యాయం చేసింది. విద్యుత్ వాహనాలు సహా పాత వాహనాల క్రయ విక్రయాలమీద జీఎస్టీని పెంచడం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీతో సంబంధం లేనిదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, మొత్తంగా కొత్త, పాత వాహనాల మార్కెట్‌మీద ఇది చూపబోయే ప్రభావంపై విభిన్న విశ్లేషణలు జరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో కొత్తకార్ల కంటే వాడిన కార్ల మార్కెట్ బాగా వృద్ధి చెందుతుందన్న అంచనాలున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక, జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ తగ్గించాలన్న అంశం ఈ సమావేశంలోనూ చర్చకు రాలేదు. ప్రధానంగా ప్రభుత్వరంగ బీమా కంపెనీల ఉద్యోగసంఘాలు సుదీర్ఘకాలంగా ప్రీమియంపై తక్కువ జీఎస్టీని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. సామాన్యులకు బీమాను చేరువచేయడానికి ఇది ఉపకరిస్తుందని, వారి హక్కుల పరిరక్షణగా దీనిని చూడాలని సంఘాలు వాదిస్తూ, ఎంతోకాలంగా నాయకులకు విన్నపాలు చేస్తున్నాయి. ప్రీమియం చెల్లింపులపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని పార్లమెంట్‌లో విపక్షాలు డిమాండ్ చేసినప్పుడు జీఎస్టీ రాక మునుపు కూడా ఈ పన్ను ఉన్నదంటూ ప్రభుత్వం ప్రతివిమర్శ చేసింది. అప్పటి చర్చలూ, రచ్చలూ అటుంచితే, ఆ తరువాత ప్రభుత్వం నియమించిన కమిటీ బీమారంగంలో జీఎస్టీ తగ్గింపు విషయంలో ఏవో కొన్ని సూచనలు చేసినట్టుగా వార్తలు వచ్చాయి. కానీ, ఐఆర్‌డీఏ ఇంకా తన అభిప్రాయం చెప్పలేదన్న కారణంతో ఈ మారు కూడా నిర్ణయం వాయిదాపడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ విషయంలోనూ ఇదే జరిగింది. 148 ఉత్పత్తులపై రేట్లను క్రమబద్ధీకరించేందుకు ఉద్దేశించిన మంత్రుల బృందం నివేదికపై చర్చ జరుగుతుందని అనుకుంటే, ఆ నివేదిక సమర్పణ తదుపరి సమావేశానికి వాయిదాపడింది.

న్యాయంగా, సమానంగా, పారదర్శకంగా, హేతుబద్ధంగా, సరళంగా ఉన్నప్పుడే చక్కని పన్ను విధానం అనిపించుకుంటుంది. జీఎస్టీ ఇప్పటికీ అమ్మకందారులనుంచీ, వినియోగదారులనుంచీ విమర్శలు ఎదుర్కొంటూనే ఉంది. ఈ వ్యవస్థను గాడినపెట్టడం ఇప్పటికీ సాధ్యం కావడం లేదు. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తెచ్చి మంటను కాస్తంత తగ్గించడం ఎలాగూ జరగడం లేదు. కానీ, పిల్లలు వాడుకొనే పెన్సిళ్ళు, రబ్బర్ల నుంచి నిరుద్యోగులు ఎదుర్కొనే పరీక్షల వరకూ సమస్తమూ పన్నుపోటుకు గురవుతూండటం సామాన్యులకు ఆగ్రహాన్ని కలిగిస్తోంది. ప్రజల కనీసావసరాలను దృష్టిలో పెట్టుకొని, రేట్లను తగ్గించి, స్లాబులను కుదించవలసిన పని వెంటనే జరగాలి.


పాపం.. పుణ్యం.. రాజ్యాంగం!

రాజకీయాలకు అతీతమైన చరిత్ర ఉండదు! అది రోజూ రుజువవుతూనే ఉంది. నేటి రాజకీయ అవసరాలు ఏనాటి చరిత్రనో ప్రభావితం చేస్తూనే ఉంటాయి. అందుకే చరిత్రను మారని కఠినశిలగా భావించలేం. నిన్నటిదాకా ఘనమైనది నేడు హీనం అవుతుంది. మొన్నటి స్మరణీయం నేడు విస్మరణీయం అవుతోంది. ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చూస్తే ఇదే అర్థమవుతుంది. గడిచిన పదేళ్లలో వందేళ్లకు మించిన విధ్వంసాన్ని తెలంగాణ చూసిందని రేవంత్ పదేపదే చెబుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాలు, భారీ సంస్థలు ఏర్పాటై తెలంగాణ అభివృద్ధికి తోడ్పడ్డాయనీ అంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిందని చెబుతున్న 'పదేళ్ల విధ్వంసానికి' ముందు తెలంగాణ అభివృద్ధికి గట్టి పునాదులు పడ్డాయన్న భావనను రేవంత్ తన వాగ్ధాటితో బలంగా వినిపిస్తున్నారు. చరిత్రలో సొంత పార్టీ నిర్వహించిన ఘనమైన పాత్రను చెప్పుకోవటం ఏ నేతకైనా అవసరమే! కానీ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన వాదోపవాదాల్లో ఈ తరహా వ్యాఖ్యలు మనకు అంతగా కనపడవు. గతాన్ని గురించి అప్పుడు అందించిన చిత్రం పూర్తిగా భిన్నమైంది! కొంచెం తేడాలతో అన్ని పార్టీల నేతలు ఆంధ్ర పాలకుల విధానాలతో జీవన విధ్వంసం జరిగిందన్న చిత్రాన్నే అందించారు. ఇక ప్రత్యేక రాష్ట్రం కోసం ఎందరో చేసిన త్యాగాలకు సముచిత స్థానం ఇవ్వకుండా పదేళ్లు అధికారం చలాయించిన వాళ్ల చరిత్రనే అసలుసిసలు చరిత్రగా ప్రచారం చేస్తున్నారనీ ఇకనైనా దానికి వీడ్కోలు చెప్పాలనీ కూడా రేవంత్ గట్టిగా సూచించారు.

రాజకీయ దృష్టి.. చరిత్రను చూసే తీరును మార్చుతుందనటానికి ఈ వ్యాఖ్యలకు మించిన నిదర్శనం ఉండదు. నిజమైన ప్రజానుకూల పాలన రేవంత్ దృష్టి నుంచి చూస్తే తెలంగాణలో 2023 డిసెంబర్ నుంచే మొదలైంది! ఇక బీఆర్ఎస్ దృష్టి నుంచి చూస్తే 2014 నుంచే అసలైన తెలంగాణ చరిత్ర ఆరంభమవుతుంది. అంతకు ముందు అంతా విధ్వంసం.. వనరుల దోపిడి.. సాంస్కృతిక జీవన విచ్ఛిన్నం.. అంతర్గత వలసవాద విధానాల వైపరీత్యం.. 2014 నుంచి 2023 వరకూ తెలంగాణకు స్వర్ణయుగమైతే ఇప్పుడు కటిక చీకటి యుగం నడుస్తోంది.

పరస్పరం కత్తులు దూసుకునే పార్టీలు.. చరిత్రను ఇంతటి విరుద్ధ దృష్టితో చూస్తున్నాయి. ఎవరి దృష్టికి భవిష్యత్తులో ఆమోదం లభిస్తుంది? అసలు భవిష్యత్తులో ఈ రెండు విపరీత దృష్టికోణాలకు సముచిత స్థానం ఉంటుందా? వీటికి పూర్తిగా భిన్నమైన మరో సముచిత, సహేతుక దృష్టికోణం ముందుకొస్తుందా? అన్నవి కీలక ప్రశ్నలు. భవిష్యత్తులో కూడా రాజకీయాలే వాటికి జవాబులను నిర్దేశిస్తాయి. వాటిని బట్టే జవాబులు ఆధారపడి ఉంటాయి. ఏదోలా అధికారాన్ని దక్కించుకోవటమే పరమ లక్ష్యమై.. విపరీత అసమానతలతో కూడిన ఇప్పుడున్న సమాజాన్నే కొనసాగించే పోటీ రాజకీయాలదే పైచేయి అయితే పక్షపాత చరిత్రలే రాజ్యమేలతాయి. స్వర్ణ, చీకటి యుగాల స్వరాలను వైరివర్గాలు వినిపిస్తాయి! జన జీవితాల చరిత్రకు చెందిన అసలు స్వరాలు మాత్రం అట్టడుగున పడిపోతాయి.

రాజకీయ అవసరాలు నిర్దేశించే చరిత్రనే అసలైనదిగా ప్రచారం చేయటంలో ప్రధాని మోదీకి ఎవరూ సాటిరారు. ఆయన దృష్టిలో 2014 తర్వాతే దేశం అన్నిరంగాల్లో సొంత అడుగులు వేస్తోంది. వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వానికి (1998–2004) కొంత మినహాయింపు ఉన్నా 2014 తర్వాతి పాలనతో దాన్ని పోల్చలేం. కేంద్రంలో ఒకనాటి కాంగ్రెస్ పాలన తప్పులతడకల మయం.. అన్ని విధానాల్లోనూ అపసవ్యతలే.. విదేశీ విధానంలోనూ అదే ధోరణి.. బానిస ఆలోచనల నుంచి బయటపడలేదు.. భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని గుర్తించలేదు.. ముస్లింలను బుజ్జగిస్తూ హిందువులను చిన్నబుచ్చారు.. సోషలిస్టు విధానాలతో ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టించారు.. వ్యాపార చొరవను నీరుగార్చారు.. రాజ్యాంగాన్ని బలహీనపర్చారు.. అవినీతిని వ్యవస్థీకృతం చేశారు.. కుటుంబ పాలనకు తెర తీశారు.. హిందూత్వ జాతీయవాదాన్ని ఎదగనీయలేదు.. కుహనా లౌకికవాదాన్ని ప్రోత్సహించారు.. ఇలా చెప్పుకుంటూపోతే మోదీ పేర్కొనే వైపరీత్యాల చిట్టాను ఒక పట్టాన ముగించలేం. ఇవన్నీ ఒకరకమైన చరిత్రనే మనకు చెబుతాయి.



> పరిమితులెన్ని ఉన్నా మొదటి రాజ్యాంగ సవరణ మొత్తాన్ని తప్పుపట్టలేం. కనీసస్థాయి ప్రగతిశీల దృక్పథంతో చూసినా అదే తేలుతుంది. సామాజిక, ఆర్థిక న్యాయ సాధనలో ఆనాటికి అదొక ముందడుగు. ఆ అడుగు అడుగే కాదనీ మొత్తం రాజ్యాంగ సవరణనే మహాపాపంగా చూస్తే పటేల్, అంబేడ్కర్‌ల పాత్రనూ అందులో తోసిపుచ్చలేం! పాక్షిక దృష్టితో చరిత్రను చూడటం ఎప్పుడూ తేలికే! సమగ్ర దృష్టితో చూడటం ఎప్పుడూ కష్టమే!

రాజ్యాంగ 75వ అవతరణ దినోత్సవాల సందర్భంగా మోదీ చేసిన విమర్శలూ వ్యాఖ్యలూ చాలా తీవ్రమైనవి. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చివేసి రిజర్వేషన్లను రద్దుచేయటానికి మోదీ ప్రయత్నిస్తున్నారనే ప్రచారమే కాంగ్రెస్‌కు ఇటీవల ప్రధాన అస్త్రంగా మారింది. అందుకే రాజ్యాంగం కేంద్రంగానే కాంగ్రెస్‌పై మోదీ విమర్శలను ఎక్కుపెట్టారు. రాజ్యాంగ సవరణల పాపమంతా కాంగ్రెస్‌దేనని మోదీ బలంగానే వాదించారు. అందుకోసం 75 ఏళ్ల రాజ్యాంగ చరిత్ర నుంచి చాలా విషయాలను తవ్వితీశారు. రాజ్యాంగ మొదటి సవరణనే మహాపాపంగా వర్ణించారు. లేని అధికారాన్ని ఉపయోగించి అక్రమంగా మొదటి రాజ్యాంగ సవరణకు నెహ్రూ పాల్పడి తాత్కాలిక పార్లమెంటులో దాన్ని ఆమోదింపచేసుకున్నారనీ ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలు 1952లో పూర్తయ్యాయి. అనంతరమే రాజ్యసభ ఉనికిలోకి వచ్చింది. 1952కు ముందు ఉన్నది రాజ్యాంగ పరిషత్తు మాత్రమే. రాజ్యాంగరచన పూర్తయిన తర్వాత దాన్నే తాత్కాలిక పార్లమెంటుగా వ్యవహరించారు.



■ రాహుల్ కుమార్

తాత్కాలిక పార్లమెంటుకు రాజ్యాంగాన్ని మార్చే హక్కు ఎక్కడిది అని మోదీ వేసిన ప్రశ్నలో ఔచిత్యాన్ని తేల్చుకోవాలంటే చరిత్రలోకి వెళ్లాల్సిందే. మొదటి సవరణ చాలా ముఖ్యమైంది. దేన్ని ఆశించి దాన్ని చేశారన్నది నిశితంగా చూడాలి. మన రాజ్యాంగ చరిత్రపై ఇప్పటికే వేల పుస్తకాలు వచ్చాయి. గ్రాన్‌విల్ ఆస్టిన్ రాసిన 'వర్కింగ్ ఎ డెమక్రాటిక్ కానిస్టిట్యూషన్' పుస్తకం వాటిల్లో ఎన్నతగినది. ఆస్టిన్ అభిప్రాయం ప్రకారం మొదటి రాజ్యాంగ సవరణ చేయటానికి మూడు అంశాలు ప్రధాన కారణాలు అయ్యాయి. మొదటిది భావప్రకటన సమస్యలకు సంబంధించినది. రెండోది జమిందారీ వ్యవస్థ రద్దు–భూసంస్కరణలకు సంబంధించినది. మూడోది విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు సంబంధించినది. వీటిపై 1950 నాటికి కోర్టులు ఇచ్చిన తీర్పులను దృష్టిలో ఉంచుకుని మొదటి సవరణను తీసుకువచ్చారు. భావప్రకటన స్వేచ్ఛకు పరిమితులు విధించటాన్నీ జమిందారీ రద్దు చట్టాలనూ సర్దార్‌పటేల్ సమర్థించారు. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పువచ్చే నాటికి పటేల్ చనిపోయారు. ఇక న్యాయశాఖ మంత్రిగా ఉన్న అంబేడ్కర్ ఈ మూడు అంశాలకు సంబంధించిన సవరణలను పూర్తిగా సమర్థించారు. అప్పటికే కొన్ని రాష్ట్రాలు తీసుకువచ్చిన భూసంస్కరణల బిల్లులను వ్యతిరేకిస్తూ జమిందార్లు కోర్టులకు వెళ్లారు. తమ ప్రాథమిక హక్కులకు భంగం కలిగిందనీ వాదించారు. అనుకూల తీర్పులూ వచ్చాయి. ఎన్నో జాగ్రత్తలు తీసుకుని రూపొందించిన బిహార్ భూసంస్కరణల చట్టాన్ని హైకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వ రవాణా సర్వీసులను వ్యతిరేకిస్తూ కూడా కేసులు దాఖలయ్యాయి. దీంతో ప్రభుత్వ రంగ సంస్థలను పెద్దఎత్తున ఏర్పాటు చేయబోయే మొత్తం ప్రక్రియకే ఆటంకం కలుగుతుందని ప్రభుత్వం భయపడింది. 1948లో రూపొందించిన పారిశ్రామిక విధానాన్ని అమలు చేయలేని పరిస్థితి తలెత్తుతుందని ఆదుర్దా చెందింది. మరోవైపు మద్రాస్ రాష్ట్రంలోని రిజర్వేషన్లను హైకోర్టు కొట్టివేసింది. సుప్రీంకోర్టూ సమర్థించింది.

సామాజిక, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కోర్టుల నుంచి తగులుతున్న ఎదురుదెబ్బలు ఒకవైపు ఉంటే మరోవైపు మత, ప్రాంతీయ తత్వాల ప్రచారం ఊపందుకుంది. అప్పటికే కొన్ని రాష్ట్రాలు తీసుకువచ్చిన ప్రజాభద్రతా చట్టాలను కోర్టులు కొట్టివేశాయి. వామపక్ష అనుకూల 'క్రాస్‌రోడ్స్' మ్యాగజీన్‌ను నిషేధించిన ఉత్తర్వును కొట్టివేస్తూ మద్రాస్ ప్రజాభద్రతా చట్టాన్ని రాజ్యాంగ వ్యతిరేకమైందిగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మరోవైపు శ్యామప్రసాద్ ముఖర్జీ దేశవిభజనను రద్దు చేయాలనే డిమాండును వినిపించటం ప్రారంభించారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని భావప్రకటనా స్వేచ్ఛను (ఆర్టికల్ 19) మరింతగా పరిమితం చేయాలని నిర్ణయించారు. ప్రజాభద్రతకు భంగం కలిగించే ప్రమాదం, నేరానికి పురికొల్పే అవకాశం ఉన్నప్పుడు భావప్రకటన స్వేచ్ఛపై సహేతుక పరిమితులు విధించవచ్చంటూ సవరణ సందర్భంగా చేర్చిన నిబంధనలను తర్వాతి కాలంలో ప్రభుత్వ వ్యతిరేక అసమ్మతిని అదుపులో పెట్టటానికి విస్తృతంగా ఉపయోగించారు. అలా కొంత దుర్వినియోగమూ జరిగింది.

> రాజ్యాంగ సవరణల పాపమంతా కాంగ్రెస్‌దేనని మోదీ బలంగానే వాదించారు. అందుకోసం 75 ఏళ్ల రాజ్యాంగ చరిత్ర నుంచి చాలా విషయాలను తవ్వితీశారు. రాజ్యాంగ మొదటి సవరణనే మహాపాపంగా వర్ణించారు.

మొదటి సవరణతో రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూలు అదనంగా చేరింది. భూసంస్కరణల చట్టాలను కోర్టుల నుంచి రక్షించటానికి దాన్ని తీసుకువచ్చినా తర్వాత వేరే అవసరాలకూ వాడారు. ఇక అప్పటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ తొలి రాజ్యాంగ సవరణ బిల్లుని అడ్డుకోటానికి చాలా ప్రయత్నించారు. గత్యంతరంలేని పరిస్థితుల్లోనే దానికి ఆమోదముద్ర వేశారు. హిందూ కోడ్ బిల్లు విషయంలోనూ అలాగే వ్యవహరించారు. మొదటి సవరణను తీవ్రంగా వ్యతిరేకించిన వారిలో శ్యామప్రసాద్ ముఖర్జీ ప్రముఖులు. ఒకరకంగా చూస్తే ముఖర్జీ, రాజేంద్రప్రసాద్‌ల అభిప్రాయాలనే మోదీ పునరుద్ఘాటించారు. వాటిని ఆనాటి తాత్కాలిక పార్లమెంటే ఖాతరు చేయలేదు. సవరణకు అనుకూలంగా 228 ఓట్లు వస్తే వ్యతిరేకంగా 20 ఓట్లు మాత్రమే వచ్చాయి. సుప్రీంకోర్టు కూడా చివరకు సవరణను సమర్థించింది. రాజ్యాంగాన్ని రూపొందించిన సభకు దాన్ని మార్చే అధికారం ఉందనీ స్పష్టంచేసింది.

సుదీర్ఘ కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్‌ను విమర్శించటానికి చాలా విషయాలు ఉన్నాయి. స్వాతంత్ర్య ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలతో, ప్రకటించిన లక్ష్యాలతో సాధించిన ప్రగతిని తూకంవేస్తే కాంగ్రెస్ వెలుగునీడలు స్పష్టంగా కనపడతాయి. పరిమితులెన్ని ఉన్నా మొదటి రాజ్యాంగ సవరణ మొత్తాన్ని తప్పుపట్టలేం. కనీసస్థాయి ప్రగతిశీల దృక్పథంతో చూసినా అదే తేలుతుంది. సామాజిక, ఆర్థిక న్యాయ సాధనలో ఆనాటికి అదొక ముందడుగు. ఆ అడుగు అడుగే కాదనీ మొత్తం రాజ్యాంగ సవరణనే మహాపాపంగా చూస్తే పటేల్, అంబేడ్కర్‌ల పాత్రనూ అందులో తోసిపుచ్చలేం! పాక్షిక దృష్టితో చరిత్రను చూడటం ఎప్పుడూ తేలికే! సమగ్ర దృష్టితో చూడటం ఎప్పుడూ కష్టమే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

గ్రామీణాభివృద్ధి దార్శనికుడు

కాకాని వెంకటరత్నం 53 సంవత్సరాల క్రితం కీర్తిశేషుడు అయ్యారు. అవిభక్త కృష్ణా జిల్లాలోని గ్రామాలు ఆయనను ఇంకా గుర్తు చేసుకుంటూనే ఉన్నాయి. అభివృద్ధి అంటే ఏమిటి, అది ఎట్లా మొదలవుతుంది, ఎట్లా దినదినాభివృద్ధి చెందాలో తెలియజేసిన నాయకుడు కనుకనే కాకాని స్మృతి పచ్చగా ఉన్నది. 75 సంవత్సరాల క్రితం ఆయన చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలకు స్ఫూర్తి ఆ సునిశ్చిత భావనే అని చాలా మందికి తెలియదు. స్వీయ విద్యాభ్యాసం ప్రాథమిక పాఠశాల వరకే పరిమితమైనా గ్రామాల అభివృద్ధికి పునాది వేసిన దార్శనికుడుగా కాకానిని కీర్తించడం అతిశయోక్తి కాదు. స్థానిక ప్రజల పాత్ర, పర్యవేక్షణ ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం అనేది ఆయన సిద్ధాంతం. పార్టీలకు అతీతంగా సహకరించుకోగలిగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన ఆచరణాత్మకంగా నిరూపించారు.

విద్య విషయంలోనే కాక అనేక రంగాల్లో అవిభక్త కృష్ణా జిల్లా ఈనాడు ముందుండడానికి కారణం కాకాని వేసిన బాటే. జిల్లా బోర్డుల వ్యవస్థకు కొత్త ఒరవడి తీసుకువచ్చిన ఘనత ఆయనదే. అలా ఇతర జిల్లాల వారికి కూడా కాకాని ఆదర్శపాత్రుడు అయ్యారు. కర్నూలు జిల్లాలో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, అనంతపురం జిల్లాలో కల్లూరు సుబ్బారావు, ఖమ్మం జిల్లాలో జలగం వెంగళరావు, గుంటూరు జిల్లాలో జాగర్లమూడి చంద్రమౌళి, విశాఖ జిల్లాలో సాగి సూర్యనారాయణరాజు, పశ్చిమగోదావరిలో మాగంటి బాపినీడు జిల్లా బోర్డు అధ్యక్షులుగా ఎన్నికై సేవలు చేశారు. వీరంతా కాకానితో కలిసి పని చేసిన నాయకులే. కాకాని పాలనా పద్ధతులను మనం ఇంకా కొనసాగిస్తున్నామనడం సత్యదూరం కాదు. ముందు విద్య అందరికీ అన్ని చోట్ల అందుబాటులో ఉండాలి. అనటమే కాకుండా, దానికోసం నిరంతర కృషిచేసిన నాయకుడు కాకాని. గ్రామ గ్రామానికి వెళ్లి పాఠశాల స్థాపన ధ్యేయంగా ఆయన తన అధికారాలను సద్వినియోగం చేశారు. ఉపాధ్యాయుల ప్రాముఖ్యత గుర్తించడమే కాక, వారికి సమున్నతమైన గౌరవం తీసుకొచ్చిన నాయకుడు. విద్యతోపాటు వ్యవసాయం, నీటిపారుదల, రోడ్ల నిర్మాణం, నిర్వహణ మొదలైనవి స్థానికుల కృషితోనే జరిగే విధంగా చూడడం ఆయన పాలనా పద్ధతుల విశిష్టత. వ్యవసాయంతో పాటు పాడి, మహిళా శక్తికి ఏ విధంగా తోడ్పడుతుందో అది గ్రామాభివృద్ధికి ఎంత ముఖ్యమో చెప్పి చూపించినది కూడా కాకానే. కుటుంబ వ్యవస్థలను బలపరిచే ఆలోచనలు ఎన్నో...! ముఖ్యంగా మహిళలు, పిల్లలకు రైతులలాగా తగిన ప్రాధాన్యాన్ని ఇవ్వడం గురించి చర్చించి స్థానికులే తగిన చర్యలు చేపట్టేలా చూశారు. సాధ్యమైనంత వరకు ప్రభుత్వాల మీద ఆధారపడకుండా జరగాలనేది ఆయన ఆలోచన. అలాగే పిల్లల్లో జాతీయ భావాలు పెంపొందించి, దేశ సమస్యల పట్ల అవగాహన పెంపొందించడానికి పాఠశాలల్లో సోషల్ స్టడీస్ మీద, ఆటపాటల మీద ధ్యాస పెంచే ప్రయత్నం ప్రత్యేకంగా చేశారు. ప్రతి పాఠశాలలోనూ ఆటస్థలం ఉండేందుకు ఆయన కృషి చేశారు. కాకాని రత్నం పేరు మీదగా జిల్లా పరిషత్ పాఠశాల ఆటస్థలాలకు కాకాని పేరు పెట్టడం సముచితంగా ఉంటుంది. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టి ఆమెను గౌరవించుకోవల్సి ఉన్నది. ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం కాకాని రత్నాలు అనే పురస్కారంతో గుర్తింపునిస్తే భావి పౌరులను తీర్చిదిద్దేవారికి ప్రేరణ కల్పించినట్టవుతుంది. వారు కొత్త ఉత్సాహంతో తమ విధులు నిర్వర్తించేందుకు అవకాశం ఉంటుంది. ఇదే పద్ధతిలో ఇతర జిల్లాలలో అభివృద్ధికి విశేషంగా దోహదం చేసిన నాయకులను కూడా గౌరవించుకోవాలి.



> అభివృద్ధి అంటే ఏమిటి, అది ఎట్లా మొదలవుతుంది, ఎట్లా దినదినాభివృద్ధి చెందాలో తెలియజేసిన నాయకుడు కాకాని. స్థానిక ప్రజల పాత్ర, పర్యవేక్షణ ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం అనేది ఆయన సిద్ధాంతం. పార్టీలకు అతీతంగా సహకరించుకోగలిగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని కాకాని ఆచరణాత్మకంగా నిరూపించారు.

కాకాని కఠినుడు అని ప్రతీతి. ఇది కొంతవరకు నిజం, కొన్ని విషయాల్లో కాఠిన్యం ఎక్కువగా ఉండేది. అయితే అంతకన్నా ఎక్కువ జాలిగుండె కాకానిది. ముఖ్యంగా విద్యార్థులు, పేదలు, దళితులు, స్వయంకృషిని నమ్ముకున్న వాళ్ళంటే ఆయనకి ఇంకా అమిత ప్రేమాభిమానాలు ఉండేవి. కాకాని స్నేహ హృదయుడు. చివరివరకు కాకాని వెంకటరత్నం బృందంగా, దశాబ్దాలుగా పేరొందిన మహానుభావులు అంతా నాకు గుర్తుకు వచ్చినప్పుడు రాజకీయాల్లో ఆ విధమైన స్నేహం, ఆ తర్వాత ఇప్పటివరకు కనబడడం లేదు కదా అనే విచారం కలుగుతుంది. కాకాని స్నేహ బృందంలోని వారంతా వేర్వేరు సామాజిక వర్గాలకు చెందినవారు అయినా కలిసిమెలిసి కులమతాలకి అతీతంగా వ్యవహరించిన తీరు. ఆదర్శప్రాయమైనది. గ్రామాల అభివృద్ధే వారి ధ్యేయం. దాదాపు 20–25 సంవత్సరాల పాటు ఆటుపోట్లను రకరకాల ఒత్తిళ్ళని ఎదుర్కొని మరీ స్నేహితులుగా మెలిగారు. పేట బాపయ్య, రెబాల బుచ్చి రామశ్రేష్టి, అప్పికట్ల జోసెఫ్, కలపాల సూర్యప్రకాశ్‌రావు, అక్కినేని భాస్కరరావు, ఆకుల కాంతారావు, మరిపల్ల చిట్టి, పిన్నమనేని కోటేశ్వరరావు వీరంతా ఒక బృందంగా, జట్టుగా, స్నేహితులుగా రాజకీయాల్లో చివరి వరకు పేరొందినవారే. విద్యని అందుబాటులో తీసుకొచ్చి పిల్లలందరినీ విద్యావంతులని చేయాలనే కాకాని బృందం తపనపడేది. అందుకే ఈ రోజు కృష్ణా జిల్లా విద్యలో రాష్ట్రంలోనే ముందు ఉండటమే కాక, దేశ విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించి, అనేక మంది ఉన్నత పదవుల్లో ఉన్నారంటే అదంతా కాకాని దూరదృష్టే. స్థానిక పాఠశాలకు సహకరించడమే కాకుండా సభ్యతతో మెలిగి పిల్లల అజ తీసుకుంటూ తెలుసుకోవడంలోనే అభివృద్ధి మొదలవుతుందని గ్రహించిన నాయకుడు కాకాని. ఈ విషయంలో పార్టీలకు అతీతంగా ఆయన ఆలోచించి ఆచరించారు.

కాకానిది అతి సామాన్య జీవన విధానం ఆయన ధ్యాసంతా పదిమంది పిల్లలకు, 20 మంది రైతులకు, 30 గ్రామాలకు సహాయపడటమే. ఆ రోజుల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లినా కాకాని కనీసం నలుగురైదుగురిని పేరు పెట్టి పిలిచేవారు. వారి కుటుంబాల మంచి చెడ్డలు అడిగి తెలుసుకునేవారు. ఈ సద్గుణం, సహృద్భావమే కాకాని నాయకత్వానికి మూలాలు. కాకాని వెంకటరత్నం తిరుగులేని నాయకుడిగా, మొండిజీవిగా, ప్రజారాజకీయవాదిగా వెలుగొందడానికి కారణం. ఈనాటి రాజకీయ నాయకులు ఆయనను స్ఫూర్తిగా తీసుకుంటే దేశ స్థితిగతులు సత్వరమే మరింత మెరుగుపడతాయనడంలో సందేహం లేదు. ప్రతి డిసెంబర్ 25న గత 20 సంవత్సరాలుగా కాకాని వెంకటరత్నం విశిష్టతను గురించి రాస్తూనే ఉన్నా ఇంకా ఇంకా ఎన్నో విషయాలు రాయవలసే ఉంది.

● డాక్టర్ నాగులపల్లి భాస్కరరావు

(డిసెంబర్ 25: కాకాని వెంకటరత్నం వర్ధంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

జూనియర్ కాలేజీ విద్యార్థులకూ మధ్యాహ్న భోజన పథకం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 164 మండలాల్లో ఉన్న ప్రభుత్వ మోడల్ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి. ప్రస్తుతం ఈ మోడల్ పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. అందువల్ల అదే పాఠశాలలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా ఈ పథకం విస్తరించడంలో ఎలాంటి సమస్యలూ ఉండవు. దీనిని అమలు చేయడం వల్ల సుదూర ప్రాంతాల నుంచి కళాశాలలకు వచ్చే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. మోడల్ స్కూల్స్ నాన్ రెసిడెన్షియల్ పాఠశాలలుగా నిర్వహించబడుతున్నాయి. ఇక్కడ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎంపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం ద్వారా విద్యార్థుల హాజరు, విద్యాసాధన పెరగడమే కాకుండా, వారి ఆరోగ్య పరిస్థితులు కూడా మెరుగుపడతాయి. అందువల్ల ప్రభుత్వం ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలించి, మోడల్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలి.

– బి. సురేష్
ప్రెసిడెంట్, మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్స్ కమిటీ

'జమిలి'తో అధికారాల ఏకీకరణ

'ఒకే దేశం, ఒకే ఎన్నిక' నినాదంతో జమిలి ఎన్నికలకు రంగాన్ని సిద్ధం చేయడానికి మోదీ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లులను ప్రవేశపెట్టింది. ఇవి ఆమోదం పొందితే పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. సహజంగానే ఈ అంశంపై కూడా అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం వాదోపవాదాలు చేస్తున్నాయి. అయితే సాధారణ ప్రజల స్పందన భిన్నంగా ఉంది. ప్రజాస్వామ్య సూత్రాలు, విలువలు, వాటి స్ఫూర్తి, ఆచరణ ప్రాధాన్యతను కోల్పోయి కేవలం మనీ, మీడియా, మూక బలాలు ప్రాబల్యం వహిస్తూ, మొత్తం ఎన్నికల ప్రక్రియే ఒక ప్రహసనంగా మారిన ప్రస్తుత పరిస్థితులలో ఎన్నికలు ఏ రూపంలో జరిగినా ఏం ఫాయిదా? అనే ప్రతిస్పందన వినిపిస్తుంది. అసలు జమిలి అంశం నేడు ఎందుకు ముందుకు వస్తోంది? దీని వెనుకనున్న అసలు ఉద్దేశ్యాలేమిటి? వంటి ముఖ్య ప్రశ్నలు వేయడం చాలా అవసరం.

జమిలి ఎన్నికలకు అనుకూలంగా మూడు వాదనలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. పలుమార్లు జరిగే ఎన్నికల వలన అధిక ఆర్థిక వ్యయం అవుతోందని, జమిలితో గణనీయంగా ఎన్నికల ఖర్చును తగ్గించవచ్చునని, దేశ జీడీపీలో అదనంగా 10 శాతం వృద్ధి ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కానీ వీరు ఈ వాదనకు తగిన పరిశోధనలనుగానీ, సముచిత డాటా ఆధారిత రుజువులనుగానీ చూపించలేదు. కేవలం సాధారణ తర్కాన్ని ఉపయోగించడం, కొన్ని దేశాల ఎన్నికలను ఉదహరించడం జరిగింది. వాస్తవానికి ఎన్నికల నిర్వహణకు అయ్యే ప్రభుత్వ ఖర్చుకంటే బడా పార్టీలు ఓటర్లకు ఎర వేయడానికి అనేక రెట్లు ఎక్కువ ఖర్చు చేసే వేల కోట్ల రూపాయల అక్రమ ధనాన్ని అరికట్టే చర్యలు చేపడితే అందరూ హర్షిస్తారు. అలాగే ఎక్కువసార్లు ఎన్నికల షెడ్యూళ్ళను ప్రకటించే సందర్భాలలో అమలుచేసే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోరల్ కోడ్ ఆఫ్ కాండక్ట్–ఎంసీసీ) వలన ప్రభుత్వ పాలనకు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అనేక ఆటంకాలు వస్తున్నాయని కూడా చెప్పడం జరుగుతోంది. అయితే వాస్తవం ఏమిటి? ఎన్నికల షెడ్యూళ్ళను ప్రకటించిన తరువాత ఓటర్లను ప్రలోభపెట్టే కొత్త పథకాలు, ప్రాజెక్టుల ప్రకటనలను మాత్రమే ఎంసీసీ నిషేధిస్తుంది. అంతేకాని అప్పటికే అమలులోనున్న వాటిపై ఎలాంటి పరిమితులను విధించదు. ఇక ఎన్నికల సందర్భంగా చేపట్టే ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పోలీసు లేదా సైనిక దళాలను నియమించడం తదితర విషయాలలో ఒకేసారి జరిగినా, ఎక్కువసార్లు జరిగినా పెద్ద మార్పేమీ ఉండదు.

ఇవన్నీ ప్రజలను ఒప్పించడానికి పైకి చెబుతున్న వాదనలు. వీటి సత్యాసత్యాలను అటుంచి, మనదేశ సామాజిక వ్యవస్థ నిర్మాణంలోని వైవిధ్యాన్ని, బహుళత్వాన్ని, ప్రాంతీయ వ్యత్యాసాలను దృష్టిలో పెట్టుకొని జమిలి ఎన్నికల అంశాన్ని పరిశీలిస్తే అసలు విషయం స్పష్టమవుతుంది. అది జాతీయ పెట్టుబడి ఆధిపత్యానికి, ప్రాంతీయ పెట్టుబడి ఆకాంక్షలకు మధ్యనున్న వైరుధ్యం. దీని రాజకీయ వ్యక్తీకరణే జాతీయ స్థాయిలోని పార్టీలకు ప్రాంతీయ పార్టీలకు మధ్య పోటీలు, ఘర్షణలు, బేరసారాలు, లొంగుబాట్లు, కాళ్ళబేరాలు. ఈ వైరుధ్యం మన దేశ ఆర్థిక అభివృద్ధిలో, రాజకీయ పరిణామంలో వివిధ దశల గుండా పయనిస్తూ వస్తోంది. మొదట స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ప్రాంతీయ పెట్టుబడి ఒక శక్తిగా రూపొందని కాలంలో జాతీయ పెట్టుబడి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ఏకఛత్రాధిపత్యం వహించింది. అనంతర కాలంలో

> జమిలి ఎన్నికలు సాధ్యం కావాలంటే భారత రాజ్యాంగానికి ఐదు సవరణలు అవసరమని న్యాయకోవిదులు భావిస్తున్నారు. రాజ్యాంగం నిర్మాణ చట్రంలో ఫెడరల్ స్వరూపం ఒక మౌలిక అంశం. ఈ ఫెడరల్ స్వరూపాన్ని దెబ్బతీయకుండా సవరణలు చేయడం సాధ్యం కాదు.




ముఖ్యంగా 1970 దశకం పూర్వార్థం నుంచి ప్రాంతీయ పెట్టుబడుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు రాజకీయ రంగంలో ఆవిర్భవించి, రాష్ట్రాల ఎన్నికల పోటీలో గెలిచి అధికారాన్ని చేపట్టాయి. అప్పటి నుంచి ఈ వైరుధ్యం తీవ్ర రూపం దాల్చడం కనిపిస్తుంది. అప్పటికి జాతీయంగానూ, దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ అపఖ్యాతిపాలు కాగా, దానికి ప్రత్యామ్నాయంగా అదే జాతీయ పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే మరొక జాతీయ పార్టీ ఆవిర్భావానికి జనతా పార్టీ రూపంలో చేసిన ప్రయోగం కూడా ఆ వైరుధ్యాన్ని టాకిల్ చేసే క్రమంలో జరిగింది. దీని ద్వారా అమెరికా, ఇంగ్లండ్‌ల తరహాలో ద్విపార్టీ పాలనను ప్రతిష్ఠించే ప్రయత్నం ప్రారంభమైంది. అంటే ఒక జాతీయ పార్టీ ప్రజల్లో పరపతిని కోల్పోయినప్పుడు మరొక జాతీయ పార్టీని ఛాంపియన్‌గా ఆకాశానికెత్తి అధికారంలోకి తేవడం.

తదనంతర కాలంలో 'కోయిలేషన్ పాలిటిక్స్' అనే ఒక కొత్త దశ అవతరించింది. ప్రపంచ పరిణామాలలో వచ్చిన పెను మార్పులలో భాగంగా 90లలో ప్రారంభమైన పెట్టుబడిదారీ ప్రపంచీకరణ విధానాల నిరాటంక అమలుకు ఈ కోయిలేషన్ పాలిటిక్స్‌లోని పరస్పర ఒత్తిళ్ళు, అధికార పెనుగులాటలు అవరోధాలుగా పరిణమించాయి. ప్రభుత్వాలు ఏర్పడడం, కూలిపోవడం, మధ్యంతర ఎన్నికలు రావడం వలన జాతీయ పెట్టుబడి, ప్రాంతీయ పెట్టుబడి రెండింటికీ అనేక చికాకులను తెచ్చి పెట్టాయి. ఎందుకంటే అప్పటికి ప్రాంతీయ పెట్టుబడికి చెందిన కొన్ని శక్తులు జాతీయ గుత్త పెట్టుబడిదారీ సంస్థలతో జతకట్టి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లోని కొన్ని రంగాలలో పాత్రను పోషించే స్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రపంచీకరణను నిర్దేశించే ఆర్థిక, పారిశ్రామిక ఉత్పత్తి 'సంస్కరణల' అమలు సజావుగా, శీఘ్రంగా, వేగంగా ముందుకు సాగాలంటే ఎన్నికల్లో ఒకే పార్టీకి సంపూర్ణ ఆధిక్యం ఉండాలనే అభిప్రాయాన్ని ఒక పథకం ప్రకారం కూడగట్టడం జరిగింది. ఇదే ధోరణిని 2014, 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రతిబింబించాయి.

ఈ పదేళ్ళ కాలంలో రాజ్యం పాలనాంగాలు గుత్త పెట్టుబడి ప్రయోజనాలను నెరవేర్చడమే ఏకైక ధ్యేయంగా పనిచేయడం కనిపిస్తుంది. ఈ క్రమంలో జాతీయ–ప్రాంతీయ పెట్టుబడుల మధ్య వైరుధ్యాన్ని నయానో, భయానో అణగదొక్కి, పూర్తిగా జాతీయ గుత్త పెట్టుబడికి, ప్రాంతీయ పెట్టుబడి పూర్తిగా లోబడిపోయి, దాసోహం అయ్యేలా చేసే చర్యలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం 'ఒకే దేశం–ఒకే పన్ను' నినాదంతో జీఎస్టీని తీసుకువచ్చి ఆర్థిక కేంద్రీకరణను మరింతగా పెంచింది. ఆదాయ రాబడులకై రాష్ట్రాలు కేంద్రంపై ఎక్కువగా ఆధారపడే విధంగా చేసింది. ప్రస్తుతం ఒకవైపు రెండు ప్రధాన పార్టీల మధ్య పోలరైజేషన్ చేసే ద్విపార్టీ రాజకీయ ప్రయోగాన్ని సజీవంగా ఉంచుతూనే, మరోవైపు ఏక పార్టీ స్వైర విహారానికి పావులు కదపడం కూడా జాతీయ గుత్త పెట్టుబడి ముందు ఒక ముఖ్య ఎజెండాగా ఉంది. అందుకుగాను 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' నినాదంతో రాజకీయ అధికారం యావత్తు ఏకీకరణ, కేంద్రీకరణ చేయడం అత్యంత అవసరం. గుత్త పెట్టుబడి ప్రయోజనాలను మరింతగా నెరవేర్చే ఆర్థిక, రాజకీయ కేంద్రీకరణ విధానం యెడల బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య పెద్ద విభేదమేమీ లేదు. అందుకే చాలా నేర్పుగా జమిలి బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపారు.

జమిలి ఎన్నికలు సాధ్యం కావాలంటే భారత రాజ్యాంగానికి ఐదు సవరణలు అవసరమని న్యాయకోవిదులు భావిస్తున్నారు. రాజ్యాంగం నిర్మాణ చట్రంలో ఫెడరల్ స్వరూపం ఒక మౌలిక అంశం. ఈ ఫెడరల్ స్వరూపాన్ని దెబ్బతీయకుండా సవరణలు చేయడం సాధ్యం కాదు. ఎందుకంటే పార్లమెంటు ఎన్నికలతో అసెంబ్లీ ఎన్నికలను ముడిపెట్టినప్పుడు రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన అనేక రాష్ట్ర ప్రభుత్వాల పదవీ కాలాన్ని అర్ధాంతరంగా కుదించవలసి వస్తుంది. అప్పటి రాజ్యాంగ పరిషత్ సభ్యుడైన శిబ్బన్ లాలా సక్సేనా ఒక సందర్భంలో ఇలా అన్నారు: "మన రాజ్యాంగంలో అన్ని ఎన్నికలు ఏక కాలంలో జరగడానికి వీలు లేదు. ఎందుకంటే వివిధ చట్టసభలలో అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించినప్పుడు శాసన సభలు రద్దవుతాయి. అందుకు అనుగుణంగా ఎన్నికలు వేర్వేరు సమయాల్లో ఉంటాయి." గతంలో 1967 వరకు నాలుగుసార్లు జమిలి ఎన్నికలు జరిగిన మాట నిజమే. అయితే ఈ సంప్రదాయం ఉల్లంఘనకు బూర్జువా రాజకీయాలలోని నైతిక పతనం, అధికార దాహం ప్రధాన కారణాలు కాదా? అధికార పార్టీ ప్రతిపక్ష ప్రభుత్వాలను బర్తరఫ్ చేయడం, ఫిరాయింపులతో కూల్చడం వంటి అప్రజాస్వామ్య చర్యలకు ఒడిగడుతున్నది బడా బూర్జువా పార్టీలు కాదా? వీటిని ప్రస్తుతం మరింతగా పోత్సహిస్తున్న బీజేపీ పార్టీ జమిలి ఎన్నికల ద్వారా ఈ దిగజారుడును అరికట్టగలుగుతుందని ఆశించగలమా? అలాగే జమిలి వల్ల తలెత్తే పర్యవసానం మరొకటి ఉంది. సాధారణంగా పార్లమెంటు ఎన్నికలలో జాతీయ అంశాలకు ప్రాధాన్యత ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికలలో స్థానిక, ప్రాంతీయ సమస్యలు చర్చకు వస్తాయి. జమిలిగా ఎన్నికలు జరిగితే జాతీయ అంశాల ప్రభావంలో స్థానిక, ప్రాంతీయ సమస్యలు మరుగున పడే అవకాశం ఉంటుంది. అదే విధంగా ప్రాంతీయ పార్టీల ప్రభావం, వైవిధ్యం క్రమంగా తగ్గిపోయి దేశ రాజకీయ వ్యవస్థ ఏకశిలా సదృశంగా మారడానికి భూమిక ఏర్పడుతుంది.


■ ఎస్. గోవిందరాజులు





అభివృద్ధి దారిలో..

కంకిపాడులో డిప్యూటీ సీఎం పవన్ తీరుపై హర్షం





కంకిపాడులో రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ తదితరులు

- అక్టోబరు 14న పల్లె పండుగకు హాజరు
- కంకిపాడు-రొయ్యూరు రహదారి పనులకు ఆదేశాలు
- అక్కడితో వదిలేయకుండా ఎప్పటికప్పుడు ఆరా
- రెండు నెలల్లో మళ్లీ అభివృద్ధి పనుల పరిశీలన
- తాజాగా సంక్రాంతికి పూర్తికావాలని ఆదేశాలు

నాడు : అక్టోబరు 14న కంకిపాడులో పల్లె పండుగ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఈ సమయంలో కంకిపాడు- రొయ్యూరు వయా గొడవర్రు రహదారి పరిస్థితి దయనీయంగా ఉందంటూ స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన అక్కడి నుంచే అభివృద్ధి పనులు చేపట్టా లంటూ సంబంధిత అధికారులను ఆరోజే ఆదేశించారు.

నేడు : కేవలం ఆదేశాలు జారీచేసి ఊరుకోలేదు. పనుల పురోగతి పరిశీలించేందుకు రెండు నెలల వ్యవధిలో సోమవారం మళ్లీ కంకిపాడుకు పవన్ కల్యాణ్ రావడంపై స్థానికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పరిశీలనతోనే సరిపెట్టక.. గోసాల గ్రామ పరిధిలో రహదారి ఎన్ని మీటర్ల వెడల్పు ఉండాలి, ఎన్ని అంగుళాలు ఎత్తు ఉండాలన్నది పవన్ నేరుగా టేపుతో కొలిచి కొలతలు వేశారు. కాల్వలో పెట్టిన పైపులు ఎన్ని అంగుళాలు ఉన్నాయంటూ కాల్వలో చెయ్యి పెట్టి మరీ కొలిచిన తీరును స్థానికులు ప్రశంసిస్తున్నారు.

కంకిపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు-రొయ్యూరు వయా గొడవర్రు రహదారి అభివృద్ధి పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. కంకిపాడు మండలంలోని గొడవర్రు గ్రామంలో రూ.3.75 కోట్లతో జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను, పెనమలూరు మండలం గోసాల గ్రామ పరిధిలో రూ.33 లక్షలతో చేపట్టిన రహదారి, డ్రెయినేజీ అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. మంగళగిరి నుంచి రోడ్డు మార్గాన గొడవర్రుకు చేరుకున్న ఆయన రహదారి నాణ్యతను పరిశీలించారు. రహదారి ఎప్పటికి పూర్తవుతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోసాల గ్రామ పరిధిలో రూ.33 లక్షలతో చేపట్టిన రహదారి, డ్రెయినేజీ పనులను పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జనసేన పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ముప్పా రాజా, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుబానీ, స్థానిక టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పులి శ్రీనివాసరావు, ఎందువ రాంబాబు, ఏనుగ జయప్రకాష్, వంగూరు పవన్ పాల్గొన్నారు.

గొడవర్రు గ్రామంలో జరిగిన పవన్ పర్యటనలో కేటుగాళ్లు చేతివాటం చూపించారు. కంకిపాడుకు చెందిన తిరుపతిరావు అనే వ్యక్తి పవన్‌ను కలిసేందుకు రాగా, ఆయన జేబులో ఉన్న సుమారు రూ.18 వేలు దొంగతనానికి గురయ్యాయి. అలాగే, ఓ రిపోర్టర్ జేబులోని సుమారు రూ.3 వేలతో పాటు మరో రిపోర్టర్ మనీపర్సు కూడా మాయమైంది.

స్వచ్ఛమైన మంచినీరు అందించే దిశగా..

గుడివాడలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

6లో



కొవ్వొత్తిని వెలిగించి క్రిస్మస్ వేడుకలను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు (ఇన్‌సెట్‌లో) వేడుకలకు హాజరైన క్రైస్తవులు

శాంతిమార్గంలో..

ప్రేమ, కరుణ, సేవతత్వాలను పెంచుకోవాలి

ప్రీ క్రిస్మస్ వేడుకల్లో సీఎం చంద్రబాబు వెల్లడి

- కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తుకు ఘన నివాళి
- క్రైస్తవ మత పెద్దలతో కలిసి ప్రేమ విందు స్వీకరణ



సీఎంకు క్రిస్మస్ కేకును తినిపిస్తున్న ఫాదర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : క్రీస్తు త్యాగాలను స్మరించుకుంటూ శాంతిమార్గాన్ని అనుసరిద్దామని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో ప్రీ క్రిస్మస్ సెలబ్రేషన్స్-2024 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రేమ, కరుణ, సేవకు ప్రతీక క్రైస్తవమన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమతత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈర్ష్యా ద్వేషాలను వీడాలని కోరారు. అబద్ధం, అవినీతి వంటి వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. 'భగవంతుడు నిన్ను ఎప్పుడూ ఖాళీగా వదిలిపెట్టడు. నీవు కోల్పోయిన ప్రతి ఒక్కదానినీ తిరిగి నీకిస్తాడు. ఆటుపోట్లను ఎదుర్కొన్నప్పుడు నిన్ను మళ్లీ పైకి తీసుకొచ్చేందుకు సహాయం అందిస్తాడు' అని చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల పట్ల దయ, ధర్మాన్ని నమ్మిన వారికి దేవుడు ఎల్లప్పుడూ అండగా ఉంటాడన్నారు.

సేవా కార్యక్రమాలకు స్ఫూర్తి

స్వాతంత్ర్యం రాకముందు నుంచి క్రైస్తవ మిషనరీ సంస్థలు కాలేజీలు, హాస్పిటళ్లు కట్టి పేదలకు సేవ చేస్తున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు స్ఫూర్తినిచ్చింది ఏసు ప్రభువేనన్నారు. లోకరక్షకుడైన ప్రభువు కరుణ, కటాక్షాలు ఉండాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. మైనారిటీ సోదరులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం, చెడు మళ్లీ జరక్కుండా చర్యలు తీసుకుంటున్నానన్నారు. పేదరికం లేని సమాజం కోసం తాను ఆలోచనలు చేస్తున్నానని, విజన్- 2047లో నిర్దేశించుకున్న ప్రధాన లక్ష్యం ఇదేనన్నారు. క్రైస్తవులకు మెరుగైన సంక్షేమం, ఆర్థిక సహాయ సహకారాలు అందించింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సోదరులందరికీ సీఎం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్‌చేసి క్రైస్తవ మత పెద్దలకు తినిపించారు. క్రైస్తవ మతపెద్దలు కూడా చంద్రబాబుకు కేకు తినిపించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించారు. ప్రేమ విందుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అరుణ వర్ణ శోభితం



భవానీల రాకతో ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి

ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఉత్సవాలు సోమవారం మూడో రోజు కూడా ఘనంగా జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి భవానీలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఉత్సవాల ముగింపు ఉండటంతో తండోపతండాలుగా వస్తున్నారు. రైళ్లు, బస్సులతో పాటు కాలినడకన వస్తున్న భవానీలతో ఇంద్రకీలాద్రి అరుణవర్ణాన్ని పులుముకుంది. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భవానీలు గిరిప్రదక్షిణ చేసి దుర్గమ్మ దర్శనానికి వెళ్తున్నారు. అనంతరం దీక్షను విరమిస్తున్నారు. కాగా, రద్దీని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నారు. - వన్‌టౌన్, ఆంధ్రజ్యోతి



దుర్గమ్మ విగ్రహంతో ఇరుముడి తీసుకెళ్తున్న ఓ భవానీ

ఢిల్లీ చేరిన వెస్ట్ బైపాస్

ముదురుతున్న ల్యాంకో టవర్ల మార్పిడి వివాదం

- ప్రధాని, కేంద్రమంత్రి , సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు రైతుల ఫిర్యాదు
- లైసెన్స్ లేని కంపెనీతో పనులపై కేంద్రం సీరియస్
- విచారణకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖకు ఆదేశాలు
- ఎన్‌హెచ్ విజయవాడ ఆర్వో ఆఫీసు అధికారులపై గడ్కరీ కన్నెర్ర
- తక్షణం వివరణ ఇవ్వాలంటూ లేఖ
- ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల వివరణ కోరిన సెంట్రల్ విజిలెన్స్ కమిషన్
- మరోవైపు హైకోర్టు సీరియస్.. 13 కేసులపై 11 స్టేలు
- ఇప్పటికే సమగ్ర విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు వెంబడి ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి వివాదం పెద్ద దుమారంగా మారుతోంది. ఇప్పటికే ఈ ఘటనపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేసి, సమగ్ర విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేయగా, తాజాగా ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సీరియస్ కావడంతో వెస్ట్ బైపాస్ కథ కీలక మలుపులు తిరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు వెంబడి ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి వివాదం ఢిల్లీకి చేరింది. జక్కంపూడి, నైనవరానికి చెందిన రైతులు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ప్రధానికి ఆన్‌లైన్ గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా.. సాక్ష్యాధారాలు సహా ఫిర్యాదు చేశారు. వెంటనే ప్రధాని కార్యాలయం నుంచి రైతులకు సమాధానం కూడా అందింది. ఈ అంశంపై ఫాలో అప్ చేస్తామని రిప్లై వచ్చింది. అంతేకాదు.. విచారణ జరపాలని కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖకు ఆదేశాలు కూడా అందాయి. రైతుల ఫిర్యాదు అందుకున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా స్పందించారు. జాతీయ రహదారుల సంస్థ విజయవాడ ఆర్వో కార్యాలయ ఉన్నతాధికారులపై సీరియస్ అయ్యారు. తక్షణం వివరణ కోరారు. కాగా, రైతులు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు చేయటంతో ఆ సంస్థ కూడా స్పందించింది. దీనిపై కేంద్ర జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులను వివరణ కోరింది. ఎన్‌హెచ్ ఉన్నతాధికారులు విజయవాడ ఆర్వో కార్యాలయ అధికారులను వివరణ కోరారు. ఒకేసారి ప్రధాన మంత్రి కార్యాలయం, నితిన్ గడ్కరీ కార్యాలయం, సెంట్రల్ విజిలెన్స్ కార్యాలయాలు స్పందించటంతో విజయవాడ వెస్ట్ బైపాస్ ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల అంశం సంచలనంగా మారింది. అయితే, ఇన్నాళ్లూ రైతులను అక్రమంగా అరెస్టులు చేయిస్తూ పనులు చేపట్టిన సంస్థలన్నీ సైలెంట్ అయ్యాయి. తవ్విన గోతులను రాత్రికి రాత్రే పూడ్చేశాయి. కాగా, తమకు జరుగుతున్న అన్యాయాన్ని జక్కంపూడి, నైనవరం రైతులు ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి వివరించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వీరిని

మిగతా 6లో..



వెస్ట్ బైపాస్ సమీపంలో టవర్ల మార్పిడి పనులు (ఫైల్)

హైకోర్టు సీరియస్.. 11 స్టేలు విడుదల

మూతపడిన ల్యాంకో పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన ల్యాంకో ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి వెనుక భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని రైతులు హైకోర్టును ఆశ్రయించారు. మూతపడిన ప్రైవేట్ సంస్థ ప్రయోజనాల కోసం వందలాది మంది రైతులను ఇబ్బందులు పెడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై ఇప్పటికే ఐదు స్టేలు ఇచ్చిన న్యాయస్థానం తాజాగా మరో ఆరు జారీ చేసింది. 13 కేసులకు సంబంధించి ఇప్పటి వరకు 11 స్టేలు వచ్చాయి. ఈ అంశంపై హైకోర్టు సీరియస్‌గా ఉంది. ల్యాంకో లైన్ లైసెన్స్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. తదుపరి విచారణ పూర్తిచేసే వరకు యథాతథ పరిస్థితిని కల్పిస్తూ స్టేలు ఇచ్చింది. మిగిలిన రెండింటికీ స్టేలు వచ్చే అవకాశం ఉంది.

పీడీఎస్ బియ్యం మాయం కేసులో విచారణ వేగవంతం

- కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు

మచిలీపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో పీడీఎస్ బియ్యం మాయం కేసులో దర్యాప్తును వేగవంతం చేసినట్లు ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. కంకిపాడులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీడీఎస్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నానికి నోటీసులు జారీ చేశామని, ఆయన నోటీసులు చూడకపోతే మళ్లీ ఇస్తామని చెప్పారు. ఈ కేసు విచారణపై ఎవరూ, ఎలాంటి అపోహలు పడవద్దని, నిష్పక్షపాతంగా దర్యాప్తు సాగుతుందని తెలిపారు. ఈ కేసులో ఇరువురిపై కేసు నమోదు చేశామని, ఒకరు యాంటిసిపేటరీ బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారన్నారు. దీనికి పోలీస్ విభాగం తరపున కౌంటర్ దాఖలు చేసినట్లు తెలిపారు. మానస తేజ అనే వ్యక్తి గోడౌన్‌కు మేనేజర్‌గా ఉన్నారని, అతని ఆచూకీ కోసం గాలింపు చేపట్టామన్నారు. త్వరితగతిన ఈ కేసును విచారణ చేస్తున్నామని తెలిపారు. ఈ కేసులో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయని వివరించారు.

పుస్తక పండక్కి ముస్తాబు



- జనవరి 2 నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో..
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభ కార్యక్రమం
- 200 స్టాల్స్‌తో భారీగా పుస్తక మహోత్సవ ఏర్పాట్లు
- 6న పుస్తక ప్రియుల పాదయాత్ర, హాజరుకానున్న సాహితీ ప్రియులు, ప్రముఖులు

8లో

ఇవేనా పొదుపు చర్యలు..?

సొంత వాహనాలకు ఆర్టీసీ డ్రైవర్లను ఉపయోగిస్తున్న అధికారులు

- లైట్ వెయిట్ వాహనాలకు హెవీ వెహికల్ డ్రైవర్లు అవసరమా?
- ఒకపక్క డ్రైవర్ల కొరత.. అద్దె డ్రైవర్లను తెచ్చినా సరిపోని పరిస్థితి!
- సొంత అవసరాలకు దాదాపుగా 400 మంది డ్రైవర్ల వినియోగం
- ఆర్టీసీపై అదనపు ఖర్చు.. ప్రయాణికులకు ఎంతో కష్టం

8లో


చల్లగ చూడు తల్లీ..



భక్తి పారవశ్యంతో..

మూడోరోజు దుర్గమ్మను దర్శించుకున్న 63,500 మంది భక్తులు

వన్‌టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భవానీదీక్షల విరమణల మూడో రోజైన సోమవారం సాయంత్రం వరకు 63,500 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 15 వేల మందికి దేవస్థానం అన్న ప్రసాద వితరణ చేసింది. ఉదయం అల్పాహారం 5000 మందికి, సాయంత్రం కదంబం, ఉప్మా 8,000 మందికి అందజేశారు. సాయంత్రం 6 గంటల వరకు 13,700 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. సాయంత్రం వరకు 3,50,450 లడ్డు ప్రసాదాలను విక్రయించారు. కనకదుర్గమ్మవారి దర్శనం వేకువజామున 3 నుంచి రాత్రి 11 గంటలవరకు కొనసాగుతోంది. ఎటువంటి ఇబ్బందులు లేకపోవడంతో దర్శనాల పట్ల భక్త జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివిధ సమాచారం అందించే యాప్ పట్ల భక్తులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఫలితంగా భక్తులు ఆయా సేవలను సులభంగా పొందగలుగుతున్నారు. 7 లక్షల మంచినీరు బాటిళ్లు దేవస్థానం సిద్ధం చేసింది.




కొండపై భక్తజన సందోహం


దీక్ష విరమణ


హోమగుండం


తలనీలాలు సమర్పిస్తూ..


జల్లు స్నానాలు చేస్తూ..

పేర్ని నాని అరెస్టు తప్పదు

- ఇంట్లో మహిళల్ని రోడ్డుకీడ్చిన విధానం సిగ్గుచేటు
- మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ



మచిలీపట్నం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పేదల బియ్యం మాయం కేసులో తప్పించుకు తిరుగుతున్న పేర్ని నానిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం మునిసిపల్ పార్కు వద్ద ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. సొంత గోడాములో బియ్యం మాయమైతే తెలియదని పేర్ని నాని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తప్పు చేయకపోతే ఎందుకు తప్పించుకుతిరుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. గోదాములో బియ్యం మాయంపై పూర్తి విచారణ జరిపిస్తామని, దోషులు అందరినీ శిక్షించి తీరతామన్నారు. అడగకుండానే రూ. 1.70 కోట్లు ప్రభుత్వానికి ఎందుకు చెల్లించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా గుట్టు బయటపెడతామన్నారు. ఇంట్లో మహిళల్నీ రోడ్డున పడేసిన విధానం చూస్తుంటే సిగ్గేస్తోందన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, పేర్ని నాని గోదాము నిర్మాణమే అవినీతి సొమ్ముతో జరిగిందని, అధికారుల్ని అడ్డంపెట్టుకుని ఉపాధి హామీ నిధుల్ని దుర్వినియోగం చేసి మట్టి తరలించుకున్నారన్నారు. అవినీతికి సహకరించిన అధికారుల్ని కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నారని, మెడికల్ కాలేజీ పేరుతో చేసిన దోపిడీని కాగ్ నివేదికలో పేర్కొందన్నారు. అధికారం ఉందని అడ్డగోలుగా దోచుకుని ఇప్పుడు తప్పించుకోవాలనుకుంటే కుదరదన్నారు. పేర్ని నాని ఎక్కడ దాక్కున్నా వదిలే ప్రసక్తే లేదన్నారు. దోపిడీలను బట్ట బయలు చేసి ప్రజా కోర్టులో దోషిగా నిలబడెతామన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తున్న కేశినేని చిన్ని, కోట వీరబాబుకు సత్కారం, సీఎల్ఆర్‌పీ పోస్టుల్లో తీసుకోవాలని ఎంపీ శివనాథ్‌ను కోరుతున్న రిసోర్స్ పర్సన్లు

క్లస్టర్ లెవల్ రిసోర్స్ పర్సన్లుగా తీసుకోండి

- ఎంపీ శివనాథ్‌కు రిసోర్స్ పర్సన్ల వినతి

వన్‌టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తమను క్లస్టర్ లెవల్ రిసోర్స్ పర్సన్లుగా తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ యూసీడీ విభాగంలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లు సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసి విన్నవించారు. ఈమేరకు ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. విజయవాడలో కొత్తగా నియమకాలు చేస్తున్న వారిలో తమను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామని ఎంపీ హామీ ఇచ్చినట్టు చెప్పారు.

● నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కోట వీరబాబు సోమవారం ఎంపీ శివనాథ్‌ను ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. చందర్లపాడు మండల అధ్యక్షుడు మేకల సుధాకర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

● తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలం గుళ్లపూడికి చెందిన లగడపాటి జనార్ధనరావుకు ఇటీవల గుండె ఆపరేషన్ జరిగింది. ఆయన అభ్యర్థన మేరకు రూ.1,46,075 చెక్కును ఎంపీ శివనాథ్ బాధితుడి కుమారుడు హరిప్రసాద్‌కు అందజేశారు.

● రాష్ట్ర ఐటీడీపీ అధ్యక్షుడు చింతకాయల విజయ్, ప్రధాన కార్యదర్శి దేవభక్తుని శివకృష్ణ,ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల కృష్ణ, కృష్ణాజిల్లా ఐటీడీపీ అధ్యక్షుడు ఉప్పల పాటి ప్రవీణ్, రాష్ట్ర కార్యదర్శి తుమ్మల చైతన్య తదితరులు ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసారు.

దుర్గగుడి వైదిక కమిటీ నియామకం

వన్‌టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో విశిష్ట పర్వదినాలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు వైదిక కమిటీని నియమిస్తూ ఈవో రామారావు సోమవారం ఉత్వర్వులు జారీ చేశారు. స్థానాచార్యుడు వి.శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్, కేఎస్ వీడీఎం ప్రసాద్, బి.శంకర శాండిల్య, ఎం.షణ్ముఖశాస్త్రి,ఆర్.శ్రీనివాస శాస్త్రి, యావీఎస్ మురళీధర శాస్త్రి, పీవీ రఘునాథశర్మ, వి.శ్రీధర్ శర్మ, ఓ. రమేష్‌బాబులను కమిటీ సభ్యులుగా నియమించారు.

వ్యర్థాల నిర్వహణపై మహారాష్ట్ర, గుజరాత్‌లలో అధ్యయనం

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్వచ్ఛ భారత్ మిషన్ ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేసేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నడుంబిగించింది. ఆ ప్రాజెక్టులు విజయవంతంగా అమలవుతున్న దేశంలోని పలు ప్రాంతాల్లో కార్పొరేషన్ యంత్రాంగం అధ్యయనం చేపట్టింది. అందులో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాంతో పాటు పలువురు అధికారులు మహారాష్ట్ర, గుజరాత్‌లో పర్యటిస్తున్నారు. ఈ జట్టులో పట్టాభిరాంతో పాటు ఎండీ టీ అనిల్ కుమార్ రెడ్డి, పురపాలక శాఖ కమిషనర్ డి.దశరథరామిరెడ్డి, డీఈఈ సతీశ్ కుమార్ తదితరులు ఉన్నారు. ఈ నెల 17న ప్రారంభమైన అధ్యయన యాత్ర 24 వరకు ముంబై, సూరత్, వడోదరలో కొనసాగుతుంది. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ఈ బృందం అధ్యయనం చేస్తుంది.

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి

- 'మీకోసం'లో నోడల్ అధికారులకు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం

కృష్ణలంక, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలన లక్ష్యంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) 'మీకోసం' ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంపై నోడల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పాల్గొన్నారు. తొలుత పీజీఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధించి రిసెప్షన్, సమాచార కౌంటర్‌తో పాటు రిజిస్ట్రేషన్, హెల్ప్‌డెస్క్, ఆధార్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి పి.జ్యోతి తదితరులతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.


'మీకోసం'లో సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

విజయవంతంగా చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు

జిల్లా పంచాయతీ కార్యాలయం అధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ సందర్భంగా ఏర్పాటుచేసిన వర్మీ కంపోస్ట్ విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామపంచాయతీ 'చెత్త సంపద సృష్టి కేంద్రం' ద్వారా తయారుచేసిన వర్మీ కంపోస్టు విక్రయాలను పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా కిలో వర్మి కంపోస్ట్ ప్యాకెట్ రూ.20కు అందుబాటులో వున్నట్టు అధికారులు వివరించారు. అర కిలో, కిలో, రెండు కిలోల ప్యాకెట్లను అందుబాటులో వుంచినట్టు వివరించారు. మొక్క వేగంగా, ఆరోగ్యవంతంగా పెరిగేందుకు వర్మీ కంపోస్టు ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టిసారించడం జరుగుతోందని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు విజయవంతంగా నడుస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై స్పందించండి

- కృష్ణాజిల్లా జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారవేదిక(మీకోసం) కార్యక్రమంలో వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కృష్ణా జిల్లా జేసీ గీతాంజలిశర్మ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో కలిసి ఆమె ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఈనెల 19 నుంచి 25వరకు కేంద్రప్రభుత్వం ఆదేశాలమేరకు ప్రశావన్ గావ్ సప్తహ్(గుడ్ గవర్నెన్స్) కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో వివిధ శాఖలద్వారా అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సక్సెస్‌స్టోరీలను ఈనెల 25లోగా అధికారులు సమర్పించాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ, మండలస్థాయిలోనూ మీకోసం కార్యక్రమం నిర్వహించాలని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్‌లకు సూచించారు. భూవివాదాలకు సంబంధించిన అంశాలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, వీటి పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో అధికారులు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈనెల 28న ఉమ్మడికృష్ణాజిల్లాలో 'వన్‌మాన్ కమిషన్ ఆన్ ఎస్సీ సబ్‌క్లాసిఫికేషన్' అంశంపై విజిట్ ఉంటుందని, అన్ని శాఖల అధికారులు నిర్దేశించిన ఫార్మాట్‌లో నివేదికలను సమర్పించాలన్నారు. జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా దివ్యాంగురాలికి ఉపాధికోసం రూ.5లక్షల చెక్కును జేసీ అందజేశారు. కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మెప్మా పీడీ సాయిబాబు, పౌరసరఫరాలశాఖ డీఎం పద్మాదేవి, డీఎస్‌వో పార్వతి వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గీతాంజలిశర్మ

● దీర్ఘకాలిక వ్యాధులతో మంచాన ఉన్న దివ్యాంగులకు సంబంధించి ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు రిజిస్ట్రార్లు ఇళ్లవద్దకే వెళ్లి సేవలందించాలని జేసీ గీతాంజలి శర్మకు కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ అంశాన్ని పరిశీలించి తక్షణమే సేవలందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

నాన్ ఇంటర్ లాకింగ్ పనులు

26 రైళ్లు రద్దు.. 21 డైవర్షన్

- భవానీ భక్తులకు తప్పని ఇబ్బందులు!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడకు భవానీలు పోటెత్తుతున్న నేపథ్యంలో, మరోవైపు రైల్వే అధికారులు ముందస్తు ఆలోచన లేకుండా భారీ సంఖ్యలో రైళ్లను రద్దుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నగరానికి భవానీలు తరలివస్తున్న సమయంలో రైల్వే అధికారులు నాన్ ఇంటర్‌లాక్ పనులు చేపట్టారు. అర్ధంతరంగా పనులు చేపట్టడం వల్ల భవానీలకు ఇబ్బందులు తప్పలేదు. నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా భారీ సంఖ్యలో రైళ్లను రద్దు చేయడంతో విజయవాడకు రాకపోకలు సాగించే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజీపేట-విజయవాడ సెక్షన్‌లో మోటుమర్రి వద్ద నాన్ ఇంటర్‌లాకింగ్‌పనుల కారణంగా 26 రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. రెండు రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. మరో 21 రైళ్లను డైవర్షన్ చేసింది.

● డోర్నకల్-విజయవాడ (07755), విజయవాడ డోర్నకల్ (07756), విజయవాడ-భద్రాచలం (07979), భద్రాచలం-విజయవాడ (07278), గుంటూరు-సికింద్రాబాద్ (12705), సికింద్రబాద్-గుంటూరు (1206), విజయవాడ-సికింద్రాబాద్ (12713), సికింద్రాబాద్-విజయవాడ (12714), కొచ్చివేలు-ఇండోర్ (22646), ఇండోర్-కొచ్చువేలు (22645), కొచ్చువేలు-కోర్బా (22648), కోర్బా-కొచ్చువేలు (22647), గోరఖపూర్-కొచ్చువేలు(12511), కొచ్చువేలు-గోరఖ్‌పూర్ (12512), బారౌని-ఎర్నాకుళం(12521), ఎర్నాకుళం-బారౌని (12522), ధన్‌బాద్-కోయంబత్తూరు (03325), కోయంబత్తూరు-ధన్‌బాద్(03326), హిస్సార్-తిరుపతి (04717), తిరుపతి-హిస్సార్ (04718), బెంగళూరు-దానాపూర్ (06509), దానాపూర్-బెంగళూరు(06510)

● గుంటూరు-సికింద్రబాద్ (17201) సికింద్రాబాద్-గుంటూరు (17202) రైళ్లను జనవరి 9 వరకు పాక్షికంగా రద్దు చేశారు.

● విశాఖపట్నం-ముంబాయి, షాలిమార్-హైదరాబాద్, సాయినగర్ షిర్డీ-కాకినాడ పోర్టు, సాయినగర్ షిర్డీ-మచిలీపట్నం, మచిలీపట్నం-సాయినగర్ షిర్డీ, ముంబాయి-భువనేశ్వర్, భువనేశ్వర్-ముంబాయి, షాలిమార్-సికింద్రాబాద్, విశాఖపట్నం-సికింద్రాబాద్, సికింద్రాబాద్-షాలిమార్, హెచ్ నిజాముద్దీన్-కన్యాకుమారి, హెచ్‌నిజాముద్దీన్-త్రివేండ్రం, హెచ్ నిజాముద్దీన్-ఎర్నాకుళం, దానాపూర్-బెంగళూరు, బెంగళూరు-దానాపూర్ రైళ్లను విజయవాడ, గూడూరు, వరంగల్, కాజీపేట స్టేషన్ల మీదుగా వెళ్లటాన్ని తొలగించారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ స్వర్ణోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఆ సంఘం నేతలు ఆహ్వానించారు. ఆ సంఘం నేతలు ఎన్. వెంకటేశ్వర్లు, ఎం.హనుమంతురావు సోమవారం సచివాలయంలో సీఎంను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. జనవరి 5 నుంచి 8 వరకు కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు యూటీఎఫ్ నేతలు తెలిపారు. అలాగే ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన బొర్రా గోపీమూర్తికి సీఎం అభినందనలు తెలిపారు. యూటీఎఫ్ నేతలతో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఉన్నారు.


పీవీకి నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర, కొనకళ్ల తదితరులు

రాజనీతిజ్ఞుడు పీవీ

- మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుజాతి గర్వించదగిన రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధాని పీవి నరసింహారావు అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పీవీ నరసింహారావు 20వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీచైర్మన్ కొనకళ్ల నారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసింహారావు జీవిత విశేషాలను బావితరాలకు తెలియచేసే లా కృషి చేస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకుడు పీవీ ఫణికుమార్ కృషి అభినందనీయమన్నారు. గడ్డం రాజు, శ్రీరామచంద్రమూర్తి, హరికృష్ణ, గోపీచంద్, బాబాప్రసాద్, ఇలియాస్ పాషా, సమతాకీర్తి, నీరజ, సుశీల, ఉమాదేవి, నారాయణ ప్రసాద్, బ్రాహ్మణ సంఘ నాయకులు పి.ఎస్.ఎస్.ఆర్. శర్మ, శివరాం, మోపర్తి సుబ్రహ్మణ్యం, కాశీపట్నపు రఘు, ఫణి కిరణ్ శర్మ, తిరుమలరావు పాల్గొన్నారు.


గుడివాడ మండలం కొత్త చౌటపల్లిలోని మల్లాయిపాలెం గ్రామ రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్, చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, గుడవాడ ఎమ్మెల్యే రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, కలెక్టర్ బాలాజీ తదితరులు

స్వచ్ఛమైన నీరు అందించే దిశగా..

- గుడివాడలో డిప్యూటీ సీఎం పవన్

గుడివాడ/గుడివాడ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థలో సమూల మార్పులను తీసుకొచ్చి, గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేలా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గుడివాడ మండలం కొత్త చౌటపల్లిలోని మల్లాయిపాలెం గ్రామ రక్షిత మంచినీటి పథకాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. తొలుత మల్లాయిపాలెం రక్షిత మంచినీటి పథకం చెరువును పరిశీలించారు. కలెక్టర్ డీకే బాలాజీ.. ఫిల్టర్ బెడ్‌ల పనితీరును పవన్‌కు వివరించారు. ఫిల్టర్ బెడ్‌ల ద్వారా సరఫరా అవుతున్న స్వచ్ఛమైన తాగునీటి నమూనాల ప్రదర్శనను అధికారులతో కలిసి పరిశీలించారు. నీటిశుద్ధి పరీక్షలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ గుడివాడ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి చేరిన వేస్ట్ బైపాస్

(5వ పేజీ తరువాయి)

సీఎం వద్దకు తీసుకెళ్లారు. దీనికి స్పందించిన సీఎం ఐఏఎస్ అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అక్రమాలు ఇలా..

ల్యాంకోకు చెందిన ట్రాన్స్‌మిషన్ లైన్‌కు సెంట్రల్ ఎలక్ట్రికల్ రెగ్యులేషన్ కమిటీ నుంచి లైసెన్స్ (164 లైసెన్స్) లేదు. ఈ లైసెన్స్ లేని సంస్థకు చెందిన టవర్ లైన్లను మార్చే అధికారం ఎన్‌హెచ్‌కు కూడా ఉండదు. లైసెన్స్ లేని ఓ ప్రైవేట్ సంస్థ ప్రయోజనాల కోసం టవర్ల మార్పిడి పేరుతో ఎన్‌హెచ్ విజయవాడ ఆర్వో కార్యాలయం అధికారులు రూ.32.58 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ చర్య కేంద్ర ప్రభుత్వానికి నష్టం చేకూరుస్తుంది. మూతపడిన సంస్థ గతంలో ఇచ్చిన ప్రతిపాదనను దృష్టిలో ఉంచుకుని పనులకు టెండర్లు పిలవటంతో ఆ సంస్థకు సూపర్ వైజేషన్ చార్జీల కింద రూ.44 లక్షల మేర చెల్లించారు. ల్యాంకో సంస్థ నుంచి ఒక యూనిట్‌ను కొనుగోలు చేసిన రాధా టీఎంటీ అనే సంస్థ విద్యుత్ అంతరాయం పేరుతో రూ.14 కోట్లను ఎన్‌హెచ్ నుంచి డిమాండ్ చేయటం, ఎన్‌హెచ్ కొంత మేర డబ్బు చెల్లించటం గమనార్హం. వాస్తవానికి రాధా టీఎంటీ కేవలం ప్లాంట్‌లోని ఒక యూనిట్‌ను మాత్రమే కొనింది. ట్రాన్స్‌మిషన్ టవర్ల లైన్‌ను మాత్రం మయన్మార్‌కు చెందిన సంస్థ కొనుగోలు చేసింది. మయన్మార్ సంస్థ దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. రాధా టీఎంటీ అనే సంస్థ ఏ అధికారంతో రూ.14 కోట్లు డిమాండ్ చేసిందో తెలియాలి. ఒకవేళ మయన్మార్ కంపెనీ, రాధా టీఎంటీలు అంతర్గత ఒప్పందం కుదుర్చుకున్నా లైసెన్స్ జారీకి అది చెల్లబాటు కాదు. రెండు టవర్లతో పోయే దానిని 11 టవర్లకు పెంచి రోడ్డుకు 105 మీటర్ల దూరంలో అర్ధచంద్రాకారంగా తిప్పుతూ రైతులను ఇబ్బంది పెడుతున్న అలైన్‌మెంట్ వ్యవహారంలో ఎన్‌హెచ్, రాధా టీఎంటీ, పాత ల్యాంకో యాజమాన్యాల హస్తం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి.


కృష్ణాతరంగ్ విజేతలైన కేబీఎన్ కాలేజీ విద్యార్థులు

సౌత్ జోన్ పోటీలకు కృష్ణా వర్సిటీ జట్లు

వన్‌టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈనెల 26నుంచి నిర్వహించనున్న దక్షిణ భారత (సౌత్‌జోన్) అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాలలో పాల్గొననున్న కృష్ణావర్సిటీ జట్టును రెక్టర్ మండవ బసవేశ్వరరావు సోమవారం ప్రకటించారు. కేబీఎన్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 10నుంచి 12 వతేదీ వరకు కళాశాలలో నిర్వహించిన కృష్ణాతరంగ్ పోటీల్లో ప్రతిభచూపిన జట్ల నుంచి సౌత్‌జోన్‌కు ఎంపిక చేసినట్టు తెలిపారు. 58 మందితో జట్టు ఈనెల 25న బయలుదేరి వెళుతుందని తెలిపారు. కళాశాల నుంచి ఏకాంకిక, స్కిట్, మైమ్, పాశ్చాత్యగానం, సోలో బృందగానం జట్లు వెళతాయన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల నుంచి జానపద ఆర్కెస్ట్రా, మెహిందీ, రంగోలి, శాస్త్రీయ సంగీతం సోలో, వాద్యం సోలో, లలిత సంగీతం గాత్రం, బృందగానం, శాస్త్రీయ నృత్య జట్లు వెళతాయని, సిద్ధార్థ మహిళా కళాశాల నుంచి జానపద నృత్యం, ఉపన్యాసం జట్లు, నలంద కళాశాల నుంచి క్విజ్, చర్చ, క్లే మౌల్డింగ్, ప్రత్యక్ష పెయింటింగ్, ఫొటోగ్రఫీ, కార్టూనింగ్, కొలేజ్, పోస్టర్ మేకింగ్, ధ్వన్యనుకరణం, ఇన్‌స్టాలేషన్ జట్లు వెళ్లనున్నట్టు చెప్పారు. రెక్టర్ వెంట కేబీఎన్ ప్రిన్సిపాల్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ పీ ఎల్ రమేష్, కె.రామకృష్ణలు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఈనెల 10 నుంచి 12వరకు కేబీఎన్ కళాశాలలో నిర్వహించిన కృష్ణాతరంగ్ పోటీలలో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. స్కిట్, మిమిక్రీ, క్లే మౌల్డింగ్, స్పాట్ ఫొటో గ్రఫీ, ఇన్‌స్టాలేషన్, మెహిందీ, ఆన్ స్పాట్ పెయింటింగ్ విభాగాలలో ప్రథమ బహుమతి, మైమ్, పోస్టర్ మేకింగ్, కోలేజ్ విభాగాలలో ద్వితీయ బహుమతి, కార్టూనింగ్ విభాగంలో తృతీయ బహుమతి అందజేశారు.

ట్రైకార్ ఎండీగా సదాభార్గవి

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్) మేనేజింగ్ డైరెక్టర్‌గా గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ట్రైకార్ పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ జీఓ నం.171ను ప్రభుత్వం విడుదల చేశారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	100,109, 120
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 590	

ఏఐవైఎఫ్ 22వ మహాసభలను విజయవంతం చేయండి

ధర్నాచౌక్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6 నుంచి 9వతేదీ వరకు నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. మహాసభ లోగోను దాసరిభవన్‌లో సోమవారం వారు ఆవిష్కరించారు. సమగ్ర యువజన విధానం, నూతన పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి కల్పన, విశాఖ ఉక్కు, కడపలో ఉక్కు పరిశ్రమపై, రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధుల సమీకరణ, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ తదితర అంశాలపై ఈ మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని వారు తెలిపారు.



ఆటోనగర్ మూడో క్రాస్‌రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వ్యాపారులు ఉంచిన వాహనం విడిభాగాలు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

● రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్న ఆటోనగర్‌వాసులు

(ఆంధ్రజ్యోతి-ఆటోనగర్)

ఆటోనగర్‌లో విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బాక్సులు కొన్నిచోట్ల తలుపులు ఊడిపోయి ఉన్నాయి. మరికొన్ని చోట్ల బాక్సులే లేవు. రక్షణవలయాలు లేకపోవడంతో వర్షాకాలంలో ప్రమాదకరంగా ఉంటున్నాయి. మరమ్మతుల పేరుతో చెట్లకొమ్మలు కొడుతున్నారే తప్ప, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల పక్కనే వ్యాపారులు వాహనాల విడిభాగాలను పెడుతున్నారు. దీంతో ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉందని, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఫ్యూజ్‌బాక్సులకు రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



నాలుగో క్రాస్‌రోడ్డు సమీపంలో తలుపు ఊడిపోయిన ఫ్యూజ్ బాక్సు



ద్వితీయ స్థానం సాధించిన జట్టుతో సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన

నెట్‌బాల్ పోటీల్లో సిద్ధార్థ విద్యార్థినుల ప్రతిభ

లబ్బీపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నూజివీడులోని ధర్మ అప్పారావు కాలేజ్ ఆఫ్ పీజీ స్టడీస్‌లో ఈనెల 21వ తేదీన నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల నెట్‌బాల్ పోటీల్లో తమ కళాశాల జట్టు ద్వితీయస్థానం కైవసం చేసుకుందని సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. జనవరి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జైపూర్‌లోని జ్ఞాన్‌విహార్ యూనివర్సిటీలో నిర్వహించనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్‌బాల్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని ఆమె తెలిపారు. క్రీడాకారులను కళాశాల కన్వీనర్ లలితాప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, ప్రిన్సిపాల్ కల్పన తదితరులు అభినందించారు.



రాఘవయ్య పార్క్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

హెల్మెట్ తప్పనిసరి

● ద్విచక్రవాహనదారులతో ట్రాఫిక్ ఎస్సై సాయిచంద్ర

లబ్బీపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఎస్సై సాయిచంద్ర సూచించారు. సోమవారం రాఘవయ్య పార్క్ ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ లేని వాహదారులకు జరిమానా విధించారు. హెల్మెట్ ధరించకపోతే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వాహనాలపై గతంలో ఉన్న కేసులను పరిశీలించారు. ఇప్పటికే హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, హెల్మెట్ లేని వారితో వాటిని కొనుగోలు చేయించామని ఎస్సై తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే వాహనాలు సీజ్ చేసి, జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. సీజ్ చేసిన వాహనాలను హెల్మెట్ చూపిస్తేనే తిరిగి ఇస్తామని తెలిపారు.

చర్చిలకు క్రిస్మస్ శోభ

● ఆకట్టుకుంటున్న స్టార్స్

పటమట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధానమైన సెయింట్‌పాల్ కథెడ్రల్ చర్చి క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైంది. బుధవారం నిర్వహించే క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని సెయింట్‌పాల్ కథెడ్రల్ చర్చి ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బాల ఏసు జననాన్ని స్ఫురించేలా కుటీరం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో బాల ఏసును దర్శించి ప్రార్థనలు చేస్తున్నారు. మంగళవారం చర్చి విచారణకర్తలు మువ్వల ప్రసాద్, బిషప్ రాజారావు దివ్యపూజా బలి సమర్పిస్తారని చర్చి నిర్వాహకులు తెలిపారు.



విద్యుత్ దీపాల వెలుగులతో కాంతులీనుతున్న సెయింట్‌పాల్ కథెడ్రల్ చర్చి

నలంద కళాశాలలో..

లబ్బీపేట : నలంద కళాశాలలో సెమీక్రిస్మస్ వేడుకలు సోమవారం నిరహించారు. గ్రీటింగ్ కార్డు, క్రిస్మస్ ట్రీ అలంకరణ, మెహందీ, కేక్‌మేకింగ్ పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. పశువుల పాకలో బాలఏసును అందంగా తీర్చిదిద్దారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రేమానురాగలతో ఉండాలని, శాంతి సౌభ్రాతృత్వంతో మెలగాలని, తోటివారికి తమ వంతు సాయం అందించాలని ఆమె సూచించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



శాంతి హైస్కూల్‌లో క్రిస్మస్ తాత వేషధారణలో విద్యార్థులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రభుత్వాసుపత్రి : ఆనందాల పండుగ క్రిస్మస్ అని పాస్టర్ బి.కృపాబాబు డేవిడ్ అన్నారు. శాంతి హైస్కూల్లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం ఝాన్సీలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపిస్తున్న నలంద కళాశాల ప్రిన్సిపాల్ అనూరాధ

వీపీ సిద్ధార్థలో..

మొగల్రాజపురం: వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఏసు జన్మదిన వృత్తాంతాన్ని తెలిపేలా విద్యార్థులు నృత్య నాటకాన్ని ప్రదర్శించారు. క్రిస్మస్ తాత వేషదారణలో చిన్నారులు సందడి చేశారు. కరస్పాండెంట్ మేడా సీతారామయ్య, ప్రిన్సిపాల్ జయలక్ష్మి పాల్గొన్నారు.



వీపీ సిద్ధార్థలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజా నాయకుడు వీఎం రంగా

● రంగా విగ్రహ పునఃప్రారంభ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు

పాతరాజరాజేశ్వరి పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగారావు ప్రజా నాయకుడు అని ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. పాయకాపురం-కండ్రిక కూడలి వద్ద నవీకరించిన వీఎం రంగా విగ్రహానికి పునఃప్రారంభ కార్యాక్రమాన్ని సోమవారం విగ్రహ కమిటీ నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బొండా ఉమా విచ్చేశారు. రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజకీయాలకు అతీతంగా నాయకులంతా రంగా ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాలని ఉమా సూచించారు. విగ్రహ కమిటీ గౌరవ సలహాదారులు నవనీతం సాంబశివరావు, మద్దంశెట్టి వీరాంజనేయులు, వత్తే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాల సమస్యపై వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తహసీల్దార్ రోహిణీ దేవి

పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

మొగల్రాజపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత, ఆరోగ్య భద్రత కల్పించి, పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. సోమవారం 8వ డివిజన్‌లోని రెవెన్యూకాలనీ, టిక్కిల్ రోడ్డు, ఫుడ్‌ప్లాజా ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నిచోట్ల చెత్త కుండీల వల్ల దుర్వాసన వస్తోందని స్థానికులు చెప్పడంతో వాటిని అక్కడి నుంచి తరలిం చమని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ధనేకుల రామా రావు, పొట్లూరి విష్ణువర్ధన్, ఏఎంహెచ్‌వో శ్రీనివాసరావు, డీఈ శాంతకుమారి పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో ఇళ్లన్నింటికీ పట్టాలిస్తాం

కొండప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ పట్టాలు ఇస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. సోమవారం సున్నపుబట్టీల సెంటర్ అమ్మ కల్యాణ మండపంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. 2019లో టీడీపీ ప్రభుత్వం ప్రైవేట్ సర్వే చేయించి పట్టాలు సిద్ధం చేసిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వమొచ్చాక కొండ ప్రాంతవాసులు ఇళ్ల పట్టాల సమస్యలను చెబుతున్నారని, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఇళ్ల పట్టాలు ఇచ్చేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. వైసీపీ నాయకుల భూ కబ్జాల వ్యవహారాలను సదస్సు దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. సదస్సుల్లో వీఆర్వోలు, ఆర్ఐలు, తహసీల్దార్లు, సర్వేయర్లు ఉంటారని సమస్యలను అక్కడిక్కడే పరిష్కారం చేస్తారని చెప్పారు. తహసీల్దార్ రోహిణీదేవి, సర్వేయర్ లక్ష్మీదుర్గ, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, నందిపాటి దేవానంద్, పెనుగొండ శ్రీను. రేపాకుల శ్రీను, యాసర్ల వంశీకృష్ణ, పరస సుమన్ పాల్గొన్నారు.



గోనెసంచులను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

రైస్ మిల్లుల తనిఖీ

ఉయ్యూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు, యాకమూరు, గండిగుంట పరిధిలో రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోనెసంచుల నిల్వలు తెలుసుకుని, నాణ్యత పరిశీలించారు. సం చుల అందుబాటు తదితర అంశాలకు సంబంధించి సమస్యలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో హెలా షారోన్, మండల తహసీల్దార్ సురేశ్‌కుమార్ కలెక్టర్‌తో ఉన్నారు.

పతకం సాధించాలి

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం కొట్టాయంలో ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించే 53వ జాతీయస్థాయి పురుషుల హ్యాండ్‌బాల్‌లో పతకం సాధించాలని రాష్ట్ర జట్టుకు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ రాజు సూచించారు. ఈ నెల 16 నుంచి తెనాలిలో డీఎస్ఏ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సీనియర్ పురుషుల జట్టు కోచింగ్ క్యాంపు పూర్తయిన సందర్భంగా జట్టు సభ్యులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. గ్రూప్ ఫొటో దిగారు. గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, కోచ్ ప్రభాకర్ చర్చించారు. పోటీల్లో పాల్గొనే జట్టును ప్రకటించారు.



శిక్షణ ముగించుకున్న హ్యాండ్‌బాల్ రాష్ట్ర జట్టు

సమస్యను సీఎంకు వివరిస్తా

● లయోలా వాకర్స్‌కు ఎంపీ కేశినేని చిన్ని హామీ



లయోలా వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)

భారతీనగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి రెండు, మూడురోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి లయోలా వాకర్స్ సమస్యను తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) హామీ ఇచ్చారు. జీవో ఎంఎస్ 18 ప్రకారం లయోలా కాలేజీలో వాకింగ్‌కు అనుమతి ఇప్పించాలని గూడపాటి లక్ష్మీనారాయణ, గూడపాటి తులసీమోహన్, రావి రమేష్ ఆధ్వర్యంలో లయోలా కాలేజీ వాకర్స్ భారీసంఖ్యలో గురునానక్ కాలనీలోని పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఎంపీ కేశినేని చిన్నిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. 30 ఏళ్లుగా ఎంతోమంది సీనియర్ సిటిజన్స్ లయోలా కళాశాలలో కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా వాకర్స్ అసోసియేషన్‌గా ఏర్పడి వాకింగ్ చేసుకునేవారని, కరోనా రాకముందు వరకు కళాశాల యాజమాన్యం సహకరించిందని, తర్వాత నుంచి వాకింగ్‌కు అనుమతించక పోవడం వల్ల ఈ సమస్య వచ్చిందని అన్నారు. సీనియర్ సిటిజన్స్‌తో పాటు మహిళలు, ప్రజలు వాకింగ్ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కళాశాల యాజమాన్యాన్ని ఆయన కోరారు.



అధికారులు, కోచ్‌లతో సమీక్ష నిర్వహిస్తున్న శాప్ చైర్మన్ అనిమని రవినాయుడు

క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తే ధ్యేయం

● అధికారులు, కోచ్‌లతో శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రీడాంధ్రప్రదేశ్, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా ప్రభుత్వం, శాప్ పనిచేస్తోందని, అం దుకు అనుగుణంగా క్రీడా సంఘాలు, అధికారులు, కోచ్‌లు సమన్వయంతో పనిచేయాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు స్పష్టంచేశారు. ఐజీఎంసీలోని శాప్ కార్యాలయంలో అధికారులు, కోచ్‌లకు క్రీడారంగ అభివృద్ధికి అమలు చేయాల్సిన అంశాలపై సోమవారం ఆయన దిశానిర్దేశం చేశారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ఏపీ క్రీడాకారుల ప్రాతినిధ్యంతో పాటు పతకాల సాధన దిశగా కఠోర శ్రమ, అంకిత భావంతో కలిసి పని చేయాలని ఆయన సూచించారు. జనవరి 25 నుంచి ఉత్తరాఖండ్‌లో నిర్వహించే 38వ జాతీయ క్రీడల్లో క్రీడాకారులకు కల్పించాల్సిన వసతులపైనా ఆయన చర్చించారు. క్రీడాకారుల శిక్షణకు సమర్థులైన కోచ్‌లను డిప్యూటేషన్‌పైన తీసుకురావాలన్నారు. జాతీయక్రీడల్లో భారీగా పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. పీఎం రాష్ట్రీయ బాలపురస్కార్‌కు ఎంపికైన స్కేటర్ జెస్సీరాజ్‌ను రవినాయుడు అభినందించారు.

వైభవంగా అనఘాష్టమి వ్రతం

గన్నవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి శివారులోని గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి పంచతత్వ గురుపాదుకా ఆశ్రమం నందు నిత్య దత్తాత్రేయ రుద్రహోమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. 108 మంది దంపతులతో సామూహిక అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. ప్రతి ఏడాది మార్గశిర మాస కృష్ణపక్ష బహుళ అష్టమి రోజున చేసే ఈ వ్రతం చాలా ప్రసిద్ధిమైనదని అర్చకులు ప్రవీణ్ దత్తా, శ్రీపాద దత్త తెలిపారు. తుమ్మల ఉపేంద్ర ఆర్థిక సహాయంతో నిత్యా అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



రైల్వేమంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న జీఎం అరుణ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు

దక్షిణ మధ్య రైల్వేకు ఆలిండియా

పెర్ఫార్మెన్స్ ఎఫిషియన్సీ అవార్డు

● జీఎంకు అందజేసిన రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి జాతీయ గుర్తింపు లభించింది. ఈ విభాగం ప్రదర్శించిన అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా ఆల్ ఇండియా పెర్ఫార్మెన్స్ ఎఫిషియెన్సీ అవార్డు వరించింది. రైల్వే వారోత్సవాల సందర్భంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ అవార్డు షీల్డ్‌ను దక్షిణమధ్యరైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు అందజేశారు. అలాగే జోన్ పరిధిలోని వివిధ డివిజన్లలో అత్యుత్తమ సేవలందించిన అధికారులు జవ్వాది వెంకట అనూష, వావిలపల్లి రాంబాబు, సుమిత్ శర్మ, ఆంథోనీ దొరైరాజ్, ఆదినారాయణ, కామారపు వినోద్‌లకు అతివిశిష్ట సేవా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్య ప్రకాష్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

ఇతర క్రీడలకు న్యాయం చేయాలి

● సీఎం చంద్రబాబుకు కేపీరావు లేఖ

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతిభ చాటే క్రీడాకారులకు ఒలింపిక్ గేమ్స్‌తో సమానంగా ఒలింపికేతర, సంప్రదాయ క్రీడలకు న్యాయం చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్టు ఏపీవోఏ రాష్ట్ర కార్యదర్శి కేపీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో జీవో 74 ప్రకారం క్రీడా కోటా కింద 1500 ఉద్యోగాలిచ్చారని, క్రీడాకారులకు చెల్లించాల్సిన రూ.12 కోట్ల మేర నగదు ప్రోత్సాహకాలు ఇంకా విడుదల చేయలేదన్నారు. క్రీడాకారులకు టీఏ, డీఏలు నూతన క్రీడాపాలసీలో కల్పించలేదన్నారు. ఆడుదాం-ఆంధ్ర టోర్నీపై సీఐడీ విచారణకు ప్రభుత్వం ఆదేశించినా నిజాలు వెలుగులోకి రాలేదన్నారు. అప్పటి ఎండీగా ఉన్న ధ్యాన్ చంద్ర ఇప్పుడు వీఎంసీ కమిషనర్‌గా ఉన్నారని గుర్తు చేశారు.

ఇవేనా పొదుపు చర్యలు..!

● సొంత వాహనాలకు ఆర్టీసీ డ్రైవర్లను ఉపయోగిస్తున్న అధికారులు
● లైట్ వెయిట్ వాహనాలకు హెవీ వెహికల్ డ్రైవర్లు అవసరమా?
● ఒక పక్క డ్రైవర్ల కొరత.. అద్దె డ్రైవర్లను తెచ్చినా సరిపోని పరిస్థితి!
● సొంత అవసరాలకు దాదాపుగా 400 మంది డ్రైవర్ల వినియోగం
● వీరితో రెండు బస్సు డిపోలను నిర్వహించవచ్చు
● ఆర్టీసీపై అదనపు ఖర్చు.. ప్రయాణికులకు ఎంతో కష్టం

ఒకవైపు డ్రైవర్ల కొరతతో బస్సులు ఆపేస్తున్న పరిస్థితి, మరోవైపు అధికారులు తమ సొంత వాహనాల కోసం ఆర్టీసీ డ్రైవర్లను వాడుకుంటున్న దుస్థితి. ఇది చాలదనట్టు ప్రయాణికులతో నడిపే బస్సులను అద్దె డ్రైవర్లను వినియోగిస్తున్న దౌర్భాగ్యం ఆర్టీసీలో నెలకొంది. ఒకవైపు పొదుపు చర్యలంటూ డ్రైవర్లకు టార్గెట్లు నిర్దేశిస్తూ మరోవైపు ఆర్టీసీ డ్రైవర్ల వినియోగంలో విచ్చలవిడితనం. ఎందుకు..? ప్రాణభయమా.. అధికారులవే ప్రాణాలా..? ప్రయాణికుల ప్రాణాలు నామమాత్రమేనా అంటూ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విజయవాడ నగరం సహా ఉమ్మడి జిల్లాల్లోని అనేక డిపోల్లో ఇదే పరిస్థితి. - ఆంధ్రజ్యోతి, విజయవాడ.



దాదాపు రెండేళ్లుగా ఆర్టీసీని డ్రైవర్ల కొరత పట్టిపీడిస్తోంది. తొలిసారిగా ఆర్టీసీలో రోజువారీ వేతన ప్రాతిపదికన అద్దె డ్రైవర్లను తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా ఇంకా డ్రైవర్ల కొరత పీడిస్తోంది. డ్రైవర్లు లేక సకాలంలో బస్సులను తిప్పలేని పరిస్థితి ఏర్పడితే అధికారులు మాత్రం తమ సొంత వాహనాలకు ఆర్టీసీ డ్రైవర్లను ఎడాపెడా వాడేస్తున్నారు. దాదాపుగా 400 మంది ఆర్టీసీ డ్రైవర్లను ఆర్టీసీ అధికారులు తమ సొంత అవసరాలకు వాడేస్తున్నారు. ఇంత భారీగా ఆర్టీసీ డ్రైవర్లను అధికారులు, ఉన్నతాధికారులు తమ సొంత వాహనాలకు ఉపయోగించడమంటే మామూలు విషయం కాదు. ఈ డ్రైవర్లతో రెండు ఆర్టీసీ బస్సు డిపోలను నిర్వహించవచ్చు. ఆర్టీసీ డ్రైవర్లంటే ఆషామాషీ కాదు. హెవీ వెహికల్ డ్రైవర్లు. ఎంతో సుశిక్షితమైన డ్రైవింగ్ నైపుణ్యాలను కలిగి ఉంటారు. ఇలాంటి వారు బస్సులు నడిపితేనే ప్రయాణికులు సురక్షితంగా ఉంటారు. ఆర్టీసీ సొంత వాహనాలకు లైట్ వెహికల్ డ్రైవర్లు సరిపోతారు. హెడ్డాఫీసు, హెచ్‌వోడీలకైతే ఆర్టీసీ డ్రైవర్లను వినియోగిస్తున్నారంటే అర్థం ఉంటుంది. కానీ జిల్లాస్థాయిలోనూ విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. సీనియర్ స్కేల్ ఆఫీసర్ల (ఎస్ఎస్‌వో)లకు 88 మంది ఆర్టీసీ డ్రైవర్లే వాహనాలను నడుపుతున్నారు. జూనియర్ స్కేల్ ఆఫీసర్లు (జేఎస్‌వో)లకు భారీగా 279 మంది ఆర్టీసీ డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో జీఏడీ వంటి అత్యున్నత శాఖల్లోనే ఉన్నతాధికారుల వాహనాలను సెమీ స్కిల్డ్ డ్రైవర్లే నడుపుతారు. కానీ ఆర్టీసీలో మాత్రం జూనియర్ స్కేల్ అధికారుల వాహనాలను కూడా స్కిల్డ్ డ్రైవర్లే నడుపుతున్నారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో డ్రైవర్లను తీసుకునే వీలున్నా ఆ పని చేయటం లేదు.

దీంతో ఆర్టీసీకి ఎంతో నష్టం కలుగుతోంది. ఆర్టీసీ డ్రైవర్లకు రూ.40 వేలు వేతనం ఇవ్వాల్సి ఉంటుంది. అదే అవుట్‌సోర్సింగ్‌లో తీసుకుంటే రూ.20 వేలే. పైగా దీనివల్ల సంస్థపై భారంతో పాటు, ప్రజలకు తగిన సంఖ్యలో బస్సులను అందుబాటులో ఉంచలేకపోతున్నారు. దీనివల్ల విజయవాడ నగరంలో 100 సిటీ బస్సులను నడపలేని పరిస్థితి. గ్రామీణ ప్రాంతాలకైతే చాలా బస్సులను తగ్గించేశారు. ఉన్న డ్రైవర్లను విజయవాడ నుంచి దూర ప్రాంతాలకు ఉపయోగించుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో సర్దుబాటు కాక ఆలస్యంగా నడిపించాల్సి వస్తోంది. ఒక్కోసారి రద్దు కూడా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీ అధికారులు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అడ్డగోలుగా నియామకాలు

ఆర్టీసీలో హెచ్‌వోడీ స్థాయి అధికారులకు తప్పితే సంస్థ డ్రైవర్లను ఉపయోగించరాదని గతంలో ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబు ఆదేశాలిచ్చారు. కానీ అధికారులు పాటించటం లేదు. జిల్లా స్థాయి అధికారులు కూడా బేఖాతరు చేస్తున్నారు. గతంలో జిల్లాలో రీజనల్ మేనేజర్‌కు మాత్రమే వాహన సదుపాయం ఉండేది. ఇప్పుడు డివిజనల్ మేనేజర్ల స్థాయిలోనూ వాహనాలను ఉపయోగిస్తున్నారు. ఆఖరుకు డిపో మేనేజర్లు కూడా ఉపయోగిస్తున్నారు. సగటున ఒక్కో వాహనానికి ఇద్దరేసి డ్రైవర్లను నియమించుకుంటున్నారు. హెవీ వెహికల్ లైసెన్స్ డ్రైవర్లను బస్సులు నడిపేందుకు ఉపయోగిస్తే ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం ఇవ్వటం సాధ్యమవుతోంది. ఆర్టీసీ అధికారుల కార్లను నడిపితే ఏం ప్రయోజనం ఉంటుందో అధికారులకే తెలియాలి.

సంస్థకు భారంగా అధికారుల నిర్ణయాలు

ఆర్టీసీలో ఇంధన పొదుపు పేరుతో డ్రైవర్లకు టార్గెట్లు పెడతారు. ఒక ఎంఎల్ తగ్గించేందుకు నెత్తిన కత్తి పెడతారు. అలాంటిది ఆర్టీసీకి ఇంత భారీ నష్టాన్ని కలిగించేలా వ్యవహరిస్తున్న అధికారుల తీరు మాత్రం మారదు. మరి అధికారులు చేస్తున్న పొదుపు ఏమిటో చెప్పాలి. చేతిలో అధికారం ఉంది కదాని ఇష్టానుసారం ఆర్టీసీ అధికారులు వ్యవహరించటం సరికాదు. దీనివల్ల సంస్థకు భారం, ప్రయాణికులు కష్టం కలుగుతున్నాయి.

పుస్తకాల పండుగకు ముస్తాబు

● 2న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో పుస్తక మహోత్సవం
● ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ప్రారంభం
● 200 స్టాల్స్‌తో రూపుదిద్దుకోనున్న వేదిక

విజయవాడ కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జనవరి 2 నుంచి పుస్తక పండుగ ప్రారంభం కానుంది. 12 వరకు సాహిత్య, సృజనాత్మకతలకు అంకితమై 36వ పుస్తక మహోత్సవం, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరుగనుంది. ఈ ఏడాది పుస్తక మహోత్సవాలు పుస్తకప్రియులకు కొత్తదనాన్ని అందించనుంది. సుమారు 200 స్టాల్స్‌తో అందంగా ముస్తాబైంది. బుక్‌స్టాల్స్‌లో ప్రముఖ పబ్లిషర్స్ తమ పుస్తకాలను ప్రదర్శించనున్నారు. పుస్తకాల ప్రేమికులు తప్పక హాజరుకావాలని ఉత్సవ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు పుస్తక మహోత్సవానికి సంబంధించిన వివరాలను తెలియజేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు మనోహరనాయుడు, కార్యదర్శి లక్ష్మయ్య, బాబ్జీ, గోళ్ల నారాయణరావు తదితరులు

ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి

జనవరి 2న సాయంత్రం 5 గంటలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ మహోత్సవాన్ని ప్రారంభిస్తారు. సాహిత్య అకాడమీ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా హాజరుకానున్నారు. ఈ సందర్భంలో పీవీ నర్సింహారావు జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ జరగనుంది. సాయంత్రం 7 గంటలకు చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభ జరుగనుంది. ఈనాడు ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు హాజరుకానున్నారు.

మహోత్సవ ముఖ్య వేదికలు

పిడికిటి రామ కోటేశ్వరరావు ప్రాంగణాన్ని మహోత్సవానికి కేంద్రస్థానంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే చెరుకూరి రామోజీరావు సాహిత్య వేదిక ఏర్పాటు చేయనున్నారు. సాహిత్య ప్రధాన కార్యక్రమాలకు ఇది వేదిక కానుంది. మరోవైపు రతన్ టాటా ప్రతిభా వేదికను విద్యార్థుల కోసం రూపొందిస్తున్నారు. దీనిపై సృజనాత్మకతను ప్రోత్సహించే కార్యక్రమాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 3న సాయంత్రం 6 గంటలకు దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు శత జయంతి సభ, సాయంత్రం 7 గంటలకు జాతీయ కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా ప్రముఖ కవులు పాల్గొంటారు. జనవరి 4న ఆరుద్ర శత జయంతి సభలో ప్రముఖ సాహితీవేత్తలు పాల్గొంటారు. జనవరి 5న జరిగే భానుమతి శత జయంతి సభకు ముఖ్య అతిథిగా రెంటాల జయదేవ పాల్గొంటారు. జనవరి 6న పుస్తక ప్రియుల పాదయాత్ర సిద్ధార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవం వరకు చేయనున్నారు. ఈ పాదయాత్రలో ప్రతి ఒక్క పుస్తక ప్రియుడు పాల్గొనాలన్నారు. కార్యక్రమాన్ని ఐఏఎస్ అధికారి కె.విజయానంద్ ప్రారంభించనున్నారు. జనవరి 7, 8న నాజర్, ఆలూరి బైరాగి, ఎన్.నటరాజన్ శతజయంతి సభలు జరగనున్నాయి. జనవరి 9న గ్రంథాలయ పునర్వికాసంపై సదస్సు జరగనుంది. మండలి బుద్ధప్రసాద్, మన్నెం రాయుడు, వల్లూరి శివప్రసాద్, దేవినేని మధుసూదనరావు హాజరుకానున్నారు.

విద్యార్థుల కార్యక్రమాలు

రతన్‌టాటా ప్రతిభా వేదిక ఆధ్వర్యంలో ప్రతిరోజు విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వక్తృత్వ పోటీలు (తెలుగు, ఇంగ్లీషు), డ్రాయింగ్, ఒరిగామి, కథ రచన, మిమిక్రీ పోటీలు, క్విజ్, శాస్త్రజ్ఞుల జీవిత చరిత్రలపై ఉపన్యాసాలు, సైన్స్ అండ్ ఫన్ మాథ్స్, మేజిక్ లాజిక్ వంటి అనేక వినోదాత్మక, విద్యాసంబంధిత అంశాలు జరుగుతాయి.

పుస్తక ప్రియులకు ప్రత్యేకం

సాయంత్రం 4-5 గంటల వరకు ప్రతి రోజు 'నన్ను ప్రభావితం చేసిన పుస్తకం' అనే అంశంపై ఓపెన్ డయాస్ ఉంటుందని, ఎవరైనా ముందుగా పేర్లు నమోదు చేసుకొని మాట్లాడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మనోహర్ నాయుడు, కార్యదర్శి లక్ష్మయ్య, బాబ్జీ, గోళ్ల నారాయణరావు, ఎమ్మెస్కో లక్ష్మి, జేవీ ప్రసాద్ పాల్గొన్నారు.



లోకేష్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డాక్టర్ అరుణకుమారి

బ్రెయిన్ బీ క్విజ్ పోటీల విజేతగా లోకేష్‌రెడ్డి

గుంటూరు మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు నిర్వహించిన బ్రెయిన్ బీ క్విజ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఇండియన్ నేషనల్ బ్రెయిన్ బీ సంస్థ సహకారంతో ఆదివారం జరిగిన ఈ క్విజ్ పోటీల్లో గుంటూరు, విజయవాడకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మొదట రాత పరీక్ష ద్వారా, అనంతరం మూడు రౌండ్ల ఓరల్ క్విజ్ పోటీల ద్వారా విజేతలకు ఎంపిక చేశారు. న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణకుమారి ఆధ్వర్యంలో మెదడు జబ్బులైన ఆల్జీమర్స్, ఆస్టిమ్, పక్షవాతంతో పాటు ముసలితనం, నిద్ర, కదలికలు, జ్ఞాపకాలు, భావోద్వేగాలు వంటి పలు అంశాలకు సంబంధించిన ప్రశ్నలు సంధించి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. గుంటూరు భాష్యం జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థి కే లోకేష్ రెడ్డి విన్నర్‌గా నిలిచాడు. ఫస్ట్ రన్నర్‌గా జీ డింపుల్ (సిద్ధార్థ మహిళా జూనియర్ కాలేజీ, విజయవాడ). సెకండ్ రన్నర్‌గా కే సాహితి (కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్, గుంటూరు) నిలిచారు. డాక్టర్ అరుణకుమారి విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఇండియన్ నేషనల్ బ్రెయిన్ బీ కోఆర్డినేటర్ రవీంద్రనాధ్ మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులను సైన్స్ పట్ల ప్రోత్సహించేందుకు ఏటా ఈ క్విజ్ పోటీలు గుంటూరు జీజీహెచ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు రాష్టస్థాయిలో జరిగే బ్రెయిన్‌బీ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.

వైసీపీకి భారీ షాక్

● పార్టీని వీడిన పలువురు కీలక నేతలు

జి.కొండూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జి.కొండూరు మండలంలో వైసీపీకి మరో భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ కీలక నేతలు సోమవారం రాజీనామా చేశారు. హెచ్.ముత్యాలంపాడు గ్రామానికి చెందిన కాజ సంధ్యారాణి, మాజీ జడ్పీటీసీ కాజ బ్రహ్మయ్య, సున్నంపాడు సర్పంచ్ దేశం సుధాకర్ రెడ్డి, ముగనపాడు సర్పంచ్ పగడాల వెంకటేశ్వరరావు, చెర్వుమాధవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చుండూరు విష్ణువర్ధనరావు, కందులపాడు ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ గార్లపాటి రమాదేవి, ఆమె భర్త గార్లపాటి వెంకట్రావ్, కవులూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొట్టుముక్కల ఓంకార బాబు, సీనియర్ నేత ఈలప్రోలు వెంకటేశ్వరరావు, జి.కొండూరుకు చెందిన మైలవరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ బేతపూడి నిర్మల, బేతపూడి ఏసు తదితరులు వైసీపీ పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. దీంతో ఒకప్పుడు వైసీపీకి కంచుకోటగా ఉన్న జి.కొండూరు మండలంలో వైసీపీ దాదాపు కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఆయా గ్రామాల్లో ఎంతో కీలకంగా ఉన్న కాజ బ్రహ్మయ్య, దేశం సుధాకర్ రెడ్డి, జి.ఓంకారబాబు, చుండూరు విష్ణువర్ధనరావు వైసీపీని వీడటం పార్టీకి తీరని నష్టం చేకూర్చే అవకాశం ఉంది. ఇటీవల వైసీపీలో జరుగుతున్న ఒంటెత్తు పోకడలు, కావాలనే కొందర్ని టార్గెట్‌గా చేసుకొని ముఖ్య నేతలు వ్యవహరిస్తున్న తీరుతో విసిగిపోయిన నేతలు పార్టీ వీడారు. వీరు ఏ పార్టీలో చేరేది త్వరలో తెలుస్తుంది.

27న ఐజీఎంసీలో రాష్ట్ర వాలీబాల్ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 27న ఉదయం 7 గంటలకు రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల, పురుషుల వాలీబాల్ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. శాప్ వీసీఎండీ ఆదేశాల మేరకు ఈ ఎంపికలను వాలీబాల్ కోర్టులో చేపడుతున్నామని, ఎంపికైన వారిని రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జనవరి 7 నుంచి 13 వరకు జరిగే సీనియర్ జాతీయ వాలీబాల్ క్రీడా పోటీలకు పంపుతామన్నారు. ఆధార్, నేటివిటీ సర్టిఫికెట్, 10 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఆ రోజు హాజరు కావాలని అజీజ్ తెలిపారు.

అఖిల భారత వర్సిటీ అథ్లెటిక్స్ ఎన్టీఆర్ అథ్లెట్లు

భువనేశ్వర్‌లోని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో ఈ నెల 26 నుంచి 30 వరకు జరిగే ఆలిండియా ఇంటర్ వర్సిటీ పురుషుల, మహిళల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ జట్లను ఎంపిక చేసినట్టు వర్సిటీ స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ ఈ త్రిమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన టీమ్‌ను వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ డీవీఎస్ఎల్ నర్శింహం, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి అభినందించారు.

ఎంపికైన అథ్లెట్లు వీరే...

పురుషులు: టీ కిరణ్‌కుమార్, డీ చరణ్ నాయక్, ఏఎస్ శ్రీనివాస్, పీహెచ్ విష్ణు వర్ధన్, ఎం వెంకట రమణ, సీహెచ్ నియాజ్, ఆర్ రాకేష్‌కుమార్

మహిళలు: పీ ప్రమీల, ఎం ధనలక్ష్మి, కాజల్ సింగ్, టీ శ్రీ హర్ష, టీ గ్రేష్మ

రేషన్ డీలర్ల సంక్షేమనిధి

ఏర్పాటుకు సహకరించండి

● మంత్రి నాదెండ్ల మనోహర్‌కు రాష్ట్ర రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక



మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వేదిక నేతలు

మొగల్రాజపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న 29,786 మంది డీలర్లకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయడానికి సహకరించాలని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌కు రాష్ట్ర రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక అధ్యక్షుడు ఎం.శేషగిరిరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం విజయవాడలోని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో సంక్షేమ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా గతంలో వలే కార్డుదారులకు ఇబ్బంది లేకుండా రేషన్ డిపోల ద్వారా సరకులు పంపిణీ చేయడానికి, పంపిణీ పూర్తయిన తరువాత ఎండీయూ ఆపరేటర్లు డీలర్లకు పూర్తిగా నగదు చెల్లించకుండా బకాయిలు పెడుతున్నారని అందువల్ల తదుపరి నెలలో సరుకులకు డీలర్లు డీడీలు కట్టడం ఇబ్బంది మారిందని, ఆథరైజేషన్ రెన్యూవల్స్ సచివాలయంలో ఆగిపోయాయని వాటిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కేరళ ప్రభుత్వం ప్రభుత్వంపై భారం పడకుండా డీలర్ల భాగస్వామ్యంతో సంక్షేమ నిధి ఏర్పాటు చేసిందని ఆ విధానం మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని కోరారు.

మంత్రి సానుకూలంగా స్పందించారు. వేదిక ప్రధాన కార్యదర్శి టి.రవిచంద్రారెడ్డి, కోశాధికారి బంగార్రాజు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎం.ఇందిరా, కోశాధికారి పి.రాజేశ్వరి, రాష్ట్ర నేతలు, ఏ ఉదయేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, యు.వెంకటేశ్వరరావు, శివప్రసాద్, ప్రకాశరావు, పృథ్వీ పాల్గొన్నారు.

వైభవంగా పైడమ్మ తెప్పోత్సవం

పెడన, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పైడమ్మ తల్లి జాతర ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారు మూడు సార్లు చెరువులో జలవిహారం చేశారు. పెమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆలయ ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు, ఉత్సవ కమిటీ సభ్యులు బొడ్డు ఆనందరావు, పత్తిపాటి జయకృష్ణ, కోమట్ల సాంబశివరావు, మల్లంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పైడమ్మతల్లిని సోమవారం మునిసిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, ఆమె భర్త, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఈవో టివివి మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు.

నా కుమారుడు మృతిపై విచారణ జరిపించండి

● బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోండి
● తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోండి
● బాధితురాలు వడ్డి నాగలక్ష్మి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మపురం మునిసిపల్ పార్కు వద్ద గేటు విరిగి ఆడుకుంటున్న తన కుమారుడి ప్రాణం తీసిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించి ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని వడ్డి నాగలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద



కన్నీరు మున్నీరై మీడియాతో నాగలక్ష్మి మాట్లాడారు. తన ఏడేళ్ళ కుమారుడు దినేష్‌కుమార్ మునిసిపల్ పార్కు వద్ద ఆడుకుంటుండగా గేటు విరిగి మీదపడిందని, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళిన వెంటనే మృతి చెందాడని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని చాలా కాలంగా అడుగుతున్నామని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తన భర్త లక్ష్మీకాంత్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, పేద కుటుంబానికి చెందిన తమను అధికారులు ఆదుకోవాలని నాగలక్ష్మి డిమాండ్ చేశారు.

దినేష్‌కుమార్ జవహర్ పబ్లిక్ స్కూల్‌లో ఎల్‌కేజి చదువుతున్నాడన్నారు. నా పెద్దకుమారుడు విశాంత్ తమ్ముడిని కోల్పోయి దిగాలుపడ్డాడన్నారు. మానవతా దృక్పథంతో తన కుటుంబాన్ని ఆదుకోవాలని వలందపాలెంకు చెందిన నాగలక్ష్మి కోరారు.

విశ్రాంత అధ్యాపకుల సంఘం

నూతన అధ్యక్షుడిగా కృష్ణారావు



మొగల్రాజపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళాశాల విశ్రాంత అధ్యాపకుల సంఘం ఎన్నికలు మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగాయి. రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్‌గా జె.గంగాధర్‌రావు (చీరాల), కార్యదర్శిగా జీఆర్‌కే రెడ్డి (విజయవాడ) అసోసియేట్ కార్యదర్శిగా వీవీ రమణ (విజయవాడ), ఫైనాన్స్ కార్యదర్శిగా ఆర్‌ఎల్ నరసయ్య (కర్నూలు), సలహాదారులుగా ఆర్.వెంకటేశ్వరరెడ్డి, పీవీ లక్ష్మిపతి, లీగల్ సెల్ కన్వీనర్‌గా పీవీ రమణా రెడ్డి, వానప్రస్థ పత్రిక ఎడిటర్‌గా వీ.ఈశ్వరప్రసాద్ ఎన్నికయ్యారని కొత్తగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్‌వీ కృష్ణారావు తెలిపారు.



ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు అందుకుంటున్న స్ఫూర్తి శ్రీనివాస్

స్ఫూర్తి శ్రీనివాస్‌కు ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు

కృష్ణలంక, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'పిచ్చుకను చేసుకొందామా మచ్చిక' అనే నినాదంతో జాతీయ స్థాయిలో చేసిన సేవ్ స్పారో ఉద్యమానికి, 30 ఏళ్లుగా చిత్రకళోపాధ్యాయుడిగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా స్ఫూర్తి శ్రీనివాస్‌కు తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు-2024 బహూకరించారు. జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్, శ్రీ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ అవార్డు ప్రదానం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగింది. జాతీయ అవార్డు గ్రహీతగా, ప్రకృతి ప్రేమికుడిగా తన బాధ్యతను పెంచిందని శ్రీనివాస్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

తిరువూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చీరాల సెంటర్‌లో కూల్చివేసిన గ్రామచావిడి స్థలం వద్ద రెవెన్యూ అధికారులు సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిలో ఆర్ఎస్‌నెం, 154/2లో 4 సెంట్ల స్థలంలో బ్రిటీష వారు గ్రామచావిడి (రెవెన్యూ సిబ్బంది కార్యాలయం)ని నిర్మించారు. ఈ కార్యాలయం ద్వారా ప్రజలకు దీర్ఘకాలం సేవలందాయి. ఈనెల 21న కొందరు ప్రైవేటు వ్యక్తులు పగలే భవనం కూల్చివేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. భవనం కూల్చివేసిన విషయం ప్రతికల్లో రావడంతో, హడావిడిగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చావిడిని కూల్చివేసిన స్థలంలో ఇది ప్రభుత్వ స్థలం అని, ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఒక ఫ్లెక్సీ ఏర్పాటుచేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు పట్టణంలో వినిపిస్తున్నాయి.

చిత్రజ్యోతి

SINCE 1965

విజయవాడ ● మంగళవారం 24 డిసెంబరు 2024

అధికంగా టిక్కెట్లు అమ్ముడైన సినిమాలు

ఈ ఏడాదిలో విడుదలైన చాలా చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. కల్కి 2898, పుష్ప-2, దేవర, భూల్ భులయ్యా-3 వంటి చిత్రాలు బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లను రాబట్టాయి. బుక్ మై షోలో అత్యధిక టిక్కెట్లు అమ్ముడైన చిత్రంగా పుష్ప-2 రికార్డు సృష్టించింది. ఈ నేపథ్యంలో 2024లో విడుదల రోజున అత్యధిక సంఖ్యలో టిక్కెట్లు అమ్మిన చిత్రాలేమిటో చూద్దాం...!





పుష్ప-2: అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. వరల్డ్ వైడ్‌గా డిసెంబరు 5న విడుదలై భారీ కలెక్షన్లతో రికార్డును బ్రేక్ చేస్తోంది. విడుదల రోజున ఒక్క గంటలో సుమారుగా లక్షకు పైగా టిక్కెట్లు అమ్ముడవడం విశేషం.



కల్కి 2898: ప్రభాస్ నటించిన ఈ చిత్రం జూన్ 27న విడుదలైంది. తొలి రోజు గంటకు 96 వేలకు పైగా టిక్కెట్లు సేల్ అయ్యాయి.



దేవర: జూనియర్ ఎన్టీఆర్, జాన్వీకపూర్ జంటగా నటించిన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబరు 27న విడుదలైంది. మొదటి రోజు సుమారు 15 లక్షలకు పైగా టిక్కెట్లను విక్రయించారు.



స్త్రీ-2: ఆగస్టు 15న విడుదలైన ఈ హిందీ సినిమా మొదటి రోజు సుమారు లక్షా ఇరవై నాలుగు వేలకు పైగా టిక్కెట్లు అమ్ముడు పోయాయి.



భూల్‌భులయ్యా-3: ఈ హిందీ చిత్రం నవంబరు 1న విడుదలైంది. కార్తీక్ ఆర్యన్, విద్యా బాలన్, మాధురి దీక్షిత్ ప్రధాన తారాగణం. చిత్రం ఓపెనింగ్ రోజు 2,29,558 టిక్కెట్లు అమ్మారు. బాక్సాఫీ వద్ద అత్యధిక వసూళ్లు చేసిన రెండో హిందీ చిత్రం, ఐదో భారతీయ సినిమాగా నిలిచింది.



అమరన్: శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన ఈ చిత్రం అక్టోబరు 31న విడుదలైంది. చిత్రం విడుదల రోజున తొలి నాలుగు గంటల్లో 1,36, 890 టిక్కెట్లు విక్రయించారు.



ఫైటర్: హృతిక్ రోషన్, దీపికా పదుకొనే జంటగా నటించిన ఈ హిందీ చిత్రం జనవరి 25 విడులైంది. తొలి రోజు 2,79,00 టిక్కెట్లు విక్రయించారు.



హనుమాన్: తేజ సజ్జా, అమృత అయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కింది. జనవరి 12న విడుదల కాగా తొలిరోజున 3,36,000 టిక్కెట్లు అమ్మారు.



ద గోట్: విజయ్ నటించిన ఈ సినిమా సెప్టెంబరు 5న విడుదలైంది. తొలి రోజు ఒక్క తమిళనాడులోనే ఆరు లక్షలకు పైగా టిక్కెట్లు విక్రయించారు.



ద సింగమ్ ఎగైన్: అజయ్ దేవ్‌గన్, రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొనే ప్రధాన తారాగణంగా నటించిన ఈ మూవీ నవంబరు 1న విడుదలైంది. 2,26,000 టిక్కెట్లు విక్రయించారు.



అమెరికాలో 'గేమ్‌ఛేంజర్' ప్రీరిలీజ్ ఈవెంట్ పూర్తి చేసుకున్న రామ్‌చరణ్, డైరెక్టర్ సానా బుచ్చిబాబు దుబాయ్ వెళ్లారు. 'వార్ 2' సుదీర్ఘ షెడ్యూల్‌ను ముగించుకున్న ఎన్టీఆర్ కూడా దుబాయ్ చేరుకున్నారు. వీరు ముగ్గురు అక్కడ కలుసుకున్న ఫొటోను సంగీత దర్శకుడు తమన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఇది వైరల్ అవుతోంది.

సరికొత్త బాలకృష్ణను చూస్తారు



బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో నటించిన చిత్రం 'డాకూ మహారాజ్'. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు బాబీ కొల్లి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ "ఈ సినిమా పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్న ఈ చిత్రం అద్భుతంగా వచ్చింది. బాలకృష్ణ నుంచి అభిమానులు కోరుకునే అన్ని అంశాలు ఇందులో ఉంటాయి. విజువల్‌గా ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తుంది. యాక్షన్ సన్నివేశాలు ఊహించిన దాని కంటే గొప్పగా ఉంటాయి. దాదాపు వందకు పైగా సినిమాల్లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించిన బాలకృష్ణను 'డాకూ మహారాజ్' సరికొత్తగా చూపిస్తుంది" అని చెప్పారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ "ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. బాలకృష్ణ కెరీర్‌లోనే ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. సినిమా ఫస్ట్ హాఫ్ చూశాను. గూస్ బంప్స్ వచ్చాయి. కచ్చితంగా ప్రేక్షకులంతా గొప్ప సినిమాను చూసిన అనుభూతి పొందుతారు. భావోద్వేగాలు, వినోదం, యాక్షన్ అన్నీ అదిరిపోయే రేంజ్‌లో ఉన్న సినిమా ఇది. తమన్ నెక్స్ట్ లెవల్ సంగీతం ఇచ్చారు. 30 ఏళ్లుగా బాలకృష్ణను ఎవరూ చూపని విధంగా ఇందులో వింటేజ్ లుక్‌లో చూపిస్తున్నాం. నిర్మాతగా నా కెరీర్ మొదలుపెట్టినప్పటి నుంచి బాలకృష్ణతో సినిమా చేయాలని ప్రయత్నిస్తూనే ఉన్నా. ఇప్పటికి అది కుదిరింది. జనవరి 2న హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల చేస్తాం. జనవరి 8న యూఎస్‌లో ప్రీ రిలీజ్ వేడుక చేసి ఓ సాంగ్ విడుదల చేస్తాం. అలాగే, జనవరి 8న ఆంధ్రప్రదేశ్‌లో ప్రీ రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం" అని అన్నారు.

సంక్రాంతి స్పెషల్



వెంకటేశ్, మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్ నటిస్తున్న ట్రయాంగులర్ క్రైమ్ కామెడీ 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన రెండు పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ సినిమాలో మూడో పాటను రామోజీ ఫిల్మ్ సిటీలో వెంకటేశ్, మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్‌లపై చిత్రీకరిస్తున్నారు. ఈ పాట సంక్రాంతి స్పెషల్‌గా.. సినిమాకే హైలైట్‌గా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ పాటకు భానుమాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. ఒక మాజీ పోలీసు.. మాజీ ప్రేయసి.. అద్భుతమైన భార్య మధ్య జరిగే అందమైన ప్రయాణంగా రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 14న చిత్రం విడుదల కానుంది. కాగా, వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో ఇది వరకు వచ్చిన 'ఎఫ్ 2'.. 'ఎఫ్ 3' చిత్రాలు మంచి విజయం సాధించాయి.

తెలంగాణ ఆత్మను వెండితెరపై ఆవిష్కరించిన దర్శకుడు



'నాకు ఇప్పుడు 90 ఏళ్లు వచ్చాయి. ఆరోగ్యంగానే ఉన్నా. ప్రస్తుతం రెండు మూడు ప్రాజెక్టులకు వర్క్ చేస్తున్నా. శరీరం, మనసు సహకరించినంత కాలం సినిమాలు తీయాలన్నది నా కోరిక' అని కొద్ది రోజుల క్రితమే తన పుట్టినరోజు (డిసెంబర్ 14) సందర్భంగా తనని కలసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడిన శ్యామ్ బెనెగల్ ఇక లేరు. తెలంగాణ ఆత్మను వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించిన దర్శకుడు ఆయన. రెగ్యులర్ కమర్షియల్ చిత్రాల జోలికి పోకుండా సామాజిక సమస్యలు, ఆర్థిక అసమానతలను చర్చిస్తూ శ్యామ్ తీసిన చిత్రాలు ఓ వర్గం ప్రేక్షకులను విపరీతంగా ఆకర్షించాయి. ఆయన రూపొందించిన 'అంకుర్', 'నిషాంత్', 'సుస్మన్', 'మండి', 'వెల్ డన్ అబ్బా' చిత్రాల నేపథ్యం తెలంగాణ కావడం విశేషం. పేరున్న నటీనటుల జోలికి పోకుండా కొత్త తారలకు అవకాశాలు ఇస్తూ సినిమాలు రూపొందించారు శ్యామ్ బెనగల్. స్మితా పాటిల్, షబానా అజ్మీ, నసీరుద్దీన్ షా, ఓం పురి వంటి తారలు శ్యామ్ బెనగల్ చిత్రాలతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. అవార్డులు పొందారు.

పన్నెండేళ్ల వయసులోనే ..

శ్యామ్ పూర్తి పేరు బెనగళ్ల శ్యామసుందర్‌రావు. ఆయన తండ్రి శ్రీధర్ బెనగల్ కర్నాటకకు చెందిన వారు. కొంకణి మాట్లాడే చిత్రాపూర్ సారస్వత బ్రాహణ కుటుంబం వారిది. చిన్నతనం నుంచి శ్యామ్‌కు సినిమాల మీద ఆసక్తి. అది గమనించి ఆయన తండ్రి ఓ కెమెరా కొనిచ్చారు. ఆ కెమెరాతోనే పన్నెండేళ్ల వయసులో ఓ లఘు చిత్రం తీశారు. సికింద్రాబాద్ తిరుమలగిరిలో ఒక స్టూడియో కూడా ఉంది. ఓల్డ్ అల్వాల్‌లో ఉన్న ఇంట్లో కొన్ని రోజులు గడిపారు శ్యామ్. ప్రస్తుతం ఆ ఇల్లు శిధిలావస్థలో ఉంది. శ్యామ్ సోదరుడి కుమారుడు శ్రీధర్ ఇప్పుడు ఆల్వాల్‌లోనే ఉంటున్నారు. శ్యామ్ బెనెగల్ అల్వాల్ నుంచి రోజూ సైకిల్ మీద బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలకు వెళ్లేవారు. అలా సైకిల్ తొక్కడంలో అనుభవాన్ని సంపాదించిన ఆయన సైకిల్ పోటీల్లోనూ ఛాంపియన్‌గా నిలిచారు.

కాపీ రైటర్‌గా కెరీర్ ప్రారంభించి..

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్ డిగ్రీ పొందిన శ్యామ్ బెనగల్ మొదట ముంబైలోని ఓ యాడ్ ఏజెన్సీలో కాపీ రైటర్‌గా పని చేశారు. ఆ తర్వాత క్రియేటివ్ హెడ్‌గా మారారు. 1962లో తొలిసారిగా ఆయన గుజరాతీలో 'ఘేర్ బేతాగంగ' పేరుతో డాక్యుమెంటరీ తీశారు. ఇక అక్కడి నుంచి సినిమాకు దర్శకత్వం వహించడానికి ఆయనకు దశాబ్ద కాలం పట్టింది. ఆ సినిమా 'అంకుర్'. ఈ సినిమాతోనే షబానా అజ్మీ, అనంత్ నాగ్ పరిచయమయ్యారు. తెలంగాణలో ఆర్థిక అసమానతలు, లైంగిక వేధింపుల గురించి శ్యామ్ తీసిన చిత్రమిది. ఈ చిత్రం షూటింగ్ చాలా వరకూ ఆల్వాల్, మచ్చ బొల్లారం, తిరుమలగిరి ప్రాంతాల్లో జరగడం విశేషం. జాతీయ ద్వితీయ ఉత్తమ చిత్రంగా 'అంకుర్' అవార్డ్ పొందింది. ఇందులో నటించిన షబానా అజ్మీ జాతీయ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు.

పారలల్ సినిమాకు ఆద్యుడు

'అంకుర్' చిత్ర విజయం అందించిన ప్రోత్సాహంతో 1970-80ల దశకంలో పారలల్ సినిమాకు ఊపిరి పోశారు శ్యామ్. ఆ తర్వాత నిషాంత్ (1975), మంథన్ (1976), భూమిక(1977) వంటి చిత్రాలను రూపొందించారు. వీటిల్లో 'మంథన్' చిత్రం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. గుజరాత్‌లోని పాడి పరిశ్రమ అభివృద్ధి గురించి తీసిన సినిమా ఇది. ఈ చిత్రకథ విన్న ఐదు లక్షల మంది గుజరాత్ రైతులు తలో రెండు రూపాయలు పెట్టుబడి పెట్టి ఈ చిత్ర నిర్మాతలుగా మారడం విశేషం.శ్యామ్ రూపొందించిన 'భూమిక' చిత్రంతో స్మితా పాటిల్ ఉత్తమ నటిగా తొలిసారి జాతీయ అవార్డ్ పొందారు.

సుభాష్‌చంద్రబోస్ పై సినిమా

శ్యామ్ బెనగల్ 2004లో భారత స్వాతంత్ర్య యోధుడు సుభాష్ చంద్ర బోస్ గురించి 'నేతాజీ సుభాష్‌చంద్రబోస్.. ద ఫర్‌గాటెన్ హీరో' పేరుతో తీసిన చిత్రం ప్రశంసలు పొందింది. అలాగే బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహమాన్ జీవిత కథను కూడా సినిమాగా రూపొందించారు. ఇదే ఆయన చివరి చిత్రం.

తీరని లోటు : సీఎం రేవంత్ రెడ్డి

చలన చిత్రం రంగంలో కొత్త ఒరవడిని సృష్టించిన శ్యామ్ బెనెగల్ మరణం సినీ ప్రపంచానికి తీరని లోటు అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. భారతీయ వాస్తవిక సినిమా విశ్వరూపాన్ని ప్రదర్శించిన దర్శకుడు, మట్టి మనుషుల జీవితకథలను వెండితెరపై దృశ్యమానం చేసిన దిగ్గజ దర్శకుడు శ్యామ్ బెనెగల్ అని తెలంగాణ సినిమాటోగ్రాఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆయన మరణం పట్ల మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్యామ్ బెనెగల్ సినిమాలు సామాజిక సమస్యలను, మానవ సంబంధాల లోతును, మట్టిమనుషుల జీవిత కథలను కళ్లకు కట్టినట్టు చూపిస్తాయని ఆయన ప్రశంసించారు.

తెలుగులో ఒకే ఒక్క చిత్రం



శ్యామ్ బెనెగల్ తెలుగు వాడైనా తెలుగులో ఒకే ఒక్క చిత్రం తీయడం గమనార్హం. ఆ సినిమా 'అనుగ్రహం'(1978). ఆ నాటి అగ్ర కథానాయిక వాణిశ్రీ పారలల్ సినిమాలో తను కూడా నటించాలనే తపనతో మేకప్ లేకుండా ఈ చిత్రంలో నటించారు. తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందించారు శ్యామ్ బెనెగల్. మరాఠీలో వచ్చిన 'కొండోరా' నవల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో అనంత్ నాగ్, రావుగోపాల రావు, స్మితా పాటిల్ తదితరులు నటించారు. ఈ చిత్రం షూటింగ్ లో ఒక తమాషా సంఘటన జరిగింది. వాణిశ్రీకి కొన్ని హిందీ డైలాగులు ఇచ్చి, నేను చెప్పినట్లు హిందీలో వీటిని చెబితే నీకు రూ. ఐదు కోట్లు ఇస్తానని దర్శకుడు శ్యామ్ బెనెగల్ వాణిశ్రీ కి సవాల్ విసిరారు. దాన్ని స్వీకరించి ఐదే ఐదు నిముషాల్లో ఆ డైలాగులను హిందీ లో శ్యామ్ బెనెగల్ చెప్పినట్లే చెప్పారు వాణిశ్రీ. శ్యామ్ బెనెగల్ షాక్ అయ్యారు. వాణిశ్రీ గర్వంగా ఆయన వంక చూసి డబ్బు ఇవ్వండి అన్నట్లు చేతులు చాపారు. శ్యామ్ తన జేబులో చెయ్యి పెట్టారు. యూనిట్ లో అందరూ ఆయన వంకే చూస్తున్నారు. క్షణం లో జేబు లోంచి ఐదు పైసల నాణెం తీసి వాణిశ్రీ చేతిలో పెట్టి ఇదే ఐదు కోట్లు అనుకో..అని నవ్వేశారు శ్యామ్.

ఇన్ ప్రోగ్రెస్

ఇలాంటి చిత్రాలు అరుదుగా వస్తుంటాయి



వీర్ రెడ్డి, దయానంద్ రెడ్డి, ఢిల్లీ గణేశ్, గిరిధర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లీగల్లీ వీర్'. రవి గోగుల దర్శకత్వంలో శాంతమ్మ మలికిరెడ్డి నిర్మించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో హీరో వీర్ రెడ్డి మాట్లాడుతూ "తెలుగులో లీగల్ థ్రిల్లర్‌లు తక్కువగా వస్తుంటాయి. రియల్ కోర్టు డ్రామా ఎలా ఉంటుందో ఈ సినిమాలో అద్భుతంగా చూపించాం" అని చెప్పారు. దర్శకుడు రవి మాట్లాడుతూ "ఇలాంటి సబ్జెక్ట్‌తో తెరకెక్కిన చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. తప్పకుండా సినిమా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు.

యూత్‌ను ఆకట్టుకుంటుంది



ధర్శ, ఐశ్వర్య శర్మ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు లహరిధర్, బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా నిర్మాత లహరిధర్ మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా కథను దర్శకుడు కిరణ్ చెప్పగానే చాలా నచ్చేసింది. నాన్న శ్రీనివాస్ ఈ సినిమా కథను చిరంజీవికి చెప్పి ఆయన అభిప్రాయం అడిగారు. ఆయన, ఓకే.. ప్రొసీడ్ అన్నారు. అలా చిరంజీవి ప్రోత్సాహంతో ఈ సినిమా ప్రారంభమైంది. ఈ సినిమాను ఎక్కడా రాజీ పడకుండా నిర్మించాం. ధర్శ, ఐశ్వర్య అద్భుతంగా నటించారు. సినిమాలో వారు చేసిన ప్రదర్శన అందరికీ గుర్తుండిపోతుంది. ఈ సినిమాకు మ్యూజిక్, క్లైమాక్స్ ప్రధానాకర్షణ. యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

వాయిస్, ఎస్ఎంఎస్‌లకే
రీచార్జ్ వోచర్లు : ట్రాయ్

న్యూఢిల్లీ: టెలికాం ఆపరేటర్ల టారిఫ్ వోచర్ల నిబంధనలనూ టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ సవరించింది. కంపెనీలు ఇక డేటా అవసరం లేని చందాదారులకు వాయిస్, ఎస్ఎంఎస్‌లకు ప్రత్యేక రీచార్జ్ వోచర్లు జారీ చేయాలని స్పష్టం చేసింది. స్పెషల్ రీచార్జ్ కూపన్ల గడువును కూడా ప్రస్తుత 90 రోజుల నుంచి 365 రోజుకు పెంచింది. ప్రతి టెలికాం ఆపరేటర్ 365 రోజుల చెల్లుబాటయ్యేలా వాయిస్, ఎస్ఎంఎస్‌ల కోసం తప్పనిసరిగా కనీసం ఒక ప్రత్యేక టారిఫ్ వోచర్ జారీ చేయాలని స్పష్టం చేసింది. డేటా అవసరం ఉన్నా లేకపోయినా కంపెనీలు వాయిస్, ఎస్ఎంఎస్‌లతో కలిపి తమకు అంటగడుతున్నాయని చందాదారుల నుంచి ఫిర్యాదులు రావడంతో ట్రాయ్ ఈ చర్య తీసుకుంది.

ఏపీ, తెలంగాణ ఎంఎస్ఎంఈలపై దృష్టి

శ్రీరామ్ ఫైనాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): శ్రీరామ్ గ్రూప్ కంపెనీ శ్రీరామ్ ఫైనాన్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ)పై ప్రత్యేక దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం సెప్టెంబరు నాటికి ఏపీలోని ఎంఎస్ఎంఈలకు రూ.4,907.89 కోట్లు, తెలంగాణలోని ఎంఎస్ఎంఈలకు రూ.4,666.20 కోట్లు రుణాలుగా మంజూరు చేసింది. ఇవి అన్ని రంగాలకు కలిపి ఇచ్చిన తమ మొత్తం రుణాల్లో 13.29 శాతానికి సమానమని తెలిపింది. రెండు రాష్ట్రాల్లోని తయారీ, సేవలు వాణిజ్య రంగాలకు చెందిన ఎంఎస్ఎంఈల రుణ అవసరాలపై శ్రీరామ్ ఫైనాన్స్ ప్రత్యేక దృష్టి పెట్టింది.

హెచ్ఎస్ఎల్‌కు మూడు అవార్డులు

మల్కాపురం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులు గెలుచుకుంది. ఈ నెల 21న ఢిల్లీలో 14వ పీఎస్ఈ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఇందులో షిప్‌యార్డుకు ఉత్తమ నాయకత్వం అందించి, సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు గాను సంస్థ సీఎండీ హేమంత్ ఖత్రీకి సీఎండీ ఆఫ్ ది ఇయర్ అవార్డు దక్కింది. ఖత్రీ మార్గదర్శకత్వంలో హెచ్ఎస్ఎల్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక ఉత్పత్తిని సాధించింది. కాగా సీఎస్ఆర్ విభాగంలో అవార్డును అదనపు జనరల్ మేనేజర్ ఇనాయత్తులా బేగ్, పీఎస్ఈల మహిళా సాకారం అవార్డును డిప్యూటీ మేనేజర్ ఎం.భానుప్రియ అందుకున్నారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	96
వరంగల్	93	గుంటూరు	99
కరీంనగర్	93	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	90
కర్నూలు	93	నెల్లూరు	90
విశాఖపట్నం	100	అనంతపురం	90
గోదావరి	96		

హోండా, నిస్సాన్ విలీనం

మేమూ మీతోనే: మిత్సుబిషి.. చేయి కలిపిన జపాన్ ఆటో దిగ్గజాలు

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటోమొబైల్ కంపెనీగా అవతరణ

టయోటా, ఫోక్స్‌వేగన్ పోటీని తట్టుకునేందుకే...



టోక్యో: జపాన్‌కు చెందిన ఆటో దిగ్గజాలు హోండా, నిస్సాన్ చేతులు కలిపాయి. మార్కెట్లో పోటీని తట్టుకుని, కార్ల మార్కెట్లో తమ స్థానం పటిష్ఠం చేసుకునేందుకు రెండు కంపెనీలు విలీనం కావాలని నిర్ణయించాయి. ఈ మేరకు ఉభయ కంపెనీల మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. నిస్సాన్‌తో ఇప్పటికే భాగస్వామ్యం ఉన్న మిత్సుబిషి కంపెనీ కూడా హోండా, నిస్సాన్‌లతో కలిసి ప్రయాణం చేయాలని నిర్ణయించినట్టు ప్రకటించింది. మూడు కంపెనీలతో ఒక జాయింట్ హోల్డింగ్ కంపెనీ ఏర్పాటు చేసేందుకు అవసరమైన విధివిధానాల రూపకల్పన కోసం చర్చలు ప్రారంభించాలని నిర్ణయించాయి. ఈ మేరకు హోండా సీఈఓ తోషిహిరో మైబ్, నిస్సాన్ సీఈఓ మకోటో ఉచిడా ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రక్రియ పూర్తయితే విలీన కంపెనీ అమ్మకాల్లో ప్రపంచంలోనే మూడో స్థాయిలో నిలుస్తుంది.

మూడు కంపెనీల మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుంటే అది 5,500 కోట్ల డాలర్ల (రూ.4.68 లక్షల కోట్లు) విలువ గల కంపెనీగా మారుతుంది. వాస్తవానికి హోండా, నిస్సాన్ కంపెనీల మధ్య ఈ ఏడాది మార్చి నుంచి పరిమిత భాగస్వామ్యం ఉంది. కొత్తతరం వాహన ఇంటెలిజెన్స్, విద్యుదీకరణలో సహకరించుకునేందుకు ఒక భాగస్వామ్యంపై రెండు కంపెనీలు మార్చి 15న ఎంఓయూ కుదుర్చుకున్నాయి. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించుకునేందుకు అంగీకరిస్తూ ఆగస్టు ఒకటో తేదీన మరో ఎంఓయూపై సంతకాలు చేశాయి. ఇప్పుడు తమ వ్యాపారాలను కూడా సమీకృతం చేసి ప్రపంచంలోనే ఆటో రంగంలో మూడో దిగ్గజంగా మారేందుకు సమాయత్తం అవుతున్నాయి. మరోపక్క నిస్సాన్ కంపెనీకి కూడా ఫ్రాన్స్‌కు చెందిన రెనోతో భాగస్వామ్యం ఉంది.

దీనివల్ల హోండా, నిస్సాన్, రెనో, మిత్సుబిషి నాలుగు కంపెనీ భాగస్వామ్యం జపాన్‌కు చెందిన ఆటో దిగ్గజం టయోటా, జర్మనీ ఆటో దిగ్గజం ఫోక్స్‌వేగన్‌కు కూడా గట్టి పోటీ ఇవ్వగలుగుతుందంటున్నారు. అయితే విలీనం తర్వాత కూడా టయోటానే మార్కెట్ నంబర్ వన్‌గా నిలుస్తుంది. 2023లో టయోటా 1.15 కోట్ల కార్లు తయారుచేసింది. కొత్తగా చేతులు కలిపిన మూడు కంపెనీలు ఉమ్మడిగా 80 లక్షల కార్లు (హోండా 40 లక్షలు, నిస్సాన్ 34 లక్షలు, మిత్సుబిషి 10 లక్షలు) మాత్రమే ఉత్పత్తి చేశాయి.

విలీన ప్రక్రియ ఎలా?

రెండు కంపెనీలకు మాతృ సంస్థగా వ్యవహరించేందుకు ఒక జాయింట్ హోల్డింగ్ కంపెనీ ఏర్పాటు చేస్తారు. వాటాదారులు, రెగ్యులేటరీ అధికారుల అనుమతులు లభించిన అనంతరం హోల్డింగ్ కంపెనీకి షేర్లను బదిలీ చేస్తాయి. అనంతరం నిస్సాన్ పునరుజ్జీవ ప్రక్రియను నిలకడగా అమలు పరుస్తారు. నిస్సాన్, హోండా రెండూ జాయింట్ హోల్డింగ్ కంపెనీకి అనుబంధ కంపెనీలుగా ఉంటాయి. 2026 ఆగస్టు నాటికి నిస్సాన్, హోండా కంపెనీల డీలిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేసి జాయింట్ హోల్డింగ్ కంపెనీ షేర్లను టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ చేయాలని నిర్ణయించారు.

విలీనం ఎవరికి లాభం?

ప్రస్తుతం ప్రపంచం యావత్తు పెట్రో ఉత్పత్తులపై నడిచే కార్ల స్థానంలో పర్యావరణ అనుకూలమైన విద్యుత్ వాహనాలకే ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఆటోమొబైల్ కంపెనీలు కూడా ఈవీల తయారీకి ప్రాధాన్యం ఇచ్చే దిశగా వ్యూహాలు మార్చుకుంటున్నాయి. ఈ విభాగంలో జపాన్ ఆటో కంపెనీలు ప్రత్యర్థుల కన్నా చాలా వెనుకబడి ఉన్నాయి. చైనాకు చెందిన బీవైడీ, జీపెంగ్, నియో, లీ ఆటో వంటి కంపెనీలు తక్కువ ధరలో హైబ్రిడ్, విద్యుత్ కార్లు అందించడం ద్వారా జపాన్ ఆటో దిగ్గజాల మార్కెట్‌కు పెను సవాలు విసురుతున్నాయి. ఈవీల ఉత్పత్తిలో హోండా, నిస్సాన్ చాలా వెనుకబడి ఉన్నాయి.

ఈ రెండు కంపెనీలు భారత మార్కెట్లో త్వరలో ఈవీలు ప్రవేశపెట్టే ప్రయత్నంలో ఉన్నాయి. హోండా ఎలివేట్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని, నిస్సాన్ అరియా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని వచ్చే ఏడాది మార్కెట్లో ప్రవేశపెట్టనున్నాయి. ఈ రెండు ఈవీలు ప్రస్తుత భాగస్వామ్యంలో భాగంగా ఉంటాయా లేదా అన్న విషయంలో ఇంకా స్పష్టత లేదు. అయినప్పటికీ హోండా, నిస్సాన్ కంపెనీలు తమ వనరులు సమీకృతం చేసుకునేందుకు, పరిశోధన, అభివృద్ధి వ్యయాలను తగ్గించుకునేందుకు, కొత్త టెక్నాలజీ కార్ల తయారీపై దృష్టి కేంద్రీకరించేందుకు ఈ విలీనం దోహదపడుతుందని నిపుణులంటున్నారు. మరోపక్క ఈ భాగస్వామ్యం ద్వారా నిస్సాన్ నుంచి హోండాకు భారీ ఎస్‌యూవీలకు అవసరమైన బాడీ ఫ్రేమ్ కూడా అందుబాటులోకి వస్తుంది. అంతే కాదు, బ్యాటరీ-విద్యుత్ వాహనాలు, గ్యాస్-విద్యుత్ హైబ్రిడ్ వాహనాల తయారీలో నిస్సాన్‌కు అనుభవం ఉంది. కొత్త తరం ఈవీలు, హైబ్రిడ్ వాహనాల తయారీలో ఈ అనుభవం ఉపయోగపడుతుంది.

భారత్‌లో అవకాశాలు అపారం

పెరుగుతున్న ఆదాయాలు, పట్టణీకరణ, మౌలిక వసతుల అభివృద్ధితో వర్ధమాన దేశాలైన భారత్, బ్రెజిల్ మార్కెట్లు ప్రపంచ ఆటోమొబైల్ కంపెనీలకు అపారమైన అవకాశాలు అందిస్తున్నాయి. సుజుకీ భాగస్వామ్యంలోని మారుతి సుజుకీ ఇప్పటికే భారత్‌లో మార్కెట్ లీడర్‌గా ఉంది. అందుబాటు ధరల్లో చక్కని ఇంధన సామర్థ్యం గల కార్లకు జపాన్ పెట్టింది పేరు. ఈ కారణంగానే టయోటా, హోండా, నిస్సాన్ కూడా భారత మార్కెట్లో మంచి వాటా కలిగి ఉన్నాయి. హోండా సిటీ సెడాన్‌తో 1998లో, నిస్సాన్ మైక్రా హ్యాచ్‌బాక్‌తో 2010లో భారత మార్కెట్లో ప్రవేశించాయి. భారత మార్కెట్లో ప్రవేశించి ఇంతకాలం అయినా రెండు కంపెనీలు తక్కువ పరిమిత ఉత్పత్తులతోనే నెట్టుకొస్తున్నాయి.

ప్రస్తుతం హోండా నుంచి సిటీతో పాటు అమేజ్ కాంపాక్ట్ సెడాన్, ఎలివేట్ ఎస్‌యూవీ మార్కెట్లో ఉండగా నిస్సాన్ నుంచి మాగ్నైట్, ఎక్స్-ట్రయల్ మాత్రమే ఉన్నాయి. ఆటో డీలర్ల సంఘం (ఫాడా) గణాంకాల ప్రకారం నవంబరు నాటికి హోండా మార్కెట్ వాటా 1.39 శాతం ఉండగా నిస్సాన్ 0.73 శాతం ఉంది. ఈ విలీనంతో వారు మరిన్ని కొత్త కార్లను మార్కెట్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా హోండా, నిస్సాన్‌ల విలీనం భారత ఆటో కంపెనీలకు సవాలు విసిరే ఆస్కారం సైతం ఉంది. ఆ సవాలును దీటుగా ఎదుర్కొనాలంటే భారత ఆటోమొబైల్ పరిశ్రమ కూడా సరికొత్త టెక్నాలజీలతో కస్టమర్లను ఆకట్టుకోవడానికి వ్యూహాత్మక భాగస్వామ్యాలు, ఇన్నోవేషన్ల దిశగా అడుగేయవలసి రావచ్చు.

ఐదు రోజుల నష్టాలకు తెర

సెన్సెక్స్ 499 పాయింట్లు అప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ల ఐదు రోజుల పతనానికి బ్రేక్ పడింది. కనిష్ఠ స్థాయిల వద్ద మదుపరులు పెద్దఎత్తున కొనుగోళ్లకు దిగటంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మద్దతు లభించటంతో సోమవారం బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ పరుగులు తీశాయి. బ్లూచిప్ షేర్లయిన ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల కొనుగోళ్లకు ఇన్వెస్టర్లు ఎగబడటం మార్కెట్లకు కలిసి వచ్చిందని ట్రేడర్లు తెలిపారు. సోమవారం బీఎస్ఈ సెన్సెక్స్ ఇంట్రాడేలో ఒక దశలో 876.53 పాయింట్లు దూసుకుపోయి 78,918.12 పాయింట్ల స్థాయిని తాకింది. చివరకు498.58 పాయింట్ల లాభంతో 78,540.17 పాయింట్ల వద్ద క్లోజైంది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 165.95 పాయింట్ల లాభంతో 23,753.45 పాయింట్ల వద్ద ముగిసింది. ఫైనాన్షియల్, ఐటీ రంగాల షేర్లు మంచి రికవరీ సాధించటం మార్కెట్లలో పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపిందని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు.

బడ్జెట్ రోజున స్టాక్ మార్కెట్లు పనిచేస్తాయ్: వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 శనివారం అయినప్పటికీ స్టాక్ మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయని బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ప్రకటించాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆ రోజున 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టనుండటంతో మార్కెట్లలో ట్రేడింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వెల్లడించాయి.

తగ్గిన నాన్-లైఫ్ క్లెయిమ్‌లు

2023-24లో రూ.1.72 లక్షల కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: నాన్-లైఫ్ బీమా రంగంలో క్లెయిమ్స్ తగ్గుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం ఈ రంగానికి చెందిన బీమా కంపెనీలు రూ.2.9 లక్షల కోట్ల మొత్తానికి అండర్‌రైట్ చేస్తే.. రూ.1.72 లక్షల కోట్ల మొత్తాన్ని పాలసీదారులు క్లెయిమ్ చేసుకున్నారు. ఇది మొత్తం అండర్ రైటింగ్‌లో 82.52 శాతానికి సమానం. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో నమోదైన 82.95 శాతంతో పోలిస్తే ఇది 0.43 శాతం తక్కువ. నికర క్లెయిమ్‌ల పరంగా చూస్తే మాత్రం క్లెయిమ్‌ల మొత్తం 15.39 శాతం పెరిగి రూ.1.72 లక్షల కోట్లకు చేరినట్టు భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) 2023-24 ఆర్థిక సంవత్సర నివేదికలో వెల్లడించింది.

ఎన్‌సీసీ లిమిటెడ్.. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) నుంచి ప్రతిష్ఠాత్మక అవార్డులు గెలుచుకుంది. హైదరాబాద్, నీలోఫర్ హాస్పిటల్‌లో సుశేణ హెల్త్ ఫౌండేషన్‌తో కలిసి ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ నిర్వహణతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రజా సంబంధాలు, బ్రాండింగ్‌ను చేపట్టడంలో కీలకంగా వ్యవహరించినందుకు గాను ఈ అవార్డులు దక్కించుకుంది. ఈ నెల 20 నుంచి 22 వరకు రాయ్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ జనరల్ మేనేజర్ (కార్పొరేట్ కమ్యూనికేషన్స్) విజయ్ కుమార్ ఈ అవార్డులను అందుకున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	590
వరంగల్	582	గోదావరి	590
చిత్తూరు	593	విశాఖపట్నం	595
		డజను గుడ్లు రూ. 84	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,500 ▲	71,050 ▲	99,000 ▲
విజయవాడ	78,600 ▲	72,500 ▲	92,000 ▲
విశాఖపట్నం	76,370 ▼	70,010 ▼	89,120 ▲
రాజమండ్రి	77,450 ▲	71,000 ▲	90,000 ▲
ప్రొద్దుటూరు	78,750 ▲	72,920 ▲	90,100 ▲
ముంబై	75,944 ▲	69,565 ▲	87,488 ▲

స్పోర్ట్స్

390.. ఊదేశారు

బెంగాల్ మహిళల జట్టు రికార్డు ఛేదన

రాజ్‌కోట్: మహిళల వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా బెంగాల్ రికార్డు సృష్టించింది. తనుశ్రీ సర్కార్ (113), ప్రియాంక బాల (88 నాటౌట్) అదరగొట్టడంతో.. సీనియర్ మహిళల వన్డే టోర్నీలో సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హరియాణా నిర్దేశించిన 390 పరుగుల లక్ష్యాన్ని బెంగాల్ మరో 5 బంతులు మిగిలుండగానే ఛేదించింది. ఈ క్రమంలో 2019లో న్యూజిలాండ్ దేశవాళీ క్రికెట్‌లో కాంటర్‌బరీతో మ్యాచ్‌లో నార్తర్న్ డిస్ట్రిక్ట్స్ టీమ్ 309 పరుగుల లక్ష్య ఛేదన రికార్డును బెంగాల్ బద్దలుకొట్టింది. అంతర్జాతీయ క్రికెట్‌లో సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో శ్రీలంక 305 పరుగుల లక్ష్యాన్ని అధిగమించింది. తొలుత హరియాణా నిర్ణీత 50 ఓవర్లలో 389/5 స్కోరు చేసింది. భారత జట్టులో చోటు కోల్పోయిన షఫాలీ వర్మ (197) త్రుటిలో డబుల్ సెంచరీ చేజార్చుకొంది. అనంతరం లక్ష్యం కోసం బరిలోకి దిగిన బెంగాల్ 49.1 ఓవర్లలో 5 వికెట్లకు 390 పరుగులు చేసి గెలిచింది.



ఆసుపత్రిలో వినోద్ కాంబ్లీ

థానె: టీమిండియా మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ తీవ్ర అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరాడు. మెదడులో రక్తం గడ్డకట్టడంతో ప్రస్తుతం అతను ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. అయితే చికిత్సకు కాంబ్లీ సహకరిస్తున్నాడనీ.. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. మూత్రంలో ఇన్ఫెక్షన్ సమస్యతో థానెలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరిన కాంబ్లీకి, పలు పరీక్షల అనంతరం మెదడులో సమస్యను గుర్తించినట్టు అతడికి చికిత్స అందిస్తున్న డాక్టర్ త్రివేది పేర్కొన్నాడు. మరోవైపు కాంబ్లీకి జీవితాంతం ఉచిత చికిత్స అందిస్తామని ఆస్పత్రి ఇన్‌చార్జి ఎస్ సింగ్ తెలిపినట్టు త్రివేది చెప్పాడు. సచిన్ టెండూల్కర్ చిన్ననాటి స్నేహితుడైన 52 ఏళ్ల కాంబ్లీ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు.



వాడేసిన పిచ్‌లా?

ప్రాక్టీస్ వికెట్లపై భారత్ అసంతృప్తి


రోహిత్

మెల్‌బోర్న్: నాలుగో టెస్ట్‌కు ముందు తమకు కల్పించిన ప్రాక్టీస్ పిచ్‌లపై భారత జట్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తంజేసింది. ఈ వికెట్‌పై అనూహ్య బౌన్స్ అయ్యిందని, అందువల్ల సాధన సందర్భంగా కెప్టెన్ రోహిత్‌కు మోకాలి గాయం అయిందని పేర్కొంది. కానీ మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) క్యూరేటర్ మ్యాట్ పేజ్ మాత్రం నిబంధనల మేరకే ప్రాక్టీస్ పిచ్‌లను ఏర్పాటు చేశామని సమర్థించుకున్నాడు. ఆదివారం సాధన సందర్భంగా త్రోడౌన్‌ను ఎదుర్కొనే క్రమంలో బంతి రోహిత్ ఎడమ మోకాలికి బలంగా తాకిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో భారత జట్టు సోమవారం ప్రాక్టీస్ చేయకూడదని నిర్ణయించుకుంది. నిబంధనలను అనుసరించి టెస్ట్ మ్యాచ్‌కు మూడు రోజుల ముందు మాత్రమే క్యూరేటర్ కొత్త ప్రాక్టీస్ పిచ్‌ను భారత్‌కు కేటాయించాల్సి ఉంది. భారత్-ఆస్ట్రేలియా మధ్య నాలుగో టెస్ట్ ఈనెల 26న ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. 'టెస్ట్ మూడు రోజుల్లోకి వచ్చేసింది. దాంతో కొత్త పిచ్‌లను రూపొందించా. మూడు రోజులకంటే ముందే జట్టు ప్రాక్టీస్‌కు వస్తే..ఉపయోగించిన పిచ్‌లనే కేటాయిస్తాం' అని పేజ్ వివరించాడు.

'ఎంసీజీ' పేసర్లకు అనుకూలం: పెర్త్, అడిలైడ్ వికెట్ల మాదిరి ఎంసీజీ పిచ్‌పై అంత బౌన్స్ ఉండదట. కానీ వికెట్‌పై ఆరు మి.మీ.మేర పచ్చిక ఉండడంతో పేసర్లకు అనుకూలించనుంది. స్పిన్నర్లకు సహకరించేలా పిచ్‌పై పగుళ్లు ఉండబోవని పేజ్ స్పష్టంజేశాడు. కొత్త బంతి మెరుపు తగ్గాక బ్యాటర్లకు సహకరిస్తుందని తెలిపాడు.

షమికి నిరాశ

భారత జట్టులో పునరాగమనం కోసం ఎదురు చూస్తున్న వెటరన్ పేసర్ షమికి మళ్లీ నిరాశే ఎదురైంది. అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో ఆస్ట్రేలియాతో చివరి రెండు టెస్ట్‌లకు అతడిని ఎంపిక చేయడంలేదని బీసీసీఐ సోమవారం ప్రకటించింది.

భాకర్‌కు చోటు లేదా?

ఖేల్‌రత్న అవార్డు నామినేషన్లపై వివాదం



న్యూఢిల్లీ: దేశ క్రీడా రంగ ప్రతిష్ఠాత్మక అవార్డు ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న విజేతలను త్వరలో ప్రకటించనున్నారు. అయితే ఈ పురస్కారానికి సిఫారసు చేసిన జాబితాలో పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన స్టార్ షూటర్ మనూ భాకర్ పేరు లేకపోవడం సంచలనం రేపుతోంది. ఈసారి ఖేల్‌రత్న అవార్డుకు హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారిస్ పారా ఒలింపిక్స్ హైజంప్‌లో స్వర్ణం నెగ్గిన ప్రవీణ్ కుమార్ తదితరుల పేర్లను సిఫారసు చేశారు. కానీ భాకర్ పేరు లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అయితే మనూభాకర్ స్వంతంగాకానీ, భారత రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) కానీ ఈ పురస్కారానికి దరఖాస్తు చేయలేదని క్రీడాశాఖ స్పష్టంజేసింది. మరోవైపు ఖేల్‌రత్న అవార్డుకు దరఖాస్తు చేయాల్సిన బాధ్యత భాకర్‌దేనని ఎన్ఆర్ఏఐ చీఫ్ నారాయన్ సింగ్ దేవ్ తెలిపారు. ఆమె దరఖాస్తు చేయకపోవడంతో..భాకర్ పేరును జాబితాలో చేర్చాలని క్రీడాశాఖను కోరినట్టు కూడా దేవ్ చెప్పారు. మనూ భాకర్ తండ్రి రామ్‌కిషన్ భాకర్ మాత్రం తాము దరఖాస్తు చేశామని చెబుతుండడం గమనార్హం. కాగా..దేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీకి దరఖాస్తు చేయాలనుకుంటున్నందున, షూటర్ కుటుంబం ఖేల్‌రత్న దరఖాస్తును పట్టించుకోలేదనే వాదనా వినిపిస్తోంది. మరోవైపు, ఖేల్‌రత్న అవార్డీల పేర్లు ఖరారు కాలేదని, తన వద్దకు వచ్చిన జాబితాలో మనూభాకర్ పేరును మంత్రి మాండవీయ చేరుస్తారని క్రీడాశాఖ వర్గాలు వెల్లడించాయి. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ రామసుబ్రమణియన్ నేతృత్వంలోని 12 మంది సభ్యుల కమిటీ క్రీడా అవార్డులకు అథ్లెట్లను ఎంపిక చేయనుంది.


రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఆదివారం రాత్రి జరిగిన వివాహ వేడుకలో వధూవరులు పీవీ సింధు, వెంకట దత్తసాయి

సిరీస్‌పైనే గురి

జోష్‌లో హర్మన్ సేన

నేడు విండీస్‌తో రెండో వన్డే

మధ్యాహ్నం 1.30 నుంచి స్పోర్ట్స్18లో..



వడోదర: అన్ని విభాగాల్లో రాణిస్తోన్న భారత మహిళల క్రికెట్ జట్టు వరుసగా రెండో సిరీస్‌పై దృష్టి సారించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై 211 పరుగుల భారీ తేడాతో నెగ్గిన హర్మన్‌ప్రీత్ బృందం రెట్టించిన ఉత్సాహంతో ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఇరుజట్ల మధ్య కీలక రెండో మ్యాచ్ జరుగనుంది. ఇందులో నెగ్గితే భారత్‌కు సిరీస్ దక్కుతుంది. ఇప్పటికే 3 టీ20ల సిరీస్‌ను భారత్ ఖాతాలో వేసుకున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది స్వదేశంలోనే వరల్డ్‌కప్ ఉండడంతో ప్రతీ మ్యాచ్ భారత్‌కు సన్నాహకంగా మారనుంది. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకతో పాటు బ్యాటింగ్ విభాగం సత్తా చాటుతోంది. ప్రత్యర్థి బ్యాటర్లను కుదురుకోనీయకుండా పేసర్ రేణుకా సింగ్‌తో కూడిన భారత బౌలింగ్ దళం చెలరేగుతోంది. ఇక ఆరంభ వన్డేలో చెత్త ఆటతీరుతో మూల్యం చెల్లించుకున్న విండీస్‌కు ఈ మ్యాచ్ గెలిస్తేనే సిరీస్‌పై ఆశలుంటాయి.

ఆఖరి వన్డేలోనూ పాక్‌దే గెలుపు

జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌ను పాకిస్థాన్ 3-0తో దక్కించుకుంది. దీంతో సఫారీ గడ్డపై ఆ జట్టును ఓ వన్డే సిరీస్‌లో అన్ని మ్యాచుల్లోనూ ఓడించిన తొలి జట్టుగా పాక్ నిలిచింది. ఆదివారం జరిగిన ఈ ఆఖరి వన్డేలో పాక్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 36 పరుగుల తేడాతో నెగ్గింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 47 ఓవర్లకు కుదించగా.. ముందుగా పాక్ 9 వికెట్లకు 308 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ సయిమ్ అయూబ్ (101) తొలి శతకంతో పాటు కెప్టెన్ రిజ్వాన్ (53), బాబర్ (52) రాణించారు. రబాడకు మూడు.. ఫర్హాన్, జాన్సెన్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. ఆ తర్వాత సౌతాఫ్రికా 42 ఓవర్లలో 271 రన్స్‌కు ఆలౌటైంది. క్లాసెన్ (81) ఆదుకునే ప్రయత్నం చేయగా, బోష్ (40), వాన్‌డర్ డుస్సెన్ (35) ఫర్వాలేదనిపించారు. ముఖీమ్‌కు నాలుగు.. నసీమ్, షహీన్ రెండేసి వికెట్లు తీశారు.

అశ్విన్ స్థానంలో తనుష్


ఎవరితను..?

అశ్విన్ స్థానంలో ముంబై ఆఫ్ స్పిన్నర్ తనుష్ కోటియన్ భారత జట్టులో చేరనున్నాడు. తనుష్ ప్రస్తుతం.. విజయ్ హజారే ట్రోఫీకోసం అహ్మదాబాద్‌లో ఉన్నాడు. మంగళవారం అతడు ముంబై నుంచి మెల్‌బోర్న్ బయల్దేరనున్నట్టు సమాచారం. వాస్తవంగా..కోటియన్‌కు బదులు లెఫ్టామ్ స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను ఆస్ట్రేలియా పంపాలనుకున్నారు. అయితే హజారే టోర్నీ తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆడించి అక్షర్‌ను ఆసీస్ పంపాలనుకున్నా.. కుటుంబ పనుల కారణంగా అతడు ఆ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దీంతో తనుష్‌కు చాన్స్ దక్కింది.

26 ఏళ్ల తనుష్ దేశవాళీ పోటీల్లో నికార్సయిన బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా పేరు పొందాడు. 2023-24 రంజీ సీజన్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచాడు. ముంబై జట్టు 42వ రంజీ ట్రోఫీ టైటిల్ గెలవడంలో కీలక భూమిక పోషించాడు. ఆ సీజన్‌లో 16.96 సగటుతో 29 వికెట్లు తీశాడు. 41.83 సగటుతో 502 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా 33 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 101 వికెట్లు పడగొట్టాడు. రెండు శతకాలతో మొత్తం 1525 పరుగులు సాధించాడు. మెల్‌బోర్న్ గ్రౌండ్‌లో తనుష్‌కు మంచి రికార్డే ఉంది. ఇటీవలి పర్యటనలో భారత్ 'ఎ' తరపున ఎనిమిదో నెంబర్‌లో బరిలోకి దిగి 44 పరుగులు చేశాడు.



ఢిల్లీకి సెమీస్ బెర్త్

పుణె: ప్రొ కబడ్డీ లీగ్‌లో దబాంగ్ ఢిల్లీ జట్టు నేరుగా సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ 45-31తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. దీంతో మొత్తం 81 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన ఢిల్లీ సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకొంది. స్టార్ రైడర్ అషు మాలిక్ 14 పాయింట్లతో అదరగొట్టాడు. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 42-32తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. పుణె రైడర్ ఆర్యవర్ధన్ సూపర్-10 సాధించాడు.

ధనుష్‌కు రజతం




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బధిర షూటర్ ధనుష్ శ్రీకాంత్ జాతీయ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పతకం కొల్లగొట్టి సంచలనం సృష్టించాడు. బధిర పోటీల్లో కాకుండా ఓపెన్ పోటీల్లో అతడు పోటీ పడి పతకం సాధించడం విశేషం. సోమవారం భోపాల్‌లో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో హైదరాబాద్‌కు చెందిన ధనుష్ 252.1 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచి రజతం దక్కించుకున్నాడు. 0.1 పాయింట్ తేడాతో ధనుష్ స్వర్ణం చేజార్చుకున్నాడు. షాహు తుషార్ మనె (రైల్వేస్- 252.2) పసిడి సాధించగా, యశవర్ధన్ (రాజస్థాన్) కాంస్యం గెలిచాడు.

ఆంధ్రకు ఓటమి

వాంఖడే: బౌలర్ల వైఫల్యంతో.. విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్రకు తొలి ఓటమి ఎదురైంది. గ్రూప్-బిలో సోమవారం రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 9 వికెట్ల తేడాతో చిత్తయింది. తొలుత ఆంధ్ర నిర్ణీత 50 ఓవర్లలో 262/7 స్కోరు చేసింది. సందీప్ (80 నాటౌట్), కెప్టెన్ కేఎస్ భరత్ (64) అర్ధ శతకాలు సాధించారు. అమన్ షెకావత్, అనికేత్ చౌదరి చెరో 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో రాజస్థాన్ 43.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 266 పరుగులు చేసి గెలిచింది. మహిపాల్ లోమ్రోర్ (134 నాటౌట్), రామ్ చౌహాన్ (120 నాటౌట్) శతకాలతో అదరగొట్టారు. సత్యనారాయణ రాజు ఒక వికెట్ పడగొట్టాడు.



కిడ్నీ కేర్





మూత్రపిండాలు ఇలా క్షేమం

మధుమేహం, అధిక రక్తపోటు, అస్తవ్యస్థ ఆహార, జీవనశైలులు... ఇవన్నీ మూత్రపిండాలను దెబ్బతీసేవే! అయితే చాప కింద నీరులా నిశ్శబ్దంగా, రహస్యంగా జబ్బుపడే తత్వం మూత్రపిండాలకు ఉంటుంది. కాబట్టి ముందస్తు పరీక్షలతో వాటి పనితీరు మీద ఓ కన్నేసి ఉంచాలంటున్నారు వైద్యులు.

మూత్రపిండాలు నిరంతరంగా రక్తాన్ని వడగడుతూ, దాన్లోని పోషకాలను శరీరం శోషించుకునేలా చేస్తాయి. అంతటి సమర్థమైన మూత్రపిండాలు పనిచేయడానికి మొండికేస్తే, పోషకాల శోషణ తగ్గడమే కాకుండా, ఒంట్లో విషాలు పేరుకుపోతాయి. అయితే ఈ పరిస్థితిని పసిగట్టగలిగే లక్షణాలు మూత్రపిండాల ప్రారంభ దశలో బయల్పడవు. కానీ మూడో దశ నుంచి కొన్ని లక్షణాలు బయల్పడడం మొదలుపెడతాయి. అవేంటంటే...

- మూత్రంలో నురగ
- అధిక రక్తపోటు
- వాపు మీద వేలితో ఒత్తి చూస్తే, గుంట పడుతుంది.
- కాళ్లు, కళ్ల దిగువన వాపు కనిపిస్తుంది.

మూత్రపిండాలు పాడైతే...

- అధిక రక్తపోటు. మూత్రపిండాలకు రక్తప్రసరణ మందగించి, రక్తంలో వెనక్కి గుండె వైపు ప్రసరిస్తూ, రక్తంలో ఒత్తిడిని పెంచుతుంది. దాంతో రక్తపోటు పెరిగిపోతుంది. ఈ పరిస్థితి గుండెకూ, మూత్రపిండాలకు చేటు చేస్తుంది.
- అలసట. రోజంతా అలసట ఆవరించి ఉంటుంది. ఇందుకు కారణం అవసరానికి మించి యూరియా రక్తంలో పేరుకుపోవడమే!

నీళ్లు తాగాలి

మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉండాలంటే సరిపడా నీళ్లు తాగాలనే విషయం అందరికీ తెలిసిందే! మూత్రపిండాలు జబ్బుపడిన తొలి దశలో వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగాలి. అయితే అందుకు కూడా ఒక పద్ధతి పాటించాలి. ఒకేసారి ఏకబిగిన నీళ్లన్నీ తాగేయకుండా రెండు గంటల వ్యత్యాసంతో తరచూ నీళ్లు తాగుతూ ఉండాలి. మూత్రం ఎంత పలుచగా పారదర్శకంగా ఉంటే, మూత్రపిండాలు అంత ఆరోగ్యంగా ఉన్నాయని అర్థం. కాబట్టి సరిపడా నీళ్లు తాగుతూ మూత్రం పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలి. అయితే మూత్రపిండాల వ్యాధి ముదిరి కాళ్ల వాపులు మొదలైన పక్షంలో ఉప్పుతో పాటు తాగే నీటి మోతాదు కూడా తగ్గించాల్సి ఉంటుంది.

- మూత్రంలో ప్రొటీన్ నష్టం. మూత్ర పరీక్ష చేయించుకుంటే, ఎక్కువ మోతాదుల్లో ప్రొటీన్ కనిపిస్తుంది. మూత్రపిండాల్లోని ఫిల్టర్ల ద్వారా ఎక్కువ మోతాదుల్లో ప్రొటీన్ నష్టం జరుగుతుంది.
- ఆమ్లత్వంతో కూడిన మూత్రం. శరీరంలో ఆమ్లత్వం పెరిగిపోతుంది. శరీరంలోని అమ్మోనియాలో అసమతౌల్యం ఏర్పడడం మూలంగా శరీర పిహెచ్ విలువలు పెరిగిపోతాయి. ఒకవేళ మధుమేహులైతే, చక్కెర స్థాయిలు అదుపు తప్పుతాయి. ఈ పరిస్థితిని పసిగట్టడంలో విఫలమైతే, 'కీటోఅసిడోసిస్' అనే సమస్య మొదలవుతుంది. మధుమేహులై ఉండి, చక్కెర మందులు వాడకుండా ఉన్నా, చక్కెర మోతాదులను అదుపులో ఉంచుకోకపోయినా, కీటోఅసిడోసిస్ తలెత్తుతుంది.
- శరీరంలో విటమిన్ డి మోతాదు తగ్గిపోతుంది. మూత్రపిండాలు డి విటమిన్‌ను శరీరానికి ఉపయోగపడేలా, యాక్టివ్ డి విటమిన్‌గా మారుస్తాయి. మూత్రపిండాలు దెబ్బతింటే విటమిన్ డి లోపం ఏర్పడుతుంది. దాంతో క్యాల్షియం శోషణ సమస్య ఏర్పడి, గుండె రక్తనాళాల్లో క్యాల్షియం పేరుకోవడం మొదలవుతుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి.

తీవ్ర కిడ్నీ వ్యాధులు

దాదాపు 17% భారత జనాభా తీవ్ర మూత్రపిండాల వ్యాధులతో బాధ పడుతోంది. కొన్ని రాష్ట్రాల్లో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో 20% జనాభా తీవ్ర మూత్రపిండాల వ్యాధులకు గురవుతోంది. ప్రతి ఏటా దేశవ్యాప్తంగా దాదాపు 5 లక్షల మందికి పైగా ప్రజలు డయాలసిస్ స్థితికి చేరుకుంటున్నారు. వీళ్లలో కేవలం 20 వేల మందికి మాత్రమే మూత్రపిండాల మార్పిడి సదుపాయం లభిస్తోంది.

ముప్పు ఎవరికి?

మధుమేహం, మూత్రపిండాల్లో ఇన్‌ఫ్లమేషన్, అధిక రక్తపోటు, మూత్రపిండాల్లో రాళ్లు, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, నొప్పి నివారణ మందులు, ఊబకాయులు, కుటుంబ చరిత్రలో తీవ్ర మూత్రపిండాల వ్యాధులున్న వాళ్లకు మూత్రపిండాలు పాడయ్యే, విఫలమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కొందర్లో పుట్టుకతోనే మూత్రపిండాల్లో సిస్టులు ఉంటాయి. ఇవి వయసుతో పాటు పెరుగుతూ మూత్రపిండాలను దెబ్బ తీస్తాయి. అయితే మూత్రపిండాలకు సంబంధించిన ఎలాంటి రుగ్మత అయినా ప్రారంభంలో ఎలాంటి లక్షణాలను కనబరచకపోవడం వల్ల, మూత్రపిండాల జబ్బు తీవ్రతరమయ్యే పరిస్థితి తలెత్తుతూ ఉంటుంది. ఇలాంటి దశలో డయాలసిస్, మూత్రపిండాల మార్పిడి అవసరమవుతుంది. ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే మూత్రపిండాల వ్యాధులకు గురయ్యే అవకాశం ఉన్నవాళ్లందరూ ఏడాదికోసారి ఎస్టిమేటెడ్ జిఎఫ్ఆర్ (గ్లోమెర్యులార్ ఫిల్ట్రేషన్ రేట్), మూత్రంలో ప్రొటీన్ పరీక్షలు చేయించుకోవాలి. ఈ పరీక్షలతో ప్రారంభ దశలో ఉన్న మూత్రపిండాల వ్యాధులను కనిపెట్టి, వ్యాధి తీవ్రమవకుండా అరికట్టే మందులను మొదలుపెట్టుకోవచ్చు.

సమర్థమైన మందులతో...

మూత్రపిండాలు జబ్బుపడినప్పుడు మూత్రంలో ప్రొటీన్ నష్టం ప్రధాన సూచన. ఆరోగ్యకరమైన వ్యక్తుల్లో ఒక రోజులో మూత్రం ద్వారా 100మి.గ్రా ప్రొటీన్ నష్టం జరుగుతూ ఉంటుంది. కానీ మూత్రపిండాల వ్యాధులున్న వారిలో ప్రొటీన్ నష్టం, 500 నుంచి 1000 మి.గ్రా ఉంటుంది. ఈ నష్టానికి అడ్డుకట్ట వేసే సమర్థమైన మందులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి ప్రారంభంలోనే ప్రొటీన్ నష్టాన్ని కనిపెట్టి, వెంటనే మందులు వాడుకోవడం మొదలుపెడితే, మూత్రంలో ప్రొటీన్ నష్టం తగ్గడంతో పాటు మూత్రపిండాల వ్యాధి ఒక దశ నుంచి తర్వాతి దశకు పెరగకుండా ఉంటుంది.

మూత్రపిండాలు ఇలా క్షేమం

- ఉప్పు తగ్గించాలి
- మూత్రంలో ప్రొటీన్ నష్టాన్ని తొలి దశలోనే గుర్తించి, మందులు వాడుకోవాలి
- ధూమపానం, మద్యపానం మానేయాలి
- మధుమేహం, అధిక రక్తపోటు అదుపులో ఉంచుకోవాలి
- రెడ్ మీట్ మానేయాలి
- శరీర బరువు అదుపులో ఉంచుకోవాలి.

మూత్రపిండాల మార్పిడి

జీవితాంతం డయాలసిస్ మీద ఆధారపడడం కంటే మూత్రపిండాల మార్పిడితో శాశ్వత పరిష్కారాన్ని ఎంచుకోవడం ఉత్తమం. కుటుంబసభ్యుల నుంచి సేకరించిన మూత్రపిండంతో శరీరం ఆ అవయవాన్ని వ్యతిరేకించే తీవ్రత తక్కువగా ఉంటుంది. కాబట్టి వ్యాధినిరోధకశక్తిను తగ్గించే మందులను కూడా పరిమితంగా వాడుకునే వెసులుబాటు ఉంటుంది. మూత్రపిండాన్ని దానం చేయడం వల్ల శరీరానికి అదనంగా ఒరిగే నష్టం కూడా ఉండదు. ఒక కన్ను లేకపోతే, రెండో కన్నుతో జీవితాంతం బ్రతకగలిగినట్టే, ఒక మూత్రపిండంతో కూడా నిండు నూరేళ్లూ ఆరోగ్యంగా జీవించవచ్చు. అలాగే బ్లడ్ గ్రూపులు కలవకపోయినా, మూత్రపిండాలను మార్పిడి చేసే వెసులుబాటు కూడా ఉంది.


డాక్టర్ రాజశేఖర చక్రవర్తి,
సీనియర్ నెఫ్రాలజిస్ట్ అండ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



అవగాహన

జీర్ణకోశ సమస్యలకు శత్రువులు

ఇరిటబుల్ బొవెల్ సిండ్రోమ్... ఈ జీర్ణకోశ సమస్య పెద్ద పేగులకు సంబంధించినది. ఈ సమస్య ఉన్నవాళ్లు తరచూ పొట్ట నొప్పి, అసౌకర్యం, మలబద్ధకం, విరోచనాలతో బాధపడుతూ ఉంటారు. అయితే ఐబిఎస్ ఉన్నవాళ్లు కొన్ని ఆహార నియమాలు పాటిస్తే సమస్య అదుపులో ఉండే వీలుంది. వీళ్లు తినకూడదని పదార్థాలు ఏవంటే...



- **బీన్స్:** సెనగలు, పప్పులు, బీన్స్ ఐబిఎస్ సమస్యను పెంచుతాయి. వీటి నుంచి వెలువడే వాయువులు జీర్ణ ప్రక్రియను బాధాకరంగా మారుస్తాయి. కాబట్టి వీటిని తీసుకోకపోవడమే మేలు. ఒకవేళ తినాలనిపిస్తే, తేలికగా అరిగేలా, మెత్తని ముద్ద రూపంలో తీసుకోవాలి.



- **వేపుళ్లు:** వీటిని కొవ్వు ఎక్కువ కాబట్టి కడుపు ఉబ్బరిస్తుంది. కొన్ని సందర్భాల్లో విరోచనాలూ వేధిస్తాయి. కాబట్టి ఫ్రెంచ్ ఫ్రైస్ లాంటివి తినాలనిపిస్తే వాటిని బేక్ చేయడం లేదా, గ్రిల్లింగ్ చేయాలి.




- **క్రూసిఫెరస్ కూరగాయలు:** ఈ జాతికి చెందిన కూరగాయల్లో పీచు ఎక్కువ. నిజానికి జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే పీచు ఎక్కువగా ఉండే కూరగాయలకే ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ ఐబిఎస్ ఉన్నవాళ్లు ఈ రకం కూరగాయలు తినడం వల్ల, వాటిలో 'రాఫినోస్' అనే జీర్ణం కాని చక్కెరతో సమస్య మరింత పెరుగుతుంది. కాబట్టి క్యాబేజీ, కాలీఫ్లవర్, బ్రొకొలి కూరగాయలకు దూరంగా ఉండాలి.



- **చక్కెర ప్రత్యామ్నాయాలు:** చక్కెరకు ప్రత్యామ్నాయంగా వాడుకునే స్వీటెనర్లతో ఐబిఎస్ లక్షణాల తీవ్రత పెరుగుతుంది. పాలియోల్, సార్బిటాల్, క్సైలిటాల్, మానిటాల్ మొదలైన స్వీటెనర్లు రెడీమేడ్ ఫుడ్స్‌లో ఉంటాయి. ఇవన్నీ ఐబిఎస్ లక్షణాలను రెట్టింపు చేసేవే. కాబట్టి 'షుగర్ ఫ్రీ' అనే లేబుల్ ఉన్న

ఆరోగ్యం



వాపు నొప్పులకు అడ్డు కట్ట

శరీరంలో వాపులు నొప్పులను తగ్గించే పదార్థాలను ఆహారంలో జోడించడం ద్వారా ఇన్‌ఫ్లమేషన్ ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. అవేంటంటే...

బ్లూబెర్రీస్

వీటిలో సహజసిద్ధ రసాయనాలైన పాలిఫినాల్స్ ఉంటాయి. వీటిలో ఉండే యాంథోసయానిన్ పాలిఫినాల్స్ వల్లే బ్లూబెర్రీస్‌కు నీలి రంగు సమకూరుతుంది. ఈ పాలీఫినాల్స్ శరీరంలోని వాపు, నొప్పులను తగ్గించి ఇన్‌ఫ్లమేషన్‌ను అరికడతాయి.

వాల్‌నట్స్

వీటిలోని అత్యధిక ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు, ఆల్ఫా లినోలిక్ యాసిడ్లు, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. వాల్‌నట్స్‌లో ఉండే సి రియాక్టివ్ ప్రొటీన్, క్యాల్షియం, మెగ్నీషియం, జింక్, విటమిన్ ఇ పోషకాలు కీళ్ల సంబంధ వాపులు, నొప్పులను తగ్గించడానికి సహాయపడతాయి.

డార్క్ చాక్లెట్

వీటిలో సమృద్ధిగా ఉండే ఫ్లేవనాయిడ్స్ వాపులను తగ్గిస్తాయి. చాక్లెట్ ఎంత ముదురు రంగులో ఉంటే దాన్లో అంత ఎక్కువ ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. కాబట్టి 70% కోకో, అతి తక్కువ చక్కెరలను కలిగి ఉండే డార్క్ చాక్లెట్‌ను ఎంచుకోవాలి. అలాగే డార్క్ చాక్లెట్ సెరటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచి, కంటి నిండా నిద్ర పట్టడానికి సహాయపడుతుంది.

ఫిట్‌నెస్

చలి కాలం వ్యాయామం!

చలికాలం పొగమంచుతో ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు వేధించడం సహజం. కాబట్టి ఉదయం వేళ నడక సాధ్యపడకపోవచ్చు. జిమ్‌కు వెళ్లి వ్యాయామాలు చేసే అలవాటున్న వాళ్లకు ఇతరుల నుంచి జలుబు, దగ్గు వ్యాపించే అవకాశాలు కూడా ఎక్కువే! ఈ ఇబ్బందులేవీ ఎదుర్కోకుండా ఉండాలంటే ఇంటి పట్టునే వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

ఎలాంటి వ్యాయామం మొదలుపెట్టాలన్నా మొదట శరీరాన్ని వ్యాయామానికి సిద్ధం చేయాలి. ఇందుకోసం స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. ఆ తర్వాతే అసలైన వ్యాయామాలను మొదలుపెట్టాలి. ఇందుకోసం నిలబడిన చోటే స్పాట్ జాగింగ్ చేయాలి. ఆ తర్వాత...

కాంబో వర్కవుట్!

- హై నీస్: కాళ్ల మధ్య అడుగు దూరం ఉండేలా నిలబడాలి. మోకాళ్లను మడిచి నడుము దగ్గరకు మార్చి, మార్చి లేపుతూ ఉండాలి. ఇలా కాళ్లను లేపినప్పుడు చేతులతో మోకాళ్లను తాకుతూ ఉండాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.
- బర్పీ: రెండు చేతులు గాల్లోకి లేపి ఎగరాలి. వెంటనే ముందుకు నేల మీద పడుకోవాలి. ఆలస్యం చేయకుండా లేచి నిలబడి మళ్లీ గాల్లోకి లేవాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.
- మౌంటెయిన్ క్లైంబ్: చేతులు, పాదాల ఆసరాతో నేల మీద బోర్లా పడుకోవాలి. ఈ భంగిమలో విఎగతా శరీరం నేలను తాకకూడదు. ఈ భంగిమలో ఉండి, పర్వతం ఎక్కుతున్నట్టుగా కాళ్లను నడుము దగ్గరకు, కిందకూ మార్చి, మార్చి కదిలించాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.
- ప్లాంక్: మోచేతులు, పాదాల ఆసరాతో నేల మీద బోర్లా పడుకోవాలి. ఈ భంగిమలో మిగతా శరీరం



నేలను తాకకూడదు. ఇలా 30 సెకండ్లు ఉండాలి. ఈ వ్యాయామాలు 3 సెట్లు చేయాలి.

పొత్తికడుపు వ్యాయామాలు!

- క్రంచెస్: నేల మీద వెల్లకిలా పడుకుని, రెండు చేతులు తల దగ్గర ఉంచి, నడుము పైభాగాన్ని వీలైనంతగా ముందుకు లేపే వ్యాయామం ఇది. ఇలా 25 క్రంచెస్ 3 సెట్లు చేయాలి.
- లెగ్ రైజ్: వెల్లకిలా పడుకుని, కాళ్లు రెండూ ఒకేసారి నిటారుగా పైకి లేపి, నడుముకు సమాంతరంగా తీసుకువచ్చి, మళ్లీ దింపేయాలి. ఇలా 25 సార్లు, మూడు సెట్లు చేయాలి.
- సైడ్ ఆబ్లిక క్రంచెస్: పక్కకు తిరిగి పడుకుని, కాళ్లు మడవాలి. చేతులను తల వెనకకు తీసుకువచ్చి, మెడకు ఆసరాగా ఉంచాలి. ఈ భంగిమలో నడుము పైభాగాన్ని పక్కకు లేపే ప్రయత్నం చేయాలి. ఇలా 25 సార్లు, మూడు సెట్లు చేయాలి.
- ఇలా మొత్తం వ్యాయామాలకు కనీసం 45 నిమిషాలు కేటాయించాలి. ఒక్కొక వ్యాయామానికి మధ్య 30 సెకండ్ల పాటు విరామం తీసుకోవచ్చు. ఈ వ్యాయామాలు చేస్తున్నప్పుడు ఫ్యాన్ లేదా ఏసి వేసుకోకూడదు.

స్ట్రెచింగ్!

వ్యాయామాలు ముగిసిన తర్వాత శరీరాన్ని తిరిగి స్ట్రెచ్ చేసుకోవాలి. ఇందుకోసం నేల మీద వెల్లకిలా పడుకుని, చేతులు తల వెనకకు చాపి, నడుపు పైభాగాన్ని పైకీ, నడుము కింద భాగాన్ని కిందకూ సాగదీసినట్టు స్ట్రెచ్ చేయాలి.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం కావాలి!



శరీరం ఆరోగ్యంగా ఉంటే సరిపోతుందా? మానసిక ఆరోగ్యం సంగతేమిటి? ఇవి రెండు సరిగ్గా లేకపోతే సంపూర్ణ ఆరోగ్యం సాధించటం సాధ్యమవుతుందా? ఇలాంటి అనేక ప్రశ్నలు చాలామందిలో ఉత్పన్నమవుతూ ఉంటాయి. "సంపూర్ణ ఆరోగ్యమంటే కేవలం శరీరం మాత్రమే కాదు.. మనస్సు, ఆత్మ- అన్నీ ఆనందంగా ఉండాలి. అప్పుడే నిజమైన ఆరోగ్యాన్ని సాధించగలుగుతాం. వీటిని ఎలా సాధించగలుగుతామనే విషయాన్ని ఆయుర్వేద గ్రంథాల్లో స్పష్టంగా వివరించారు" అంటారు శ్రీవర్మ ఆయుర్వేద ఆసుపత్రుల వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీవర్మ. ఆయుర్వేదాన్ని జీవనంగా మార్చుకొని వైద్యవృత్తిని పరంపరగా సాగిస్తున్న కేరళకు చెందిన తిరువైథన్‌కోడ్ సంప్రదాయంలో 9వ తరం వాడైన శ్రీవర్మ- ఆ వైద్య విధానానికి సంబంధించిన అనేక అంశాలను 'డాక్టర్'తో పంచుకున్నారు.

ఒక వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యవంతుడు కావటానికి 'ప్రసన్న ఆత్మేంద్రియానాం' అనే సూత్రాన్ని అనుసరించాలని ఆయుర్వేదం చెబుతుంది. శరీరం, మనస్సు, ఆత్మ.. ఈ మూడు ఒకదానితో మరొకటి స్నేహంగా ఉన్నప్పుడు ఒక వ్యక్తి పరిపూర్ణ ఆరోగ్యవంతుడవుతాడు. ఆనందంగా జీవించగలుగుతాడు. ఈ సూత్రాన్ని మరింతగా విశ్లేషిద్దాం. ఎవరైనా నా దగ్గరకు వచ్చినప్పుడు అతణ్ణి - "ఆహారం తినగలుగుతున్నారా?", "దినచర్యలు తీర్చుకోగలుగుతున్నారా?", "నిద్ర సరిగ్గా పడుతోందా?", "శరీరంలో ఏ భాగంలోనైనా నొప్పులు ఉన్నాయా?" లాంటి ప్రశ్నలు మొదట అడుగుతాను. ఇవన్నీ శరీరానికి సంబంధించినవి. వీటితో పాటు- "ఏవైనా ప్రతికూల ఆలోచనలు వస్తున్నాయా"? "రాత్రి ఎలాంటి కలలు వస్తున్నాయి" లాంటి ప్రశ్నలు కూడా అడుగుతాను. ఇవి మానసిక స్థితికి సంబంధించినవి. ఈ రెండింటితో పాటుగా- "మీరు ప్రతి రోజూ ధ్యానం చేస్తారా?" లాంటి ప్రశ్నలకు సమాధానాలు రాబడతాను. ఇవి మన ఆధ్యాత్మిక స్థితికి సంబంధించినవి. ఈ మూడు సరిగ్గా ఉంటే ఆ మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడే! అయితే ఈ మూడు సంపూర్ణంగా ఉండే వారు అతి కొద్ది మంది మాత్రమే ఉంటారు. ఇలా సంపూర్ణమైన ఆరోగ్యం సాధించటానికి ఆయుర్వేదం మరో రెండు సూత్రాలు చెబుతుంది. మొదటిది 'దినచర్య'. రెండోది 'రుతుచర్య'. ఇవి రెండు ఒక దానిపై మరొకటి ఆధారపడి ఉంటాయి.

> **ఆయుర్వేదం మాంసాహారాన్ని తినవద్దని చెప్పదు. రుతువులకు తగినట్లుగా తినమని చెబుతుంది. ఉదాహరణకు శీతాకాలంలో చికెన్ ఎక్కువగా తినమని చెబుతారు. చేపలు, మటన్ తక్కువ తినమని చెబుతారు. వేసవిలో చేపలు ఎక్కువగా తినమని చెబుతారు.**

రెండూ ముఖ్యమే...

ఉదయం లేచిన తర్వాత ఎంత సేపు వ్యాయామం చేస్తున్నాం? ఎలాంటి ఆహార పదార్థాలు తింటున్నాం? ఎన్ని నీళ్లు తాగుతున్నాం? ఎంత సేపు నిద్ర పోతున్నాం?- ఇవన్నీ మన దినచర్యలో భాగాలు. మనం ఏ రుతువులో ఉన్నాం? ఆ రుతువులో ఎలాంటి పదార్థాలు తినాలి? లాంటివి రుతుచర్యలోకి వస్తాయి. ఒక వ్యక్తి శరీర లక్షణాలను గుర్తించిన తర్వాత-



పైన పేర్కొన్న 'దినచర్య', 'రుతుచర్య'లను సమన్వయం చేసుకొని, అవసరమైతేనే మందులను ఇవ్వాల్సి ఉంటుంది. మన ప్రాచీన ఆయుర్వేద గ్రంథాల ప్రకారం- మన శరీరానికి రుగ్మతలు ఒక రోజులో రావు. దాని వెనుక ఒక దీర్ఘకాలిక కారణం ఉంటుంది. ఒక రుతువులో తినే ఆహారపదార్థాలు, దినచర్య- ఆ తరువాతి రుతువులో కూడా ప్రభావం చూపిస్తాయి. ఉదాహరణకు శీతాకాలం తీసుకుందాం. శీతాకాలం చల్లగా ఉంటుంది.. ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా వస్తూ ఉంటాయి. దీనికి కారణం తేమ. శాస్త్ర ప్రకారం బయట ఉండే తేమ శరీర కణాలలోకి కూడా చేరుతుంది. ఎండకాలం వచ్చినప్పుడు ఈ తేమ శరీరంపై చర్మ వ్యాధుల రూపంలో బయటకు వస్తుంది. చాలామందికి వేసవిలో చర్మవ్యాధులు ఎక్కువగా వస్తాయి. దీనికి కారణం వేసవి కాలంలో 'దినచర్య' కాదు, శీతాకాలం నుంచి వెంటాడిన 'రుతుచర్య'.

ఈ కాలంలో పనికొస్తాయా?

ఆయుర్వేదం పురాతన శాస్త్రం కదా... ఈ ఆధునిక యుగంలో పనికొస్తుందా? ఆయుర్వేద మందులు పనిచేస్తాయా? అనే ప్రశ్నలు తరచూ ఉత్పన్నమవుతూ ఉంటాయి. ఆయుర్వేదంలో 'ఒకస్మాతియం' అనే సూత్రం ఉంటుంది. మన శరీరానికి పరిస్థితులకు అనుగుణంగా మారగలిగే తత్వం ఉందని దీని అర్థం. మన శరీరంలోని కణాలు పరిస్థితులకు తగిన రీతిలో మారుతూ ఉంటాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి 20 ఏళ్ల వరకు కేవలం శాకాహార భోజనమే చేశాడనుకుందాం. శరీరంలోని అవయవాలన్నీ ఆ ఆహారాన్ని జీర్ణం చేయటానికి, దాని నుంచి శక్తిని గ్రహించటానికి అలవాటు పడి ఉంటాయి. కొన్ని పరిస్థితుల వల్ల అతను మాంసాహారానికి మారాడనుకుందాం. అప్పుడు అతని శరీరంలోని అవయవాలన్నీ మాంసాహారానికి అలవాటు పడతాయి. ఇదే విధంగా ఆయుర్వేద సూత్రాలు అన్ని వాతావరణాలలోను, అన్ని పరిస్థితులలోను పనిచేస్తాయి. ఇక్కడ మనం ఇంకో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. ఆయుర్వేదం ప్రతి వ్యక్తి ఏడాదికి ఒకసారి తన శరీరాన్ని పునరుత్తేజితం చేయాలని సూచిస్తుంది. పునరుత్తేజం అంటే మన శరీరంలోని అన్ని భాగాలను శుద్ధి చేసుకోవటం. శాస్త్ర గ్రంథాల ప్రకారం- మానవ శరీరంలో అన్నమయ్య కోశం (జీర్ణ వ్యవస్థ), ప్రాణమయ కోశం (శ్వాస), మనోమయ కోశం (మానసిక స్థితిగతులు), విజ్ఞానమయ కోశం (మెదడు దాని సంబంధమైన చర్యలు), ఆనందమయ కోశం(ప్రాణశక్తి) ఉంటాయి. వీటిని ఏడాదికి ఒకసారి శుద్ధి చేసుకోవాలి. ఇలా శుద్ధి చేసుకుంటే శరీరంలో పేరుకుపోయిన మలినాలన్నీ తొలగిపోతాయి. ఏడాదిలో మిగిలిన సమయమంతా సంపూర్ణ ఆరోగ్యంతో గడపవచ్చు.

> **మన శరీరంలోని అవయవాలకు పునర్జీశక్తి ఉందని ఆయుర్వేదం నమ్ముతుంది. ఆయుర్వేదం ప్రకారం- ప్రకృతితో మమేకం అయి చికిత్స చేయించుకుంటే దీర్ఘకాలిక రోగాలు కూడా నయమవుతాయి.**



టీడీపీ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

'బొత్స' డ్రైవర్ బెదిరిస్తున్నాడు

- కృష్ణసాయి గ్రానైట్స్ పేరుతో దోపిడీ... టీడీపీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కారు డ్రైవర్ తమ భూములకు ఆన్‌లైన్‌లో పేర్లు మార్చి, బెదిరిస్తున్నాడని ఓ మహిళ వాపోయింది. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, కుడా చైర్మన్ సోమిరెడ్డి వెంకటేశ్వర్లు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా 'తమకు వారసత్వంగా సక్రమించిన భూమిని బొత్స కారు డ్రైవర్ అక్రమంగా కొట్టేసేందుకు ఆన్‌లైన్‌లో పేర్లు మార్పించి, తమనే బెదిరిస్తున్నాడని విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన మల్లాప్రగడ సరస్వతి వాపోయారు. ప్రభుత్వం తనకిచ్చిన భూమికి వీఆర్వో లంచం తీసుకుని, అక్రమంగా మరొకరికి పాస్‌పుస్తకాలు ఇచ్చాడని పల్నాడు జిల్లా రాజుపాలెం మండలానికి చెందిన నకినాల కృష్ణ ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలంలోని కృష్ణసాయి గ్రానైట్స్ పేరుతో జరుగుతున్న మైనింగ్ దోపిడీపై విచారణ జరిపి, వారు దోచుకున్న రూ.1,690కోట్లను రికవరీ చేయాలని ముప్పూరి రంగారావు విజ్ఞప్తి చేశారు. వైసీపీ నేతలతో అంటకాగుతున్న మున్సిపల్ అధికారులు తమ స్థలంలో నిర్మించుకున్న దుకాణాలను కూల్చివేశారని, కోర్టు ఆర్డర్ ఉన్నా పట్టించుకోలేదని అన్నమయ్య జిల్లా బీ కొత్తకోటకు చెందిన మోమీన్ వాపోయారు. తమకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కొందరు కబ్జా చేశారని బాపట్ల జిల్లా జంపనికి చెందిన కుమ్మరి సంఘ సభ్యులు వాపోయారు.దివ్యాంగురాలినైన తన భూమిని దొంగ పత్రాలతో కబ్జా చేశారని అన్నమయ్య జిల్లా టీ సుండుపల్లికి చెందిన షేక్ షహీరా వాపోయారు.

నేడు ఢిల్లీకి చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సాయంత్రం 5:30కు అమరావతి నుంచి బయలుదేరి ఢిల్లీకి వెళుతున్నారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. దివంగత మాజీ ప్రధాని వాజపేయి 100వ జయంతి సందర్భంగా బుధవారం ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. తర్వాత కేంద్ర ప్రభుత్వ పెద్దలతో భేటీ అవుతారు. బుధవారం రాత్రి అమరావతికి తిరిగి వస్తారు.

నాసిరకం బొగ్గుతో అరబిందో దోపిడీ

- వైసీపీ హయాంలో నాలుగున్నర లక్షల టన్నుల సరఫరా
- దాని విలువ రూ. 382 కోట్లు : సోమిరెడ్డి

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థ జెన్‌కోకు నాసిరకం బొగ్గు సరఫరా చేసి అరబిందో సంస్థ భారీగా దోచుకుందని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆ నాసిరకం బొగ్గు వల్ల విద్యుత్ ఉత్పత్తి తగ్గి చివరకు భారీ రేట్లకు బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనాల్సి వచ్చిందన్నారు. ఈ భారం వినియోగదారులపై పడిందని చెప్పారు. సోమిరెడ్డి సోమవారం ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. "వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయసాయిరెడ్డి బృందం అవినీతి కార్యకలాపాలతో చెలరేగిపోయింది. జేబులు నింపుకోవడానికి నాటి సీఎం జగన్ కూడా రాష్ట్రాన్ని ఆ ముఠాకు రాసిచ్చారు. మట్టి కలసిన నాలుగున్నర లక్షల టన్నుల పరమ నాసిరకం బొగ్గును అరబిందో సంస్థకు అనుబంధంగా ఉన్న ట్రైడెంట్ నాలెడ్జ్ కంపెనీ జెన్‌కోకు సరఫరా చేసింది. దీని విలువ రూ. 382 కోట్లు. ఈ నాసిరకం బొగ్గు వల్ల నెల్లూరు జిల్లాలోని థర్మల్ విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నలభై శాతానికి పడిపోయింది. ఈ బొగ్గు వ్యవహారంపై 2022లోనే జెన్‌కో ఉద్యోగులు, మేము ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేశాం. దీంతో ఆ బొగ్గులో లక్ష టన్నులు డంపింగ్ యార్డులో పారబోశారు. ఇదే సమయంలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరగడంతో బహిరంగ మార్కెట్‌లో యూనిట్‌ను రూ. 10 నుంచి రూ. 14 వరకు కొన్నారు. ఈ భారం రూ. 700 కోట్లు తర్వాత వినియోగదారులపై పడింది. దీనికి విజయసాయిరెడ్డి ముఠా కుంభకోణాలే కారణం. కూటమి ప్రభుత్వం వచ్చాక నాణ్యమైన బొగ్గు రాకతో విద్యుత్ ఉత్పత్తి పెరిగింది. వైసీపీ హయాంలోని కుంభకోణంలో ఉన్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలి. 2019-24 మధ్య కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రం కోసం జెన్‌కో ఎంత బొగ్గు కొనుగోలు చేసింది? విద్యుత్ తక్కువ ఉత్పత్తికి కారణం ఏమిటి? ఏ కారణంతో విదేశీ బొగ్గును తిరస్కరించారు? నాసిరకం బొగ్గును సరఫరా చేసిన కంపెనీకి ఎంత జరిమానా విధించారు? ఆ కంపెనీపై కేసులు ఎందుకు పెట్టలేదు? వీటన్నిటినీ తేల్చడానికి సీబీడీ, విజిలెన్స్ విభాగాలు దర్యాప్తు చేయాలి" అని డిమాండ్ చేశారు.

పర్యాటకంలో ఏపీని అగ్రస్థానంలో నిలుపుతాం

- ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని.. కొత్త పాలసీకి బోర్డు ఆమోదం

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి అహర్నిశలు కృషి చేసి, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. పర్యాటకాభివృద్ధి కోసం కొత్త బోర్డు కృషి చేస్తుందని పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని ఏపీటీడీసీ కార్యాలయంలో బోర్డు సమావేశం జరిగింది. కొత్త టూరిజం పాలసీతో పాటు పలు కీలక తీర్మానాలను బోర్డు ఆమోదించింది. ఏపీలో పర్యాటకాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు చేస్తున్న కృషికి సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కొత్త టూరిజం పాలసీ 2024-29 అభివృద్ధిదాయకంగా, వినూత్నంగా ఉందన్నారు. దీని ద్వారా పర్యాటక రంగం కొత్త పుంతలు తొక్కుతుందని అభిప్రాయపడ్డారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పర్యాటకాభివృద్ధికి కృషి చేస్తామని తీర్మానించారు. ముఖ్యంగా బీచ్ కారిడార్ అభివృద్ధి, టెంపుల్ సర్క్యూట్స్, అడ్వెంచర్ టూరిజం, జీడీపీ పెంపు, ఉపాధి కల్పన, పర్యాటకులకు రూమ్స్ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామని బోర్డు సభ్యులు తీర్మానం చేశారు. బోర్డు సమావేశంలో ఎండీ ఆమ్రపాలి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై సానుకూలంగా కేంద్రం

- కార్మికులు ఆందోళన చెందవద్దు: రామ్మోహన్ నాయుడు

విశాఖపట్నం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'విశాఖపట్నం స్టీల్ ప్లాంటుపై కేంద్రం సానుకూలంగా ఉంది. కార్మికులు ఆందోళన చెందవద్దు' అని కేంద్ర పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అన్నారు. సోమవారం అక్కయ్యపాలెంలోని సాగరమాల కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన రోజ్‌గార్ మేళాలో పాల్గొని ఆయన ప్రసంగించారు. 'ఉక్కు కర్మాగారాన్ని ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలనే అంశంపై కేంద్రం పరిశీలన చేస్తోంది. డబుల్ ఇంజన్ ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రంలో రైల్వే జోన్ కార్యరూపం దాలుస్తోంది. 2026 జూన్ నాటికి భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి అవుతుంది. సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ ప్రయత్నాల వల్లే విశాఖకు టీసీఎస్, గూగుల్‌తో పాటు మళ్లీ లూలు వచ్చింది' అని అన్నారు. సమావేశంలో ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, విశాఖ పోర్టు సెక్రటరీ వేణుగోపాల్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'సాగరమాల'లో రోజ్‌గార్ మేళా



విశాఖలోని సాగరమాల ఆడిటోరియంలో సోమవారం రోజ్‌గార్ మేళా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎంపీ ఎం శ్రీభరత్, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులకు నియామక పత్రాలను అందజేసిన మంత్రి... ఏపీ అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

- అక్కయ్యపాలెం(విశాఖపట్నం), ఆంధ్రజ్యోతి

కడప కార్పొరేషన్‌లో కుర్చీ కోసం కొట్లాట

కడప, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం మరోసారి రచ్చరచ్చ అయింది. కార్పొరేషన్ వేదికపై మేయరు సురేశ్‌బాబు పక్కనే సీటు కేటాయించాలంటూ ఎమ్మెల్యే మాధవి, ఆమె మద్దతుదారులైన కార్పొరేటర్లు నిరసనకు దిగారు. గత భేటీ మాదిరిగా ఈసారి కూడా వేదికపై మేయరు కుర్చీ మాత్రమే ఏర్పాటు చేశారు. దీంతో కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తొలుత తన కుర్చీ కథ తేల్చిన తర్వాతే సమావేశం మొదలుపెట్టాలని పట్టుబట్టారు. ఇటీవలే వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 8 మంది కార్పొరేటర్లు కూడా ఆమెకు మద్దతుగా నిల్చారు. మేయరుకు మద్దతుగా వైసీపీ కార్పొరేటర్లు పోడియం వద్దకు వచ్చి నినాదాలు చేశారు. ఎమ్మెల్యేకు మద్దతుగా కార్పొరేటర్లు.. 'అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా, మహిళలంటే చిన్నచూపా' అనే ప్లకార్డులను ప్రదర్శించారు. మాధవికి మద్దతుగా ఉన్న కార్పొరేటర్లు ముక్కెర సుబ్బారెడ్డి, మానస, నాగేంద్ర, ఎ. లక్ష్మీశ్రీదేవి, కె. సూర్యనారాయణ, జఫ్రుల్లా, చల్లా స్వప్న, కట్టమీద అరుణలను మేయరు సస్పెండ్ చేశారు. సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. తిరిగి 3 గంటలకు మేయరు, కార్పొరేటర్లు వచ్చారు. అప్పటికే వేదికపై నిలబడి ఉన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "మేయరు, కార్పొరేటర్లకేమో చికెన్ ముక్కలు, బిరియాని.. పోలీసులకు, పాత్రికేయులకు పప్పన్నం పెడతారా?" అని మండిపడ్డారు. చివరకు అజెండాలో పొందుపరిచిన 52 అంశాలకు కార్పొరేటర్లంతా ఏకగ్రీవంగా ఆమోదించారంటూ తీర్మానం చేసి మేయరు సమావేశం ముగించారు.



కడప కార్పొరేషన్ మేయర్ సురేశ్‌బాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎక్స్ అఫిషియో సభ్యురాలు, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి

ఉత్తరాఖండ్ హైకోర్టు సీజేగా జస్టిస్ నరేందర్

- కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ



నరేందర్

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ జి.నరేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ కార్యదర్శి సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుతం ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న ఆయనను పదోన్నతిపై ఉత్తరాఖండ్ హైకోర్టు సీజేగా నియమించాలని సెప్టెంబరులో అప్పటి సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. దీనికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలపడంతో కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. జస్టిస్ నరేందర్ 1964 జనవరి 10న తమిళనాడులో జన్మించారు. బీఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసి 1989 ఆగస్టు 23న తమిళనాడు బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. 1992 వరకు మద్రాసు హైకోర్టులో ప్రాక్టీస్ చేసి, 1993లో కర్ణాటకకు మార్చుకొని బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేయించుకున్నారు. ఓబీసీ వర్గానికి చెందిన ఆయన 2015 జనవరి 2న కర్ణాటక హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2017లో శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 2023 అక్టోబరులో ఏపీ హైకోర్టుకు బదిలీపై వచ్చారు.

హైకోర్టులో సెమీ క్రిస్మస్ వేడుకలు

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ చైర్మన్ కె.చిదంబరం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్.. న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ సుమతి, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏఏజీ సాంబశివ ప్రతాప్, పీపీ ఎం లక్ష్మీనారాయణ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్.రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. మరోవైపు హైకోర్టు ముందు న్యాయవాదులు ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ వద్ద చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తులు కేక్ కట్ చేశారు.

ఆర్థిక ఇబ్బందులు చూస్తే బాధేస్తోంది



సెమీ క్రిస్మస్ వేడుకలలో సీఎం చంద్రబాబు, ఉండవల్లి శ్రీదేవి, ఫరూక్, సవిత, కేశినేని చిన్ని, తదితరులు

- ఐదేళ్ల విధ్వంసానికి పరిష్కారం దొరకట్లేదు
- మైనారిటీలు, పేదలకు అండగా ఉంటా
- సెమీ క్రిస్మస్ వేడుకలలో సీఎం చంద్రబాబు

విజయవాడ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మైనారిటీ వర్గాలకు తానెప్పుడూ అండగా ఉంటానని, వారి సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లు జరిగిన చెడును ఆలోచించి మళ్లీ అది జరగకుండా ముందుకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పేదల పట్ల, ధర్మాన్ని నమ్మినవారి పట్ల దేవుడు ఎల్లప్పుడూ అండగా ఉంటాడని, మళ్లీ మంచి రోజులు వచ్చాయని, మీ అందరికీ అనుక్షణం అండగా ఉంటానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ ఏ1 కన్వెన్షన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి పాల్గొన్నారు. లోక రక్షకుడైన ప్రభువు కరుణ, కటాక్షాలు ఉండాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చంద్రబాబు అన్నారు. ప్రేమ, కరుణ, సేవకు ప్రతీక క్రైస్తవమన్నారు. ఎన్టీఆర్ మిషనరీ కాలేజీలో చదువుకున్నారని గుర్తుచేసుకున్నారు. పశువుల పాకలో పుట్టి, గొర్రెల కాపరిగా పెరిగి నిరాడంబరతను చాటుకున్న ప్రజా రక్షకుడు ఏసు అని అన్నారు. నమ్మిన వారి కోసం బలిదానాలకు సైతం వెనుకాడని క్రీస్తు గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ ఉత్తేజంగా తీసుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తానెప్పుడొచ్చినా స్ఫూర్తిదాయక సందేశాన్ని పొందుతుంటానన్నారు. 'సంక్షేమ కార్యక్రమాలు ఏ విధంగా చేయాలన్న దానిపై ముందుకు వెళుతుంటే ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. నేను నాలుగోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నాను. మూడుసార్లు కష్టం అనిపించలేదు. ఇప్పుడు చాలా కష్టమనిపిస్తోంది. ఆర్థిక ఇబ్బందులు చూస్తే బాధేస్తోంది. ఈ ఆరు నెలల నుంచి రాత్రింబవళ్లు ఆలోచిస్తున్నా, పట్టుదలతో ప్రయత్నిస్తున్నా దారి దొరకలేదంటే ఐదేళ్ల ఎంత విధ్వంసం జరిగిందో ఆలోచించాలి. ఆర్థిక ఇబ్బందులున్నా పాస్టర్లకు పెట్టిన గౌరవ వేతనాన్ని చెల్లించాలని సంతకం చేశాను. క్రైస్తవ మిషనరీల కోసం ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలని, చర్చిల నిర్మాణం, పునర్నిర్మాణం కోసం ప్రతిపాదనలు వస్తున్నాయి. రానున్న రోజులలో సాధ్యమైనంత మేరకు పూర్తి చేస్తాం' అని అన్నారు.


శాంతిమార్గాన్ని అనుసరించాలి

'ప్రతి ఒక్కరూ శాంతిమార్గాన్ని అనుసరించాలి. ప్రేమ తత్వాన్ని పెంచుకోవాలి. ఈర్ష్యాద్వేషాలను పారదోలాలి. అబద్ధం, లంచాల వంటి పాపాలకు దూరంగా ఉండాలి. ఈ డిసెంబరులో ప్రపంచ వ్యాప్తంగా జరుపుకొనే అతి పెద్ద పండుగ క్రిస్మస్. నేను మొదటిసారి సమైక్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ప్రభుత్వం తరఫున సెమీక్రిస్మస్ కార్యక్రమాన్ని జరపాలని నిర్ణయించాం. గుంటూరులో క్రైస్తవ భవన్ కోసం 2 ఎకరాలు కేటాయించటంతో పాటు నిర్మాణం కోసం రూ.10 కోట్లు ఖర్చు చేశాం. త్వరలోనే దానిని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం. విజయవాడలోనే సెయింట్ బసిలికా చర్చికి రూ.1.5 కోట్లు ఇచ్చాం. జెరూసలేం వెళ్లే వారికి ఆర్థిక సాయం ప్రవేశపెట్టిన పార్టీ టీడీపీ. క్రైస్తవ విద్యార్థుల కోసం ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌లు వంటివి అందించాం. గత ఐదు సంవత్సరాలలో క్రిస్టియన్ ఎయిడెడ్ సంస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారు' అని అన్నారు. ఈ సందర్భంగా ఆంగ్లంలో 'భగవంతుడు నిన్ను ఎప్పుడూ ఖాళీగా వదిలిపెట్టడు. నీవు కోల్పోయిన ప్రతి ఒక్కదానిని తిరిగి నీకిస్తాడు. ఆటు పోట్లను ఎదుర్కొన్నపుడు.. నిన్ను మళ్లీ పైకి తీసుకువచ్చేందుకు సహాయం అందిస్తాడు' అని పేర్కొన్నారు.

స్ఫూర్తిదాయక ఆలోచనలు చేద్దాం

'డిసెంబరు నుంచి జనవరి 15 వరకు నెల రోజుల పాటు చేసుకునే ఏకైక పండుగ క్రిస్మస్. క్రిస్మస్ సందర్భంగా స్ఫూర్తిదాయక ఆలోచనలు చేద్దాం. ఏసు ప్రభువు ఆలోచనలను ముందుకు తీసుకువెళదాం. వ్యక్తిగతంగా నేను అండగా ఉంటాను. పేదరికం ఎక్కడ ఉంటే అక్కడ నేను ఉంటాను' అని చంద్రబాబు అన్నారు.క్రిస్మస్ కేకును కట్ చేసి క్రైస్తవ మతపెద్దలకు తినిపించారు. వారు కూడా ఆయనకు కేకు తినిపించారు. అనంతరం క్యాండిల్స్ చేత పట్టారు. రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూఖ్ మాట్లాడుతూ... గత ఐదేళ్లు రాష్ట్రాన్ని గజనీ మహమ్మద్ కంటే ఎక్కువగా దోపిడీ చేశారని, ఏమీ మిగలలేదన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. పదిమందికి నీకున్న దానిని పంచి, కలిసి అందరూ ఆనందాన్ని అనుభవించటమన్నది క్రీస్తు సిద్ధాంతమన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ... క్రైస్తవులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.150 కోట్ల నిధులు ఇచ్చినట్టు చెప్పారు. కొడాలి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, మతపెద్దలు పాల్గొన్నారు.

ఢిల్లీలో గణతంత్ర పరేడ్‌కు ఏటికొప్పాక శకటం



దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవంలో పాల్గొననున్న ఆంధ్రప్రదేశ్ శకటం నమూనాను అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం ఏటికొప్పాకకు చెందిన హస్త కళాకారులు రూపొందించారు. ఐఅండ్‌పీఆర్ అధికారుల సూచనలతో నమూనా శకటం తయారుచేసినట్టు కళాకారుడు గొర్సా సంతోష్ సోమవారం తెలిపారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఈ శకటానికి రూపకల్పన చేసినట్టు చెప్పారు.

- ఎలమంచిలి, ఆంధ్రజ్యోతి

మరో 2,723 కోట్ల పనులు!

- రాజధానిలో జోన్ 7, 10 లేఅవుట్లలో రోడ్ల నిర్మాణం
- సీఆర్డీఏ అథారిటీ ఆమోదం



సీఆర్‌డీఏ సమావేశంలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, ఉన్నతాధికారులు

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రూ.2,723 కోట్లతో ఎల్‌పీఎస్ జోన్-7, జోన్-10 లేఅవుట్ల రోడ్ల నిర్మాణ పనులు, మౌలిక వసతులు కల్పించేందుకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపింది. దీంతో ఇప్పటి వరకు రాజధాని అభివృద్ధికి సంబంధించి రూ.47,288 కోట్ల విలువైన పనులకు ఆమోదముద్ర వేసినట్లయింది. సోమవారమిక్కడ రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన అథారిటీ 44వ సమావేశం జరిగింది. అమరావతి అభివృద్ధి పనులు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆ తర్వాత మీడియాకు తెలిపారు. మిగిలిన పనుల్లో మరి కొన్నింటికి ఈ నెలాఖరులోపు, ఇంకా మిగిలే పనులకు వచ్చే నెలలో ఆమోదం తీసుకుని.. వచ్చే నెల 15వ తేదీలోపు అన్ని పనులకూ టెండర్లు పిలుస్తామన్నారు. వెంటనే పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. రాజధాని అమరావతి అభివృద్ధికి చేసే ఖర్చు భారాన్ని ప్రజలపై ఒక్క పైసా కూడా వేయబోమన్నారు. భూసమీకరణ ద్వారా రైతుల నుంచి సేకరించిన భూముల అమ్మకం, సంపద సృష్టితో వచ్చే సొమ్ముతోనే.. అమరావతి నిర్మాణానికి తీసుకునే రుణాలను తీర్చుతామని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావు లేదని.. దీనిపై ఎవరు విమర్శలు చేసినా ప్రజలు నమ్మవద్దని కోరారు. వైసీపీ నేతలకు ఇంకా అమరావతిపై కక్ష తీరనందునే సొంత పత్రికలో విష ప్రచారం సాగిస్తున్నారని, రాజధాని నిర్మాణానికి రుణం ఇవ్వొద్దని వరల్డ్ బ్యాంక్‌కు లేఖలు రాశారని మండిపడ్డారు. చరిత్రలో లేనంత వరద ఇటీవల వచ్చినా అమరావతికి ఇబ్బంది రాలేదని.. వరదలను తట్టుకునేలా రాజధాని నిర్మాణం జరుగుతుందని తెలిపారు.

కేంద్ర సంస్థలను సమానంగా పంచాం

రాష్ట్రంలోని 26 జిల్లాల సమగ్రాభివృద్ధికి 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టిందని మంత్రి నారాయణ గుర్తుచేశారు. పునర్విభజనలో ఏపీకి వచ్చిన కేంద్ర సంస్థలను అన్ని జిల్లాలకు సమానంగా కేటాయించామని చెప్పారు. విజయనగరం జిల్లాకు గిరిజన విశ్వవిద్యాలయం, విశాఖ జిల్లాకు ఐఐఎం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ, కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్, తాడేపల్లిగూడెంలో నిట్, మంగళగిరికి ఎయిమ్స్, విజయవాడలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, తిరుపతిలో ఐఐటీ, ఐజర్, కర్నూలులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్, అనంతపురానికి సెంట్రల్ యూనివర్సిటీ కేటాయించినట్లు చెప్పారు. విశాఖలో టీసీఎస్, గూగుల్‌తో పాటు గత ప్రభుత్వం తరిమేసిన లులూను మళ్లీ తీసుకొస్తున్నామని, కర్నూలులో 350 ఎకరాల్లో డ్రోన్ హబ్ ఏర్పాటు చేస్తామని, రాయలసీమ జిల్లాల్లో మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోర్టులు అభివృద్ధి చేస్తామని, పోర్టు అభివృద్ధి అయ్యే ప్రతి చోటా అమరావతి తరహాలో ల్యాండ్ పూలింగ్ ద్వారా శాటిలైట్ సిటీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

జూన్‌లోగా 1.18 లక్షల టిడ్కో గృహాల పూర్తి

వచ్చే ఏడాది జూన్ 12కల్లా 1.18 లక్షల టిడ్కో గృహాలను పూర్తి చేసి, ప్రారంభిస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. ఇప్పటికే బ్యాంకు రుణాలు తీసుకుని, నిరర్థకంగా మిగిలిపోయిన ఇళ్లను పూర్తి చేయడానికి రూ.102 కోట్లు చెల్లించేందుకు సీఎం ఆమోదం తెలిపారని వెల్లడించారు. 'గత ప్రభుత్వంలో టిడ్కో గృహాల వ్యవహారం గందరగోళంగా మారింది. లబ్ధిదారులకు మంజూరు చేసిన గృహాలపై వైసీపీ ప్రభుత్వం బ్యాంకు రుణాలు తీసుకుని, ఆ సొమ్మును దారి మళ్లించింది. ఈ సమస్య పరిష్కారానికి రూ.102 కోట్లు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు' అని మంత్రి చెప్పారు.

మున్సిపాలిటీలకు.. ఏప్రిల్ నుంచి నేరుగా నిధులు

- 5 అంతస్తుల వరకు అనుమతులు అక్కర్లేదు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి నిర్మాణాలు
- వర్క్‌షాపులో మంత్రి నారాయణ వెల్లడి

పెదకాకాని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని.. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి సీఎఫ్ఎంఎస్‌తో పని లేకుండా నేరుగా మున్సిపాలిటీలకే బిల్లులు చెల్లించేలా నిధులు కేటాయిస్తామని పురపాలక మంత్రి పి.నారాయణ తెలిపారు. ప్రస్తుతం మున్సిపల్ శాఖ ఖజానా పూర్తిగా ఖాళీ అయిందన్నారు. సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్ల రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో ప్రతి కుటుంబానికి రోజుకు 135 లీటర్ల మంచి నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. వీలైనంత త్వరగా డీపీఆర్, టెండర్లు పూర్తి చేస్తామని తెలిపారు. భవన నిర్మాణానికి ఐదు అంతస్తుల వరకు ఎటువంటి అనుమతులు అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి నిర్మాణాలు చేసుకోవచ్చని తెలిపారు. టౌన్‌ప్లానింగ్ విభాగంపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని.. ఈ నేపథ్యంలో దానితో సంబంధం లేకుండా.. లేఅవుట్, భవనాల నిర్మాణం కోసం మున్సిపాలిటికీ డబ్బు చెల్లిస్తే అన్ని అనుమతులూ మంజూరు చేస్తారని చెప్పారు. వేరే శాఖల అనుమతులు అవసరం లేదని, అన్ని శాఖలనూ మున్సిపాలిటీతో అనుసంధానం చేస్తున్నామన్నారు.

'ఆరోగ్యానికి' దిక్కెవరు బాస్!

- 8 మంది ఉండాల్సిన చోట ముగ్గురు ఐఏఎస్‌లు
- కీలక విభాగాలకు ఇన్‌చార్జి అధికారులే దిక్కు
- వైద్య ఆరోగ్యశాఖలో విధులపై తీవ్ర ఒత్తిడి
- క్షేత్రస్థాయి పర్యటనలకు ఆ ఐఏఎస్‌లు దూరం
- సచివాలయాల్లోనే ఎక్కువగా గడిపేస్తున్న వైనం

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం ఉన్నంత కాలం ఆరోగ్యశాఖలో రెగ్యులర్ ఐఏఎస్‌లను నియమించలేదు. ఇన్‌చార్జిలతోనే విభాగాలను నడిపించేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చింది. మరి.ఆరోగ్యశాఖ ఏమైనా మారిందా అంటే.. ఇన్‌చార్జిల పాలనలోనే ఇప్పటికీ కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఆరోగ్యశాఖను నడిపించేది ఎనిమిదిమంది ఐఏఎస్‌లు, ఒక ఐపీఎస్ అధికారి. ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సర్వీసెస్ సెక్రటరీ, ఆరోగ్యశాఖ కమిషనర్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో, ఆయుష్ కమిషనర్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, సెకండరీ హెల్త్ కమిషనర్ పోస్టుల్లో ఐఏఎస్‌లు ఉండాలి. ఔషధ నియంత్రణ మండలి డీజీగా సీనియర్ ఐపీఎస్ అధికారిని నియమించాలి. ఆంధ్రప్రదేశ్ హెల్త్ హ్యూమన్ రిసోర్సెస్ విభాగానికి ఐఏఎస్ ఉండాలి. కానీ ప్రస్తుతం ఆరోగ్యశాఖలో ముగ్గురు ఐఏఎస్‌లు, ఒక ఐఆర్ఎస్ అధికారి ఉన్నారు. ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్‌గా ఎంటీ కృష్ణబాబు ఉండగా, కమిషనర్‌గా వాకాటి కరుణ, సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా డా.ఎ.సిరి విధులు నిర్వహిస్తున్నారు. సర్వీసెస్ సెక్రటరీగా ఐఆర్ఎస్ అధికారిణి మంజుల హోస్మనీ కొనసాగుతున్నారు. మిగిలిన విభాగాలు ఇన్‌చార్జులతో నడుస్తున్నాయి. ఔషధ నియంత్రణ మండలి డీజీ పోస్టు భర్తీ మరిచిపోయారు.

గందరగోళం... అస్తవ్యస్తం..

సర్వీసెస్ సెక్రటరీగా ఉన్న మంజుల హోస్మనీ అదనంగా ఆయుష్ కమిషనర్, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవోగా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా ఉన్న డా.ఎ.సిరి..ఏపీఎంఎస్ఐడీసీ ఎండీగా, ఔషధ నియంత్రణ మండలి డీజీగా, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీతో పాటు మరికొన్ని అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇలా.. ఒకే అధికారిణికి నాలుగైదు విభాగాలను అప్పగించడం వల్ల పరిపాలన గాడి తప్పుతోందన్న అభిప్రాయం ఆరోగ్యశాఖ వర్గాల్లోనే వ్యక్తం అవుతోంది. ఇన్‌చార్జి పోస్టుల వల్ల వారి రెగ్యులర్ విభాగాలపై అధికారులకు పట్టు తప్పుతుండటమే దీనికి కారణమని చెబుతున్నాయి. పైగా నిత్యం మీటింగ్‌ల పేరుతో సచివాలయంలోనే ఉంటున్నారు. కనీసం వారి హెచ్ఓడీ కార్యాలయాల్లో కూడా అందుబాటులో ఉండడం లేదు. క్షేత్రస్థాయి పర్యటనల ఊసే లేదు. ఆరోగ్యశాఖలో అధికారులు నిత్యం క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తేనే ఆస్పత్రుల్లో సమస్యలు తెలుస్తాయి. రోగుల ఇబ్బందులు వారి దృష్టికి వచ్చి సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుంది. కానీ ఆరోగ్యశాఖలో ఉన్న ముగ్గురు ఐఏఎస్‌లూ ఏదో ఒక మీటింగ్ పేరుతో సచివాలయంలోనే ఉంటున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో సమస్యలు ఎక్కడివక్కడ తిష్ట వేసుకున్నాయి. ఎక్కువ విభాగాలకు ఇన్‌చార్జిలుగా ఉండాల్సి రావడంతో వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఖాళీ పోస్టుల్లో రెగ్యులర్ ఐఏఎస్‌లను నియమించాల్సిన అవసరం ఉన్నదని ఆరోగ్యశాఖ వర్గాలు అంటున్నాయి.



మౌలిక వసతులు ఏవీ?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగు విడతల్లో 52,318 టిడ్కో ఇళ్లు మంజూరు చేశారు. 30,672 ఇళ్ల నిర్మాణాలు 85-90 శాతం పూర్తయ్యాయి. చాలా వరకు గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్న సమయంలో.. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో ఆగిపోయాయి. ఆ ఇళ్ల గోడలకు వైసీపీ రంగులు వేసి వదిలేశారు. కర్నూలు జిల్లాలో 16,595 ఇళ్లు పూర్తయ్యాయి. అందులో 5,616 లబ్ధిదారులకు అప్పగించగా.. 150 ఇళ్లలో కూడా లబ్ధిదారులు చేరలేదు. తాగునీరు, రోడ్లు వంటి కనీస మౌలిక వసతులను వైసీపీ ప్రభుత్వం కల్పించకపోవడమే కారణం. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పలు ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ముళ్ల కంప పొదలు పెరిగి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి.

కర్నూలు నగర శివారు జగన్నాథగట్టుపై అసంపూర్తిగా టిడ్కో గృహాలు, ధ్వంసమైన ఇంటి కిటికీ



(మొదటి పేజీ తరువాయి)

పేదలకు శాపంగా మారింది. టిడ్కో ఇళ్లు పంపిణీ చేస్తే చంద్రబాబుకు మంచి పేరు వస్తుందనే రాజకీయ దురుద్దేశంతో నిర్మాణాలను ఆపేసింది. కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. మూడేళ్లపాటు వాటి గురించి పట్టించుకోలేదు. ఇళ్లు పూర్తి చేసి తమకు అప్పగించాలని లబ్ధిదారులు మొరపెట్టుకున్నా వినలేదు. అయితే ఎన్నికల ముందు టిడ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని జగన్ సర్కారు ఉత్తుత్తి హడావుడి చేసింది. అది కూడా పేరుకు అతి కొద్ది నిర్మాణాలను పూర్తి చేసింది. వాటికి వైసీపీ రంగులేసి వదిలేసింది. తాగునీరు, రోడ్లు వంటి కనీస వసతులు కూడా కల్పించలేదు. దీంతో ఆ ఇళ్లలో లబ్ధిదారులు ఉండలేని పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వం నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో చాలా వరకు టిడ్కో ఇళ్ల సముదాయాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. సంరక్షణ లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. చాలా ప్రాంతాల్లో ముళ్ల పొదలు పెరిగాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. ఇటీవలి ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో లబ్ధిదారుల ఆశలు మళ్లీ చిగురించాయి. ఇప్పటికైనా టిడ్కో ఇళ్లు పూర్తి చేసి తమకు అప్పగించాలని కోరుతున్నారు. నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. పలు ప్రాంతాల్లో పట్టణాలకు దూరంగా ఇళ్ల సముదాయాలు ఉండడంతో రవాణా, మార్కెట్, పాఠశాలలు, రేషన్ సరఫరా తదితర సౌకర్యాలు కల్పించాలి.

పేదల గూడుకు జగన్ గ్రహణం

40 కోట్ల బిల్లులు పెండింగ్



అనంతపురం అర్బన్‌లో శిథిలావస్థలో టిడ్కో గృహ సముదాయం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడ్కో ఇళ్ల సముదాయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చాలా ప్రాంతాల్లో ముళ్ల పొదలు పెరిగాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో 50,914 ఇళ్ల నిర్మాణం చేపట్టింది. అప్పట్లోనే 70 శాతం నిర్మాణ పనులను పూర్తి చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం 34,642 టిడ్కో ఇళ్లను రద్దు చేసింది. కేవలం 16,272 మందికి ఇళ్లు కట్టిస్తామని ప్రకటించింది. అవి కూడా పూర్తి చేయలేదు. తాడిపత్రి పరిధిలో 5,184 ఇళ్లకు గానూ 370 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించింది. కాంట్రాక్టర్లకు రూ.40 కోట్లకుపైగా బిల్లులను పెండింగ్ పెట్టింది. దీంతో ఇళ్ల నిర్మాణాన్ని ఆపేశారు.

జగన్ సొంత జిల్లాలోనూ...



కడప జిల్లా జమ్మలమడుగులో దుస్థితి

మాజీ సీఎం జగన్ సొంత జిల్లా కడపలోనూ టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మాణాలు దాదాపు పూర్తయినా మౌలిక వసతులు లేవు. కడపలో 992 ఇళ్లు, ఎర్రగుంట్లలో 1584 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. రోడ్లు, డ్రైనేజీ, గృహాల నుంచి మురుగునీరు సరఫరా అయ్యే కాల్వలు, విద్యుత్ ఇతర మౌలిక వసతులు లేవు. జమ్మలమడుగులో 1440 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా ఫ్లోరింగ్, ఇతరత్రా పనులు నిలిచిపోయాయి. విద్యుత్ లైన్లు లేవు. ప్రాంగణమంతా ముళ్లపొదలతో నిండిపోయింది. కడపలో మౌలిక వసతుల కోసం 2022లో జగన్ ప్రభుత్వంలో రూ.11.49 కోట్లతో టెండర్లు పిలిచినా పనులు పూర్తి చేయలేదు.

అసంపూర్తిగానే...



విశాఖ నగర పరిధిలోని బక్కన్నపాలెంలో నిర్మాణ దశలో ఉన్న టిడ్కో ఇళ్లు.. చుట్టూ పెరిగిపోయిన పొదలు

గత టీడీపీ ప్రభుత్వంలో గ్రేటర్ విశాఖ పరిధిలో 31 లేఅవుట్లలో 24,192 టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించింది. వాటిలో దాదాపు 4 వేల ఇళ్ల నిర్మాణం పూర్తికావడంతో 2019 ఎన్నికలకు ముందు అర్హులైన లబ్ధిదారులకు లాటరీ ద్వారా కేటాయించింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ ఇళ్ల కేటాయింపులను రద్దు చేసింది. కొత్తగా దరఖాస్తులు స్వీకరించింది. 30,083 మందిని అర్హులుగా గుర్తించింది. కానీ 24,192 ఇళ్లు మాత్రమే అందుబాటులో ఉండడంతో 24,192 మందికి లాటరీ ద్వారా కేటాయించింది. 2024 ఎన్నికలు సమీపించేసరికి ఆగమేఘాల మీద చివరి దశలో నిలిచిపోయిన భవనాలకు తుది మెరుగులు దిద్ది 7,456 ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు అప్పగించారు.

అతీగతీ లేదు

శ్రీకాకుళం జిల్లాలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు అతీగతీ లేదు. శ్రీకాకుళం అర్బన్ ప్రజల కోసం పాత్రునివలస వద్ద నిర్మించిన 1,280 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించలేదు. 500 మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్లలో నివాసం ఉంటున్నారు. రెండో ఫేజ్ కింద ఇక్కడ నిర్మాణం చేపట్టిన 624 ఇళ్లు 80 శాతం పూర్తయ్యాయి. ఆమదాలవలసలో 528, ఇచ్ఛాపురంలో 192, పలాసలో 912 ఇళ్ల నిర్మాణాలు 70 శాతం మేర పూర్తయ్యాయి. ఇదంతా 2019లోనే జరిగింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం ఏర్పడటంతో నిర్లక్ష్యంగా వ్యవహరించింది.

ఇళ్లూ లేవు... సొమ్మూ లేదు



పార్వతీపురం అడ్డాపుశీల ప్రాంతంలో మౌలిక వసతులు లేని పరిస్థితి

పార్వతీపురం మన్యం జిల్లాలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేరలేదు. పార్వతీపురం పురపాలక సంఘానికి చెందిన 336 మంది టిడ్కో ఇళ్ల కోసం సుమారు రూ.కోటి 75 లక్షలు చెల్లించారు. వైసీపీ సర్కారు నిర్వాకంతో వారికి ఇళ్లు అప్పగించకపోగా.. కట్టిన డబ్బులు కూడా తిరిగి చెల్లించలేదు. దీంతో వారు చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాలూరు పట్టణంలో టిడ్కో గృహ సముదాయాల్లో విద్యుత్, తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు అక్కడ ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. అత్యధికులు గృహ ప్రవేశాలు కూడా చేయలేదు.

తలుపులూడి.. చెదలు పట్టి

ఏలూరు జిల్లా వ్యాప్తంగా 11,374 గృహాలను మంజూరు చేశారు. ఇప్పటి వరకు ఏ ఒక్క ఇంట్లోను గృహప్రవేశం జరగలేదు. గత వైసీపీ ప్రభుత్వం ఈ గృహాలను గాలికొదిలేసింది. మౌలిక వసతులు కల్పించలేదు. వినియోగానికి నీటి సరఫరా లేదు. తలుపులు, టాయిలెట్‌లు చాలా వరకు చెదలుపట్టి శిథిలమయ్యాయి.

పూర్తికాకుండానే కేటాయింపులు



విజయవాడలోని జక్కంపూడిలో వైసీపీ రంగులేసి వదిలేసిన వైనం

ఎన్టీఆర్ జిల్లాలో టిడ్కో గృహాలు ప్రస్తుతం 11 వేలు ఉన్నాయి. లబ్ధిదారులందరికీ అలాట్‌మెంట్ పత్రాలు ఇచ్చినా, నివాసయోగ్యంగా లేకపోవటంతో ఈ ఇళ్లలోకి ఇప్పటి వరకు ఎవరూ రాలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన టిడ్కో గృహ నిర్మాణంలో వైసీపీ ప్రభుత్వ హయంలో కేవలం 10 శాతం తప్పితే ఎలాంటి పురోగతి లేదు. దీంతో ఐదేళ్ల కిందట టిడ్కో ఇళ్ల పరిస్థితి ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది.



విజయనగరం సమీపంలోని సారిపల్లిలో పక్కా రోడ్డుకు నోచుకోని టిడ్కో ఇళ్లు

నిలువెత్తు నిర్లక్ష్యం

విజయనగరం జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణం గురించి వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లు నిర్లక్ష్యం చూపించింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 2023 నవంబరు, డిసెంబరులో టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో మార్పులు, చేర్పులు చేసి అందజేసింది. రోడ్లు, కాలువలు, విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. దీంతో లబ్ధిదారులు ఆ ఇళ్లకు వెళ్లలేదు. పలు చోట్ల ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి.

సమస్యల హారం



పశ్చిమగోదావరి జిల్లా భీమవరం టిడ్కో ఇళ్ల వద్ద మురుగునీరు

పశ్చిమగోదావరి జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను గత వైపీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. కాంట్రాక్టర్లకు సొమ్ములు ఇవ్వలేదు. ఇప్పటికీ రూ.150 కోట్లు బకాయిలున్నాయి. భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు పట్టణాల్లో 20,512 టిడ్కో ఇళ్లు కేటాయించగా, గత తెలుగుదేశం ప్రభుత్వం 75 శాతం నిర్మాణాలను పూర్తి చేసింది. దాదాపు 8,500 ఇళ్లను పూర్తి చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక మూడేళ్ల వరకు ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించలేదు. రెండేళ్ల క్రితం లబ్ధిదారులకు అప్పగించినా ఇళ్లలోకి వెళ్లడానికి వారు ఆసక్తి చూపడం లేదు. మూడు పట్టణాల్లోనూ అప్పగించిన ఇళ్లలో దాదాపు ఐదు వేల మంది మాత్రమే నివాసం ఉంటున్నారు. మంచినీరు, లీకేజీ, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయి. ఇంకా 12 వేల ఇళ్లు అప్పగించాల్సి ఉంది.

రూ.342 కోట్లు కావాలి

ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరిలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను గత టీడీపీ ప్రభుత్వం 60 శాతం పూర్తి చేసింది. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిలిచిపోయాయి. నిధులు కేటాయించకుండానే లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వాటిని నవరత్నాలకు మళ్లించింది. దీంతో పేదల సొంతింటి కల నెరవేరలేదు. ఇంటిపై ప్రభుత్వం తీసుకున్న రుణానికి నెలనెలా వాయిదాలు చెల్లించాలని బ్యాంకుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో లబ్ధిదారులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 7,200 మంది టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు ఉన్నారు. ఐదేళ్లపాటు నిలిచిపోయిన పనులు పూర్తి చేసేందుకు రూ.342.29 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు.



ఒంగోలు సమీపంలోని చింతల వద్ద టిడ్కో ఇళ్ల ప్రాంగణంలో నిలిచి ఉన్న నీరు



కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం రుద్రవరం వద్ద టిడ్కో గృహాల పరిస్థితి

ఇంకా 5536 ఇళ్లు పెండింగ్‌లోనే...

గత టీడీపీ ప్రభుత్వంలో కృష్ణా జిల్లాలో 13,712 టిడ్కో గృహాల నిర్మాణాలను ప్రారంభించింది. అందులో 8176 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయగా, ఇంకా 5536 ఇళ్లను పెండింగ్‌లో పెట్టారు. ఇందులో 65 శాతం మేర నిర్మాణ పనులను టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేశారు. వైసీపీ ప్రభుత్వంలో తగిన మౌలిక వసతులు కూడా కల్పించలేదు. కొందరు లబ్ధిదారుల పేర్లను మార్చేశారు. కొన్నిచోట్ల వివిధ కారణాలతో గృహాల సంఖ్యను కుదించారు.

శిథిలావస్థలో...



తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు సమీపంలోని సింగవరంలో పాడైన టిడ్కో ఇళ్లు

తూర్పుగోదావరి జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వ వైఖరి వల్ల టిడ్కో గృహాలు ధ్వంసం అయ్యాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో చాలా ఇళ్ల నిర్మాణాలను దాదాపు పూర్తి చేసినప్పటికీ, తర్వాత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. కొన్ని ప్రాంతాల్లో కొంతవరకు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసింది. నిడదవోలులో రెండో దశలో మొదలెట్టిన 1152 ఇళ్లు, కొవ్వూరులో 480 ఇళ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. మౌలిక సదుపాయాలు లేవు. నిడదవోలులో పూర్తిగా శ్లాబ్‌లు కూడా వేయలేదు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి.

ఇంకా పూర్తికావాల్సినవి 10,236

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 32,304 టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, ఇప్పటి వరకూ 22,068 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. గుంటూరు నగరంలోని వెంగళాయపాలెంలో ఫేజ్-2 కింద 1,392 ఇళ్లు, సత్తెనపల్లిలో 160 ఇళ్ల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి. సత్తెనపల్లిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. గుంటూరులో ఇళ్లకు రంగులు వేయాల్సి ఉంది. తెనాలిలో ఫేజ్- 2 కింద 1,008, చిలకలూరిపేటలో 1,008, రేపల్లెలో 1,344, వినుకొండలో 1,440, పిడుగురాళ్ల కొండమోడులో 2,832, మాచర్లలోని గొర్రెలమండీలో 1,056 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. గుంటూరు అడవితక్కెళ్లపాడులో లబ్ధిదారులకు ఇచ్చిన టిడ్కో ఇళ్లు సమస్యలమయంగా ఉంది. అక్కడ నివసిస్తున్న 4,192 కుటుంబాలు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాయి.

అడవులను తలపించేలా...

పల్నాడు జిల్లాలోని మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్ల ప్రాంగణాల్లో మౌలిక వసతులు లేవు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజి, రోడ్లు తదితర సమస్యలు ఉన్నాయి. ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. అనేక ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లు బూజు పట్టగా, ప్రాంగణాలు పిచ్చి చెట్లతో అడవులను తలపిస్తున్నాయి. నిర్మాణంలో ఉన్న ప్రాంతాల్లో అయితే ఇనుప చువ్వలు తుప్పు పట్టిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేసింది. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించినా తగిన సదుపాయాలు లేవు.

నామినేటెడ్‌లో బీసీలకు కోటా

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గిపోయాయి.. దీంతో వారు 16,500 పదవులకు దూరమయ్యారని గుర్తుచేశారు. వాటిని పునరుద్ధరించేందుకు ఎదురవుతున్న న్యాయపరమైన సమస్యలపై అధికారులతో ఆయన చర్చించారు. బీసీల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టంపై మంత్రుల కమిటీ చేసిన సూచనలను అధికారులు వివరించారు. మరికొంత కసరత్తు తర్వాత సాంకేతిక, న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఈ చట్టాన్ని తీసుకురావాలని సీఎం సూచించారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనపైనా సమీక్షించారు. బాలికల హాస్టళ్లను తక్షణమే మరమ్మతు చేయాలని ఆదేశించారు. డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీల చెల్లింపు, ట్యూటర్ ఫీజు చెల్లించాలని ఆదేశించారు. 'గత ప్రభుత్వం పెట్టిన రూ.110 కోట్ల డైట్ బిల్లుల బకాయిల్లో ఇప్పటికే రూ.76.38 కోట్లు చెల్లించాం. మిగిలిన రూ.34.14 కోట్ల పెండింగ్ బిల్లులు కూడా ఇవ్వాలి. కాస్మోటిక్ బిల్లులు రూ.20కోట్లు పెండింగ్‌లో ఉంటే మేమొచ్చాక రూ.7.10 కోట్లు చెల్లించాం. విద్యార్థులకు ట్రంక్ బాక్సులు, ఇతర వస్తువులకు గాను బడ్జెట్‌లో రూ.18 కోట్లు కేటాయించాం. వాటిని త్వరగా కొనుగోలు చేసి విద్యార్థులకు అందించాలి' అని స్పష్టం చేశారు.

బీసీ భవనాల కోసం భూసేకరణ

ఉమ్మడి జిల్లాల్లో 13 బీసీ భవనాల నిర్మాణాలకు 2016-17లో నాటి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. ఒక్కో భవనానికి రూ.5 కోట్లు ఖర్చవుతుంది. వీటిలో 3 నిర్మాణంలో ఉన్నాయి. వ్యయం పెరిగిన నేపథ్యంలో ఒక్కో బీసీ భవన్‌కు రూ.10 కోట్లు కేటాయించాలని బీసీ నేతలు కోరుతున్నారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మూడు బీసీ భవనాలను త్వరగా పూర్తి చేయాలని, మిగిలిన భవనాల నిర్మాణానికి ఇతర జిల్లాల్లో భూసేకరణ పూర్తి చేయాలని సీఎం సూచించారు. 'బీసీల రూ.896 కోట్ల రుణానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి. అదేవిధంగా మిగిలిపోయిన 4 కాపు భవనాల నిర్మాణాలకు అవసరమైన నిధులు కేటాయించి పూర్తిచేయాలి. ప్రతి సామాజికవర్గానికి కోఆపరేటివ్ ఫైనాన్స్ ఏర్పాటు చేసి ఆయా వర్గాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలి. ప్రతి సామాజికవర్గంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న వాళ్లు ఎంతో కొంత సాయం చేయాలని భావిస్తున్నారు. ఇలాంటివారిని ప్రోత్సహించి ఆర్థికంగా ఆయ సామాజికవర్గాల్లో ఉన్న పేదలను పైకి తెచ్చేందుకు ప్రయత్నం చేయాలి' అని పేర్కొన్నారు. త్వరలో ఎస్ఆర్ శంకరన్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. 26 జిల్లాల్లోని 104 బీసీ హాస్టళ్లలో పైలట్ ప్రాజెక్టులుగా దీన్ని అమలు చేయనున్నారు.

సామాజిక పెన్షన్ల తనిఖీ చేయాలి..

రాష్ట్రంలో పెన్షన్లు పొందుతున్న దివ్యాంగుల్లో పలువురు అనర్హులు ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్న సంగతి తెలిసిందే. అర్హులందరికీ పెన్షన్లు, పథకాలు అందాలన్నదే తమ ఉద్దేశమని, అనర్హులకు ఇవ్వడం సరికాదని ఈ సందర్భంగా అన్నారు. ఎవరు అర్హులు, ఎవరు కాదో తేలాలంటే నిర్దిష్ట నిబంధనలు అమలు కావాలన్నారు. అనర్హులను తొలగించేందుకు పూర్తిస్థాయిలో పింఛన్ల తనిఖీ చేపట్టాలని ఆదేశించారు. పింఛన్ల తనిఖీని కొందరు తొలగింపు కార్యక్రమమంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. దీనిపై అర్హులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని సీఎం భరోసా ఇచ్చారు. 3 నెలల్లో దివ్యాంగుల పింఛన్లపై తనిఖీలు పూర్తి చేయాలన్నారు. తప్పుడు ధ్రువపత్రాలు ఇచ్చే వైద్యులు, అధికారులు, సిబ్బందిపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. తప్పుడు సర్టిఫికెట్ ఇస్తే.. ఎప్పటికైనా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

'పార్శిల్‌లో మృతదేహం' ఆచూకీ లభ్యం

- కాళ్ల గ్రామవాసి పర్లయ్యదిగా గుర్తింపు
- పని ఇప్పిస్తానని తీసుకువెళ్లి హత్య?
- పలు జిల్లాల్లో తీవ్ర గాలింపు అనంతరం అదుపులోకి నిందితుడు శ్రీధర్ వర్మ
- మచిలీపట్నంలో పట్టుకున్న పోలీసులు



మృతుడు బర్రె పర్లయ్య



నిందితుడు శ్రీధర్‌వర్మ(ఫైల్)

ఉండి/భీమవరం క్రైం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పార్శిల్‌లో మృతదేహం డోర్ డెలివరీ కేసు చిక్కుముడులు వీడుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండికి చెందిన సాగి తులసికి ఈ నెల 19న చెక్కపెట్టెలో మృతదేహం వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితులు తులసి చెల్లెలు రేవతి, ఆమె భర్త తిరుమాని శ్రీధర్‌వర్మ(సిద్ధార్థ వర్మ/సుధీర్ వర్మ)ను నిందితుడిగా తేల్చారు. పార్శిల్‌లో వచ్చిన మృత దేహాన్ని కాళ్ల గ్రామ శివారు గాంధీనగర్‌కు చెందిన బర్రె పర్లయ్యదిగా గుర్తించారు. పర్లయ్య వారం రోజులుగా కనిపించకపోవడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చింది. అంతకు రెండు రోజుల ముందే ఆయనను శ్రీధర్ వర్మ తన ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లి, తీసుకురావడాన్ని వారు చూశారు. పర్లయ్యను శ్రీధర్ వర్మ తన చెరువు పనికి, ఇంటి వద్ద తాపీ పనికి మూడు రోజులపాటు తీసుకువెళ్లాడు. అనంతరం ఆయన కనిపించలేదు. పర్లయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన పర్లయ్య భార్యా పిల్లలను పట్టించుకోకపోవడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. కుమారులు పర్లయ్యను పట్టించుకోరని స్థానికులు తెలిపారు. దీంతో పర్లయ్య నిత్యం మద్యం తాగి చిన్న చిన్న పనులకు వెళ్లి ఎక్కడో ఓ చోట తలదాచుకుంటాడు. ఆ విధంగానే ఎక్కడికో వెళ్లి ఉంటాడని కుమారులు పట్టించుకోలేదు. కానీ, గ్రామాన్ని విడిచి వెళ్లని పర్లయ్య.. వారం రోజులుగా కనిపించకపోవడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చింది. శ్రీధర్‌వర్మ... మృతదేహాన్ని పార్శిల్ పంపాడని పత్రికల్లో రావడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి మూడు గంటల వరకు ఆ గ్రామంలోని ఒక వ్యక్తి ఇంటి వద్ద సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించారు. శ్రీధర్‌వర్మ పర్లయ్యను ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లడం, తీసుకురావడం గమనించి ఆ మృతదేహం పర్లయ్యదిగా నిర్ధారించారు.

మహిళ ఆచూకీ కోసం

ఈ కేసులో ప్రధాన నిందితుడు శ్రీధర్‌వర్మ.. మృతదేహం పార్శిల్‌ను ఆటో డ్రైవర్‌కు ఇచ్చిన మహిళ ఆచూకీ కోసం జిల్లా పోలీసు యంత్రాంగం గాలిస్తోంది. ఎరుపు రంగు కారులో శ్రీధర్‌వర్మ కలిదిండి నుంచి ఏలూరు వైపు వెళ్లినట్లుగా సీసీ కెమెరాల్లో గమనించారు. దీంతో మృతదేహం పార్శిల్‌ను ఆటో డ్రైవర్ కు ఇచ్చిన మహిళను శ్రీధర్ వర్మ నాలుగో వివాహం చేసుకున్నాడా? లేక కిరాయికి మాట్లాడుకున్నాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో శ్రీధర్‌వర్మ

'పార్శిల్‌లో మృతదేహం డోర్ డెలివరీ' కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న తిరుమాని శ్రీధర్‌వర్మను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం సాయంత్రం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యల్లో భాగంగా అనుమానాస్పదంగా తిరుగుతున్న శ్రీధర్‌వర్మను కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం-బంటుమిల్లి సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వర్మను భీమవరానికి తీసుకువచ్చి విచారిస్తున్నట్లు తెలిసింది.

జర్నలిస్టుపై దాడి కేసు.. మోహన్‌బాబు ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

- ఆయన హృద్రోగి, వైద్యుల పర్యవేక్షణ అవసరం
- హైకోర్టుకు మోహన్‌బాబు లాయర్ల విన్నపం
- విలేకరిని కొట్టారు, గొంతు పట్టి పిసికారు
- హత్యాయత్నమే: జర్నలిస్టు తరఫు వాదనలు



హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సినీ నటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. మోహన్‌బాబు ఆయన కుమారుడు మంచు మనోజ్ మధ్య ఘర్షణల నేపథ్యంలో జల్‌పల్లిలో ఉన్న మోహన్‌బాబు ఇంటికి వార్తల కవరేజీ కోసం వెళ్లిన తనపై మోహన్‌బాబు దాడి చేశారని పేర్కొంటూ జర్నలిస్టు రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పహాడీ షరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. మోహన్‌బాబు తరఫున న్యాయవాది వాదిస్తూ, 78 ఏళ్ల వయస్సులో మోహన్‌బాబు గుండె సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారని, నిరంతరం వైద్యుల పర్యవేక్షణ అవసరమని చెప్పారు. మోహన్‌బాబు దుబాయిలో మనుమడిని చూసి వచ్చాక, ప్రస్తుతం తిరుపతిలో ఉన్నారని వెల్లడించారు. తన విద్యాసంస్థల పర్యవేక్షణ కోసం తిరుపతి వచ్చారని చెప్పారు. ముందస్తు బెయిలు పిటిషన్‌ను ప్రభుత్వ న్యాయవాది వ్యతిరేకించారు.

డిసెంబరు 10న మోహన్ బాబు తనయుడు మంచుమనోజ్ విజ్ఞప్తి మేరకు ఆయన వెంట మీడియా మోహన్‌బాబు ఇంటికి రాగా ఆయన ఒక విలేకరి దగ్గరున్న మైక్‌ను లాక్కొని తల మీద కొట్టారు. తీవ్ర గాయాల పాలైన విలేకరిని ఆస్పత్రిలో చేర్చారు. రాచకొండ పోలీసులు మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సోమవారం వాదనల సందర్భంగా జర్నలిస్టు రంజిత్ తరఫు న్యాయవాది వాదిస్తూ, మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని కోరారు. జర్నలిస్టుపై దాడి చేయడమే కాకుండా గొంతు పట్టి నులిమారని చెప్పారు. ఈ మేరకు ఇరు వర్గాలు అఫిడవిట్లు దాఖలు చేశాయి. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మోహన్‌బాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. క్రిమినల్ కేసు కావడంతో డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేసే అవకాశం లేదు. ముందస్తు బెయిలు కోసం మోహన్‌బాబు సుప్రీం కోర్టును ఆశ్రయించడం తప్ప మార్గం లేదు. మోహన్‌బాబు ఈ నెల 24 లోపు పోలీసుల ముందు హాజరు కావాలని గతంలోనే హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంగళవారం సుప్రీంకోర్టులో ప్రయత్నం చేసిన అనంతరం మోహన్‌బాబు పోలీసుల ముందు హాజరవుతారని భావిస్తున్నారు.

విష్ణుతో నాకు ప్రాణహాని

- రాచకొండ పోలీసులకు మంచు మనోజ్ ఫిర్యాదు
- పహాడీషరీఫ్ స్టేషన్‌లో ఏడు పేజీల లేఖ అందజేత



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబంలో తలెత్తిన వివాదం మరో మలుపు తిరిగింది. తన అన్న విష్ణు, ఆయన అనుచరుల నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందంటూ మోహన్‌బాబు చిన్న కుమారుడు మంచు మనోజ్.. రాచకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏడు పేజీల లేఖను పహాడీషరీఫ్ పోలీసులకు అందజేశారు. కుటుంబంలో గొడవలు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన పరిణామాలన్నింటినీ వివరంగా రాసి, కొన్ని సీసీటీవీ ఫుటేజీలను, ఇతర టెక్నికల్ ఆధారాలను పోలీసులకు సమర్పించడంతోపాటు ఫిర్యాదు లేఖను విడుదల చేశారు. ఈ లేఖలో.. మోహన్‌బాబు యూనివర్సిటీలో అక్రమాలు జరుగుతున్నట్లు, విద్యార్థులకు అందాల్సిన సంక్షేమ నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు తన దృష్టికి వచ్చాయని మనోజ్ తెలిపారు. దాంతో ఈ ఏడాది సెప్టెంబరు 11న యూనివర్సిటీ బాధ్యతలు చూస్తు న్న వినయ్ మహేశ్వరిని ఆ అక్రమాలపై నిలదీశానని పేర్కొన్నారు. అయితే ఆయన తనపైనే ఆగ్రహం వ్యక్తం చేశారని, వివిధ ఫోన్ నంబర్ల నుంచి ఫోన్ చేసి బెదిరించారని చెప్పారు. ఇటీవల పరిణామాలను తన లేఖలో మనోజ్ వివరించారు.

విచారణకు రండి

(మొదటటి పేజీ తరువాయి)


న్యాయస్థానం రిమాండు విధించింది. అల్లు అర్జున్ దీనిపై హైకోర్టును ఆశ్రయించగా.. రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తుతో హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం.. ఈ దుర్ఘటనకు ప్రధాన కారణం అల్లు అర్జునేనని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో.. అదే రోజు సాయంత్రం అల్లు అర్జున్ పత్రికా సమావేశం నిర్వహించి, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పిన విషయం విదితమే. అసలు రేవతి మరణం గురించి తనకు మర్నాటిదాకా తెలియదని.. ఆరోజు రాత్రి థియేటర్‌లో పోలీసులు తనవద్దకు రాలేదని బన్నీ చెప్పగా.. థియేటర్ నుంచి ఆరోజు రాత్రి ఆయన్ను తాము దగ్గరుండి బయటకు తీసుకువస్తున్న దృశ్యాలను పోలీసులు మీడియాకు విడుదల చేశారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో.. అల్లు అర్జున్‌ను పోలీసులు విచారణకు పిలవడం గమనార్హం. జరిగిన దుర్ఘటన గురించి మర్నాడు ఉదయం వరకూ తనకు తెలియదని అల్లు అర్జున్ చెప్పిన నేపథ్యంలో.. ఆయన్ను ఎంత సేపు విచారిస్తారు? ఏయేప్రశ్నలు అడిగే అవకాశం ఉందనే అంశం ఆసక్తికరంగా మారింది. కాగా.. ఈ కేసు విషయమై పోలీసులు అల్లు అర్జున్‌ను మంగళవారం ఒక్కరోజే కాక.. రోజూ విచారణకు పిలిచే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాల సమాచారం.

సినీ వర్గాల సమావేశం..

సంధ్య థియేటర్ దుర్ఘటన నేపథ్యంలో బెనిఫిట్ షోలకు, టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో దీనిపై ఫిలిం చాంబర్ సోమవారం కీలక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు హాజరై చర్చించారు. ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వబోమని.. టికెట్ రేట్లు పెంచబోమని అంటే ఎలా అని నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేశారు. "సినిమాకు అనుకున్న బడ్జెట్‌కు మించి ఖర్చు అయినప్పుడు మాత్రమే టికెట్ రేట్లు పెంచాలని అడుగుతాం తప్ప.. ప్రతి సినిమాకూ అడగం" అని నిర్మాత నాగవంశీ అన్నారు. దీనిపై సీఎంను కలిసే ఆలోచన ఏమైనా ఉందా అని విలేకరులు ప్రశ్నించగా.. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారని, ఆయన ఇక్కడికి వచ్చాక ముందు ఆయనతో సమావేశమై తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని నాగవంశీ వెల్లడించారు. సినిమా ఇండస్ట్రీ ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోదని ఆయన పేర్కొన్నారు. కాగా.. టికెట్ రేట్ల పెంపుపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ చైర్మన్ విజేందర్ రెడ్డి ప్రకటించారు. "సినిమా టికెట్ ధరలను పెంచడం వల్ల ప్రేక్షకులు కన్‌ఫ్యూజ్ అవుతున్నారు. పెరిగిన టికెట్ రేట్లతో మధ్య తరగతి ప్రేక్షకులు, విద్యార్థులు సినిమాలకు రాలేకపోతున్నారు. ఇది కలెక్షన్లపైనా ప్రభావం చూపుతోంది. టిక్కెట్ ధరలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం" అని ఆయన చెప్పారు. "తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లే ఏపీ ప్రభుత్వమూ బెనిఫిట్ షోస్, టికెట్ ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది" అని ఆంధ్రప్రదేశ్ ఎగ్జిబిటర్స్ సెక్టార్ చైర్మన్ ఎస్.రామ్ ప్రసాద్ అన్నారు. "తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచి పరిణామం. సినిమాను ఎక్కువ థియేటర్స్‌లో విడుదల చేయడం ఎలా అనే దానిపై నిర్మాతలు దృష్టి పెట్టాలి" అని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సెక్రటరీ బాలగోవింద్ రాజ్ సూచించారు. టీఎఫ్‌పీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ కూడా.. టికెట్ ధరలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం వల్ల చిన్న సినిమాలకు మంచి జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. "పెద్ద సినిమాలకు టిక్కెట్ రేట్లు పెంచడం వల్ల చిన్న చిత్రాలపై భారం పడుతోంది. ఏడాదికి రిలీజయ్యే చిత్రాల్లో చిన్న చిత్రాలే 90 శాతం ఉన్నాయి. కేవలం 10 శాతం మాత్రమే పెద్ద చిత్రాలు ఉంటున్నాయి. చిన్న చిత్రాలకు డిజిటల్ రైట్స్ విషయంలో యూఎఫ్‌వో క్యూబ్ ధరలు అధికంగా ఉన్నాయి. మిగతా రాష్ట్రాల్లో రూ.1500 ఉంటే మన దగ్గర పది వేలు వారానికి వసూలు చేస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్మాతల సాయం..

సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను 'పుష్ప-2' నిర్మాతలు నవీన్ యెర్నేని, రవిశంకర్.. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలసి పరామర్శించారు. అతడి తండ్రికి రూ.50 లక్షల చెక్కు అందజేశారు. బాలుడికి అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. "ఇక ఈ విషయాన్ని రాజకీయం చెయ్యొద్దు. సినీ హీరోల ఇళ్లపై దాడులు చెయ్యొద్దు. శ్రీతేజ త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా" అన్నారు. సినీ పరిశ్రమ విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, పరిశ్రమ ఎక్కడికీ వెళ్లడం లేదని.. వదంతులను ఎవరూ నమ్మొద్దని ఆయన స్పష్టం చేశారు. కాగా.. తొక్కిసలాటలో గాయపడ్డ



శ్రీతేజ ఆరోగ్యం నిలకడగా ఉందని.. అతడు క్రమంగా కోలుకుంటున్నాడని, జ్వరం తగ్గుముఖం పడుతోందని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ ద్వారా తెలిపారు. కాగా.. జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి కోమటి రెడ్డి స్పందించిన తీరు అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను పరామర్శించిన ఆయన.. రేవతి కుటుంబాన్ని, శ్రీతేజను ఆదుకోవడానికి ఆర్య, వైశ్య మహాసభ ముందుంటుందని తెలిపారు. కాగా.. శ్రీతేజకు చికిత్స తామే చేయిస్తున్నామంటూ అల్లు అర్జున్ అబద్ధాలు మాట్లాడుతున్నారని, ఆ ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తోందని తెలంగాణ ఆర్య, వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు ఇచ్చామని చెబుతున్న అల్లు అర్జున్ ఇప్పటికి ఇచ్చింది రూ.10 లక్షలేనన్నారు.

ఓయూ జేఏసీ నేతలకు బెయిల్

అల్లు అర్జున్ ఇంటి ఎదుట నిరసనకు దిగి, దాడికి పాల్పడిన ఆరుగురు ఓయూ జేఏసీ నేతలకు బెయిల్ మంజూరైంది. వారిని అరెస్టు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు.. వనస్థలిపురంలో ఉన్న న్యాయమూర్తి ఇంటికి తీసుకెళ్లి హాజరుపరచగా.. కేసు పూర్వాపరాలు విచారించిన న్యాయమూర్తి వారికి బెయిల్ మంజూరు చేశారు. ఒక్కొక్కరూ రూ.10 వేలు చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు.

పోలీసు బట్టలూడదీసిన స్మగ్లర్ సినిమాకు జాతీయ అవార్డా?

- నేర ప్రవృత్తిని ప్రోత్సహించే చిత్రమిది
- జైభీమ్ చిత్రాన్ని ఎందుకు విస్మరించారు?: టీ మంత్రి సీతక్క

పోలీసు అధికారి బట్టలూడదీసిన సినిమాకు కేంద్రం జాతీయ అవార్డు ఇచ్చిందని, ఇది దేనికి సంకేతమని తెలంగాణ మంత్రి ధనసరి సీతక్క ప్రశ్నించారు. బాధ్యతాయుత స్థానంలో ఉండే పోలీసు అధికారి హేళన అయ్యాడని, స్మగ్లర్ హీరో అయ్యాడని వ్యాఖ్యానించారు. అంబేడ్కర్ స్ఫూర్తితో ఓ లాయర్ చంకలో బిడ్డ, కడుపులో మరో బిడ్డతో అన్యాయానికి గురైన మహిళ కోసం పోరాడిన కథతో వచ్చిన సందేశాత్మక చిత్రం జైభీమ్‌కు అవార్డులు రాలేదు కానీ, పోలీసు వ్యవస్థను, రాజ్యాంగాన్ని కించపరుస్తూ ఓ స్మగ్లర్ కథతో వచ్చిన పుష్పకు జాతీయ పురస్కారం వచ్చిందని అన్నారు. పుష్ప సినిమా నేర ప్రవృత్తిని ప్రోత్సహించేలా ఉందని విమర్శించారు. ప్రజలకు కష్టాలు వస్తే రామ్ చరణ్, అల్లు అర్జున్ వస్తారన్న నమ్మకం లేదని.. వీరి కంటే సోనూ సూద్, సమంత, మంచు లక్ష్మి నయం అని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వందల కోట్ల పారితోషికం తీసుకుంటూ కృత్రిమ సమాజంలో బతుకుతున్నారని.. అర్ధరాత్రి పబ్బుల్లో, గోవాలో పార్టీల్లో నటులు ఉంటారని, ప్రజలకు ఇబ్బందులు వస్తే ఒక్కరు కూడా స్పందించరన్నారు. తమిళ నటులకు ఉన్న సామాజిక స్పృహ తెలుగు నటులకు లేదన్నారు.

శ్రీ తేజ కళ్లు తెరుస్తున్నాడు.. మూస్తున్నాడు..!

- అమ్మ ఊరెళ్లిందని నా కూతురుకు చెబుతున్నా
- అల్లు అర్జున్ టీం రూ. 10 లక్షలు చెల్లించింది
- విలేకరులతో శ్రీ తేజ తండ్రి భాస్కర్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంధ్యా థియేటర్ తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన కుమారుడు శ్రీ తేజ కళ్లు తెరుస్తున్నాడు.. మూస్తున్నాడు కానీ తనను గుర్తు పట్టే స్థితిలో లేడని తండ్రి భాస్కర్ తెలిపారు. శ్రీ తేజ కోలుకునేందుకు మరో రెండు నెలల సమయం పట్టే అవకాశముందని వైద్యులు చెబుతున్నారని అన్నారు. తన కూతురు అమ్మ ఎక్కడా అని అడిగితే ఊరెళ్లిందని చెబుతున్నానని కన్నీరు పెట్టుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డితో పాటు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలవడం తమకు మరింత ధైర్యాన్ని ఇచ్చిందని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.25 లక్షల చెక్కు అందచేశారని తెలిపారు. అల్లు అర్జున్ టీం రూ.10 లక్షల డీడీ ఇచ్చిందని, మరో రూ.15 లక్షలు ఇస్తామని చెప్పిందని వెల్లడించారు. తాను మొదటి రోజు ఆసుపత్రిలో రూ. 50 వేలు చెల్లించానని, ఆ తర్వాత నుంచి అల్లు అర్జున్ బృందం సభ్యులే అన్నీ చూసుకుంటున్నారని తెలిపారు. శ్రీ తేజకు అల్లు అర్జున్ అంటే చాలా ఇష్టమని, నెలరోజుల ముందు నుంచే ప్రీమియర్ షో చూసేందుకు కుటుంబమంతా ప్లాన్ చేసుకున్నామని వెల్లడించారు. మూడు రోజుల ముందు స్నేహితుల సహకారంతో సినిమా టికెట్లు తీసుకొని సినిమా చూసేందుకు వెళ్లినట్లు తెలిపారు. అల్లు అర్జున్‌పై కేసు వాపసు తీసుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు శ్రీతేజ తండ్రి భాస్కర్ తెలిపారు.

గాంధీభవన్‌కు అల్లు అర్జున్ మామ!

హైదరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సినీ హీరో అల్లు అర్జున్ మామ.. కాంగ్రెస్ పార్టీ నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి సోమవారం గాంధీభవన్‌లో మెరిశారు. అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారం.. అధికార, ప్రతిపక్షాల మధ్య వాద, ప్రతివాదాలకు దారి తీస్తున్న నేపథ్యంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిసేందుకు ఆయన వచ్చారు. దీపాదాస్ మున్షీకి ఆయన పరిచయం లేకపోవడంతో అతి కొద్ది నిమిషాలు మాత్రమే మాట్లాడి తిరిగి వెళ్లిపోయారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, పార్టీ నేతలను కలిసేందుకు వచ్చానంటూ ఆయన మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. చంద్రశేఖర్‌రెడ్డి దీపాదాస్ మున్షీని కలిసినపుడు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పత్రికా సమావేశంలో ఉన్నారు. కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి వచ్చి వెళ్లిపోయారని తెలుసుకున్న ఆయన.. ఫోన్ చేసి మాట్లాడారు.

నిర్మాతల లాభాల కోసమే బెనిఫిట్ షోలు

రేవంత్ నిర్ణయాన్ని సమర్థిస్తున్నా: విష్ణు కుమార్‌రాజు

విశాఖపట్నం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్త సినిమాలు విడుదలైనప్పుడు ప్రజాప్రయోజనాల కోసమే బెనిఫిట్ షోలను అనుమతించాలని, నిర్మాతల లాభం కోసం కాదని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులకు నిధుల సేకరణ కోసం గతంలో బెనిఫిట్ షోలకు అనుమతించేవారని, ఇప్పుడు నిర్మాతల లాభాల కోసం, రేట్లు పెంచి ఇస్తున్నారని అది తగదన్నారు. ఈ విషయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని తాను సమర్థిస్తున్నానని చెప్పారు. ఏదైనా కేసులో నిందితుడి సీరియల్ నంబరు ఆధారంగా అరెస్టులు చేయడం ఉండదని, అందులో కీలకపాత్ర ఎవరిదనే దానిపైనే ఉంటుందన్నారు.

ఒకే అంశంపై బహుళ ఎఫ్‌ఐఆర్‌లు అనుమతించొద్దు

- హైకోర్టులో సజ్జల భార్గవరెడ్డి పిటిషన్

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టారంటూ వివిధ పోలీసు స్టేషన్లలో తన పై కేసులు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒకే అంశం పై బహుళ ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడానికి వీల్లేదని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టం చేసిందన్నారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన వ్యవహారంలో శ్రీసత్యసాయిజిల్లా రొద్దం పోలీసులు నమోదు చేసిన కేసును మొదటి ఎఫ్‌ఐఆర్‌గా పరిగణించి, ఇదే వ్యవహారం పై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను వాంగ్మూలాలుగా పరిగణించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

నా కుటుంబాన్ని విక్రాంత్ రెడ్డి బెదిరించారు

- ముందస్తు బెయిల్ ఇస్తే దర్యాప్తుపై ప్రభావం
- ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన కేవీరావు

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు, కాకినాడ సెజ్ వాటాల బదిలీ వ్యవహారంలో సీఐడీ నమోదు చేసిన కేసులో మొదటి నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి తనను, తన కుటుంబ సభ్యులను బెదిరించారని ఫిర్యాదుదారు కర్నాటి వెంకటేశ్వరరావు(కేవీరావు) హైకోర్టుకు నివేదించారు. వాటాల బదిలీ వల్ల తాను, తన కుటుంబ సభ్యులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయామని, మానసిక క్షోభ అనుభవించామని పేర్కొన్నారు. విక్రాంత్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌లో ప్రతివాదిగా చేర్చుకొని తన వాదనలు కూడా వినాలని కేవీ రావు సోమవారం ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. వాటాల అక్రమ బదిలీ వ్యవహారంలో క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తు పై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించాలని కోరారు.

పోలీసు నోటీసులను రద్దు చేయండి

- హైకోర్టును ఆశ్రయించిన పేర్ని నాని, కృష్ణమూర్తి

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గోదాము నుంచి రేషన్ బియ్యం మాయం చేసిన వ్యవహారంలో విచారణకు హాజరుకావాలంటూ మచిలీపట్నం పోలీసులు ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ వైసీపీ నేత పేర్ని నాని, ఆయన కుమారుడు సాయి కృష్ణమూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసు నోటీసులను రద్దు చేయాలని కోరారు. తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు విచారణ జరపనుంది.

మీ తీరు కోర్టు ధిక్కరణే

- లాయర్ తీరుపై హైకోర్టు జడ్జి సీరియస్..షోకాజ్ నోటీసు జారీ

అమరావతి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కోర్టులో అనుచితంగా ప్రవర్తించినందుకుగాను కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో చెప్పాలని న్యాయవాది శివప్రసాద్‌రెడ్డిని హైకోర్టు ఆదేశించింది. నెల్లూరులో వీధి దుకాణాలు కేటాయింపు టెండర్ విధివిధానాలను సవాల్ చేస్తూ పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు సోమవారం విచారణకురాగా న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంలో చర్యలన్నింటినీ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు కోర్టుకు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన సింగిల్ జడ్జి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. ఆ తరువాత కూడా శివప్రసాద్‌రెడ్డి బిగ్గరగా మాట్లాడుతూ మధ్యంతర ఉత్తర్వుల కోసం పట్టుబట్టారు. దీనిపై న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

అర్జీదారులకు అతిథి మర్యాదలు

పార్వతీపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అర్జీదారుల పక్కనే కూర్చుని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ వినతులు స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన వారిని కూర్చొబెట్టి.. టీ ఇచ్చిన తర్వాత అర్జీలు స్వీకరించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. ఈ మార్పులపై అర్జీదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పార్వతీపురం కలెక్టరేట్‌లో అర్జీదారుల పక్కనే కూర్చుని మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జగన్‌కు కేడర్ 'షాక్'

- ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలకు మేం రాలేం!
- 7 నెలలకు 'అమ్మఒడి' ఇచ్చాం
- మరి..'అమ్మకు వందనం'పై యాగీ సబబేనా?
- అధినేత తీరుపై కార్యకర్తల్లో అసంతృప్తి

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి పార్టీ ముఖ్యనేతలు, కేడర్ 'షాక్' ఇస్తోంది. రాష్ట్రంలో విద్యుత్తు చార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఈ నెల 27వ తేదీన అన్ని నియోజకవర్గాల్లో ఆందోళనలు చేయాలంటూ జగన్ ఇచ్చిన పిలుపుపై ఆ పార్టీ కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. 'మేం రాలేం' అని తెగేసి చెబుతున్నట్లు సమాచారం. అలాగే.....వచ్చే నెల మూడో తేదీ లోపు ఫీజు రియింబర్స్‌మెంట్, అమ్మకు వందనం పథకాలు అమలు కోరుతూ ధర్నాలు చేయాలన్న అధినేత ఆదేశాన్నీ సీరియస్‌గా ఎవరూ తీసుకుంటున్నట్టు కనిపించడం లేదు. ప్రభుత్వం ఏర్పడి కనీసం ఏడాదైనా కాకుండానే వ్యతిరేక ఆందోళనలు ఎలా చేస్తామంటూ కేడర్.. అధినాయకత్వాన్ని నిలదీస్తోంది. అసలేం జరిగిందంటే.. చంద్రబాబు హయాం అంతా విద్యుత్ చార్జీల బాదుడే బాదుడు అంటూ 2019లో జగన్ అధికారంలోకి వచ్చారు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ.. బాదుడు కాస్తా బేదుడుగా మారిపోవడంతో జనం బెంబేలెత్తిపోయారు. ఈ క్రమంలో 2022-23లో రూ.8113.60 కోట్లు, 2023-24లో రూ.11,826.42 కోట్ల మేర ఇంధన సర్దుబాటు చార్జీల కింద వసూలు చేసుకునేందుకు ఆమోదం తెలపాలంటూ .. విద్యుత్తు నియంత్రణ మండలికి ఇంధన శాఖ ఆమోదం కోసం పిటిషన్ ఇచ్చింది. ఈ పిటిషన్ వేసేందుకు ఇంధన శాఖకు జగన్ అనుమతి ఇచ్చారు. ఈ పిటిషన్లు ఏపీఈఆర్‌సీ చైర్మన్‌గా జస్టిస్ నాగార్జున రెడ్డి ఉన్న సమయంలోనే అందజేశారు. ఇంధన సర్దుబాటు చార్జీలపై దాఖలయ్యే పిటిషన్‌ను 90 రోజుల్లో ఈఆర్‌సీ పరిష్కరించాలి. అయితే.. 2022 -23 సర్దుబాటు చార్జీలపై ఈఆర్‌సీ నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేసింది. అదేవిధంగా .. సార్వత్రిక ఎన్నికలు ముందు ముఖ్యమంత్రిగా జగన్ ఆమోదంతోనే .. 2023-24 సంవత్సరానికిగాను రూ.11,826.42 కోట్ల మేర ఇంధన సర్దుబాటు చార్జీలను వసూలు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలంటూ ఈఆర్‌సీ ముందు డిస్కమ్‌లు దరఖాస్తు చేసుకున్నాయి. గతంలో ఇచ్చిన రూ.8,113.60 కోట్లు, రూ.11,826.42 కోట్ల మేర డిస్కమ్‌లు వేసిన ఇంధన సర్దుబాటు చార్జీల పిటిషన్లపై ఈఆర్‌సీ చైర్మన్ నిర్ణయం తీసుకోలేదు. సార్వత్రిక ఎన్నికల తర్వాత 2022-23కుగాను రూ.6,072 కోట్లు, 2023-24లో రూ.11,826.42 కోట్లకుగాను రూ.9,412 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదం తెలిపింది. ఈ మొత్తం (రూ.15,484 కోట్లు) ఇంధన సర్దుబాటు చార్జీల భారమంతా..జగన్ జమానాలోదేనని వైసీపీ నేతలు సైతం అంగీకరిస్తున్నారు. అయితే.. ఎన్నికలకు ముందు కూటమి విద్యుత్తు చార్జీలు తగ్గిస్తామంటూ హామీ ఇచ్చినందున .. వైసీపీ హయాంలో పెరిగిన విద్యుత్తు చార్జీలను తగ్గించాల్సిందేనని పట్టుబట్టాలని జగన్ డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌తోనే .. జనంలోకి వెళ్లాలని ముఖ్యనేతలకు పిలుపునిచ్చారు.

జనం అడిగితే ఏమి చెప్పాలి?

విద్యుత్తు చార్జీలను తగ్గించాలన్న డిమాండ్‌తో జనం దగ్గరకు వెళితే రాగల పరిణామాలను తలుచుకుని వైసీపీ కార్యకర్తలు, నేతలు ఆందోళనకు గురవుతున్నారు. అవి వైసీపీ ప్రభుత్వపాలనలో ప్రతిపాదించిన విద్యుత్ చార్జీలే కదా జనం అడిగితే ఏం సమాధానం చెప్పాలని మల్లగుల్లాలు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే స్కూలుకు పిల్లలను పంపే తల్లుల ఖాతాలో 'అమ్మ ఒడి' కింద డబ్బులు వేస్తామంటూ ప్రతిపక్ష నేతగా జగన్ హామీ ఇచ్చారు. అయితే, 2019మే30న అధికారాన్ని చేపట్టిన జగన్....2020 జనవరిలోగానీ, అంటే ఏడునెలలకుగానీ 'అమ్మ ఒడి'ని ప్రారంభించలేదు. తాము అధికారంలోకి వస్తే 'అమ్మకు వందనం' అందిస్తామని కూటమి నేతలు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. 2024 జూన్‌లో అధికారంలోకి వచ్చారు. అయితే, ఆరు నెలలు గడిచినా కూటమి ప్రభుత్వం ఇంకా పథకాన్ని ప్రారంభించలేదని జగన్ ఆరోపిస్తున్నారు. పనిలో పనిగా..తాను ప్రభుత్వంలోకి వచ్చిన వెంటనే అమ్మఒడిని ఇచ్చానని బుకాయించేందుకు ప్రయత్నించారు. దీంతో తమ అధినేత తీరుపై కేడర్ విస్మయం వ్యక్తం చేస్తోంది.

మాజీ మంత్రి కాకాణి అనుచరుడిపై లైంగిక దాడి కేసు

- ఉద్యోగం ఆశ చూపి అత్యాచారం
- బాధిత మహిళ ఫిర్యాదుతో కేసు
- పోలీసుల అదుపులో వెంకట శేషయ్య

వెంకటాచలం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల వెంకట శేషయ్య.. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు. వైసీపీ నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు కూడా. భర్త మరణంతో ఒంటరైన మహిళకు ఆయన మాయ మాటలు చెప్పాడు. కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో సోమవారం సాయంత్రం వెంకట శేషయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రమైన వెంకటాచలం పంచాయతీ దొడ్డరాజుపాళెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లైన్‌మన్‌గా ఉద్యోగం చేసేవాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొన్నేళ్ల కిందట ఇంట్లోనే ఆత్మహత్య చేసుకొన్నాడు. మృతుని ఉద్యోగాన్ని కారుణ్య నియామకం కింద ఇప్పిస్తానంటూ లైన్‌మన్ భార్యకు వెంకట శేషయ్య నమ్మబలికి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. వెంకటాచలం స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంగళవారం కోర్టులో హాజరు పరచనున్నారు. కాగా, సోమవారం రాత్రి 10.30గంటలకు ఇద్దరు న్యాయవాదులు, భారీ అనుచరగణంతో నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖరరెడ్డి అర్ధరాత్రి వరకూ స్టేషన్‌లోనే ఉన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి లోకేశ్ అండ

- బ్రెయిన్ స్ట్రోక్ చికిత్సకు ఆర్థిక సాయం
- మంత్రికి విద్యార్థుల ధన్యవాదాలు



అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. సకాలంలో స్పందించి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడేందుకు సాయం చేశారు. శ్రీకాకుళానికి చెందిన మురపాల అనూష నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల ఆమెకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆస్పత్రికి తరలించారు. ఆమె ప్రాణాన్ని కాపాడేందుకు మెరుగైన వైద్యం కోసం సహాయం చేయాలని విద్యార్థులు ఎక్స్ ద్వారా మంత్రిని కోరారు. వెంటనే స్పందించిన లోకేశ్.. సొంత ఖర్చుతో మెరుగైన సాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆ విద్యార్థిని ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడింది. ఈ సమస్యపై తక్షణం స్పందించిన మంత్రికి విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థిని పద్మజ ఎక్స్‌లో స్పందిస్తూ... గతంలోనూ నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో భోజనం సమస్య ఉందని చెప్పగానే మంత్రి స్పందించి పరిష్కరించారని తెలిపింది. ఇప్పుడు అదే క్యాంపస్ విద్యార్థినిని ప్రాణాపాయ స్థితిని నుంచి కాపాడారని వెల్లడించింది. 'మీరు చేసే ప్రతి పని మాలో ధైర్యాన్ని, ఉత్సాహాన్ని నింపుతోంది. ఒక అన్నలా మాకు అండగా నిలుస్తున్నారు. అడిగిన వెంటనే సాయం చేస్తున్నారు. మీరు చేసిన సాయానికి జీవితాంతం రుణపడి ఉంటాం' అని పేర్కొంది.

టీడీపీ కార్యకర్తకు భరోసా..

తీవ్ర అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న టీడీపీ కార్యకర్త, ఎన్టీఆర్ అభిమాని కే మల్లికార్జునరెడ్డికి మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా ఉంటూ, లోకేశ్ సేవా సమితి పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహించిన నెల్లూరుకు చెందిన మల్లికార్జునరెడ్డికి షుగర్ వ్యాధి కారణంగా ఒక కాలు తొలగించాల్సి వచ్చింది. ఇటీవల రెండో కాలుకు పక్షవాతం రావడంతో నడవలేని స్థితిలో ఉన్నారు. ఈ విషయం మంత్రి లోకేశ్ దృష్టికి రావడంతో ఆయన పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మల్లికార్జున్‌రెడ్డి వెంటనే కోలుకోవాలని ఆకాంక్షించారు. లోకేశ్ సూచనమేరకు మంత్రి నారాయణ వీడియో కాల్ ద్వారా మల్లికార్జునరెడ్డి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో స్వయంగా కలుస్తానని చెప్పారు. సాయం కోరిన వెంటనే స్పందించిన లోకేష్‌కు మల్లికార్జునరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

తత్కాల్ పథకాన్ని వినియోగించుకోండి: లోకేశ్

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతూ సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థుల అభ్యర్థన మేరకు తత్కాల్ పథకాన్ని ప్రవేశపెట్టామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. 'నిర్ణీత రుసుముతో ఈనెల 31 వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశాన్ని కల్పించాం. వివిధ కారణాల వల్ల పరీక్ష ఫీజు చెల్లించని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి' అని లోకేశ్ సోమవారం 'ఎక్స్'లో సూచించారు.

బోధనేతర సిబ్బందితో జేఎల్ పోస్టుల భర్తీ

- ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం

అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జూనియర్ లెక్చరర్ల ఖాళీలను ఇంటర్, డిగ్రీ కాలేజీల్లోని బోధనేతర సిబ్బందితో భర్తీ చేసేందుకు ఇంటర్ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 10 శాతం పోస్టులను అర్హత కలిగిన బోధనేతర సిబ్బందితో భర్తీ చేయనున్నట్లు తెలిపింది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. గతంలో 40 శాతం టీచర్లకు కోటా ఉండేదని, ఇప్పుడు టీచర్లు లేకుండా కేవలం ఇంటర్, డిగ్రీ కాలేజీల్లోని సిబ్బందితోనే భర్తీ చేస్తున్నారని ఏపీటీఎఫ్ అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ అన్నారు.

శ్యామ్ బెనగల్ మృతికి లోకేశ్ సంతాపం

సుప్రసిద్ధ సినీ దర్శకుడు శ్యామ్ బెనగల్ మృతి పట్ల మంత్రి నారా లోకేశ్ సంతాపం తెలియజేశారు. కళాత్మక దృష్టితో వాస్తవిక జీవిత ఘటనలను అద్భుతమైన దృశ్యకావ్యాలుగా ప్రేక్షకులకు చూపించారని కొనియాడారు. పాల విప్లవంపై తీసిన మంథన్ సినిమా తనకెంతో స్ఫూర్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.